రాజకీయ శక్తిగా టీ-మాస్ 6లో..

పాముకాటుకు అన్నదమ్ముల బలి 11లో..

ఈనాడు వనపర్తి
సోమవారం 21 ఆగస్టు 2017 16 పేజీలు

కొనేయ్.. పడేయ్

- ముణ్నాళ్ల ముచ్చటగా చెత్త వాహనాలు
- పురపాలికల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభావం

న్యూస్‌టుడే, నారాయణపేట

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన పురపాలికలలో చెత్త సేకరణ రిక్షాల వినియోగం మూణ్నాళ్ల ముచ్చటగా మారుతోంది. తరచూ మరమ్మతులకు గురై మూలన చేరుతుండడంతో చెత్త సేకరణపై తీవ్ర ప్రభావం పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన పురపాలికలైన గద్వాల, నారాయణపేటతోపాటు జిల్లా కేంద్ర పురపాలికలో 12వ ఆర్థిక సంఘం ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులను వెచ్చించి



టాస్క్ ఫోర్స్

ట్రాక్టర్లు, చెత్త సేకరణ రిక్షాలను కొనుగోలు చేశారు. మహబూబ్‌నగర్ పురపాలికలో 54 చెత్త రిక్షాలు, గద్వాలలో మూడు ట్రాక్టర్లు, 20 చెత్త సేకరణ రిక్షాలు, నారాయణపేటలో రెండు ట్రాక్టర్లు, 20 రిక్షాలు, వనపర్తిలో మూడు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. ప్రస్తుతం ట్రాక్టర్లను అడపాదడపా మరమ్మతు చేయించి కొనసాగిస్తున్నా, చెత్త సేకరణ రిక్షాల్లో 70 శాతం మూలకు చేరాయి. నిర్వహణ లేక అవి నిరుపయోగంగా మారాయి. ట్రాక్టర్లకు సంబంధిత కంపెనీ షోరూంలలో, హైదరాబాద్‌లో మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా, అధికారులు స్థానికంగా ఉన్న మెకానిక్‌లతో ..మిగతా 3లో



నారాయణపేట పురపాలికలో మూలకు చేరిన చెత్త సేకరణ రిక్షాలు

వర్షాభావ పరిస్థితులు వరి పంటపై ప్రభావం చూపించాయి. జూన్, జులై, ఆగస్టు నెలల్లో కురిసిన వర్షాలకు ఏ ఒక్క చెరువు, కుంట నిండలేదు. చెరువులు, కుంటల నీటి ఆధారంగా పండించే వరిపైరును నేటికీ సాగు చేయలేదు. వర్షం కోసం రైతులు నిత్యం ఎదురుచూస్తూనే ఉన్నారు. వరిధాన్యం దిగుబడిపై వర్షాభావం దెబ్బకొట్టింది. ఖరీఫ్‌లో పండించే సన్నరకాల బియ్యంపై తీవ్ర ప్రభావం పడినట్లేనని రైతులు అంటున్నారు. వానాకాలం దిగుబడిపై ఆధారపడే బియ్యం ధరలు ఉంటాయి. ఈసారి ధరలకు రెక్కలొచ్చే అవకాశాలు లేకపోలేదు.



గోపాల్‌పేట శివారులో బోరునీటితో వరినాట్లకు మడిని సిద్ధం చేస్తున్న రైతు

వరి సాగు తిరోగమనం

- జిల్లాలో తగ్గిన విస్తీర్ణం
- వట్టిపోయిన కుంటలు, చెరువులు
- ఎత్తిపోతల కిందా అంతంత మాత్రమే

న్యూస్‌టుడే, గోపాల్‌పేట

జూన్, జులై మాసాల్లో వర్షాలు బాగా కురిస్తే అన్ని రకాల పంటలు బాగా పండేవి. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఎక్కడా చెరువుల్లోకి నీరు చేరలేదు. దీంతో భూగర్భజలాలూ అడుగంటిపోతున్నాయి. బోర్ల ఆధారంగా వరినాటాలనుకున్న రైతులను బోర్లు నిరాశపరిచాయి. పంట చేతికివచ్చే సమయంలో బోరులో నీరు ఇంకిపోతే పెట్టుబడులూ చేతికి రావని భయపడిన రైతులు అసలు వరిపైర్ల జోలికే వెళ్లలేదు. దీంతో వనపర్తి జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 61,435 ఎకరాలకుగాను వరిపంట కేవలం 12,910 ఎకరాల్లోనే సాగైంది. అంటే జిల్లాలో 48,525 ఎకరాల్లో సాగు తగ్గింది. ఏ గ్రామంలో చూసినా వరిపంట చాలా తక్కువగా కనిపిస్తోంది. నీరులేనిదే వరిపంటను పండించడం అసాధ్యం. జిల్లాలో సాగుకు యోగ్యమైన భూమి 98,244 హెక్టార్లు ఉంది. అందులో ఆయకట్టు విస్తీర్ణం 48,111 హెక్టార్లు ఉంది. వ్యవసాయ భూములు కలిగిన రైతులు 1,37,327 మంది ఉన్నారు. రైతుల్లో చాలామంది వరిపంటలు పండే భూములను బీడుగానే వదిలిపెట్టారు. మండలాల వారీగా వరిసాగు విస్తీర్ణాన్ని పట్టికలో చూడవచ్చు.

ఎత్తిపోతల పథకాలున్నా.. : జిల్లాలో ఎత్తిపోతల పథకాలు, జూరాల కాలువలున్నా వాటికి సమయానికి నీరు రాకపోవడంతో వాటికింద ఆయకట్టుదారులు వరి ..మిగతా 3లో

మండలం	సాధారణ సాగు	సాగైంది(ఎకరాల్లో)
వనపర్తి	2808	718
ఖిల్లాగణపురం	4199	1941
గోపాల్‌పేట	2304	690
రేవల్లి	1441	510
పెద్దమందడి	2264	746
పెబ్బేరు	9353	344
శ్రీరంగాపురం	2914	690
పాన్‌గల్	4548	1348
వీపనగండ్ల	4957	505
చిన్నంబావి	4367	1414
కొత్తకోట	6768	1665
మదనాపురం	6490	1334
ఆత్మకూరు	5678	489
అమరచింత	3340	516
మొత్తం	**61,435**	**12,910**

కొత్త జిల్లాలకు డీసీఈబీలు

- ఆయా జిల్లాల్లోనే పరీక్షల నిర్వహణ
- అధికారులు, ఉపాధ్యాయులతో బోర్డుల ఏర్పాటు

న్యూస్‌టుడే, వీరన్నపేట (మహబూబ్‌నగర్)

జిల్లా విభజన తరవాత జిల్లా సాధారణ పరీక్షల బోర్డు మాత్రం ఉమ్మడిగానే ఉంది.. ఇక్కడి నుంచే గత సంవత్సరం పరీక్షల నిర్వహణ సాగింది.. అయితే తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటైన జిల్లాలకు సైతం డీసీఈబీలను ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. . దీంతో ఆయా జిల్లాల్లో కొత్తగా పరీక్ష విభాగం బోర్డులను సైతం ఏర్పాటు చేసుకున్నారు.. ఇకనుంచి పరీక్షల నిర్వహణ మొత్తం ఆయా జిల్లాల జిల్లా సాధారణ పరీక్షల బోర్డు నుంచి నిర్వహించనున్నారు. ఫలితంగా ఉపాధ్యాయులకు కొంత రవాణా సమస్య తీరినట్టు అయింది.. దీంతోపాటు ప్రశ్నపత్రాలను మరింత భద్రంగా ఉంచేందుకు వీలు కలుగుతుంది..

జిల్లా విభజన తరవాత కూడా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఉమ్మడి సాధారణ పరీక్షల విభాగం నుంచే వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాలకు ప్రశ్నపత్రాలు వెళ్లాయి. ఇటీవల కొత్త జిల్లాలో సాధారణ పరీక్షల బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు రావడంతో ఆ మూడు జిల్లాల్లో డీసీఈబీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లోనే వాటిని నిర్వహించేందుకు నిర్ణయించారు. బోర్డుకు జిల్లా విద్యాశాఖ అధికారి అధ్యక్షుడిగా, సీనియర్ ప్రధానోపాధ్యాయులు కార్యదర్శిగా ఉంటారు. అధ్యక్ష, కార్యదర్శులతో కలిపి మొత్తం 18 మంది ఉంటారు. దీంతో ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు అధ్యక్షులుగా, ఆయా జిల్లాల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయులు కార్యదర్శులుగా ఎంపిక చేసుకున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పరీక్షల నిర్వహణ మొత్తం ఆయా బోర్డుల ద్వారా సాగనుంది. మొత్తంగా ప్రస్తుతం ఉన్న ఉమ్మడి పరీక్షల విభాగానికి భారం సైతం తగ్గనుంది.

- ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు : 3,659
- చదువుతున్న విద్యార్థులు : 4,60,656
- ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు : 1,245
- చదువుతున్న విద్యార్థులు..: 2,30,400

మరింత భద్రత : కొత్త జిల్లాల్లో డీసీఈబీలను ఏర్పాటు చేయడంతో జిల్లాల్లో పరీక్షల నిర్వహణ సులభతరమవడంతోపాటు మరింత పారదర్శకంగా సాగే అవకాశం ఉంది. గతంలో ఉమ్మడి జిల్లాకు ఒక డీసీఈబీ ఉండడంతో ముందస్తుగానే ప్రశ్నపత్రాలను తీసుకెళ్లేవారు. ఈ క్రమంలో పరీక్ష ..మిగతా 3లో



మహబూబ్‌నగర్ : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉమ్మడి పరీక్షల విభాగం కార్యాలయం

సమస్యల వలయం.. రోగుల విలవిల

- జిల్లా ఆసుపత్రిలో నిరుపయోగంగా శుద్ధినీటి యంత్రం
- ఉపయోగంలో లేని అంబులెన్సు
- ఏడాదిగా క్యాంటీన్‌కు టెండర్లే లేవు



జిల్లా ఆసుపత్రి వద్ద నిరుపయోగంగా అంబులెన్స్

న్యూస్‌టుడే, వనపర్తి పట్టణం

వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిని సమస్యలు వెంటాడుతున్నాయి. రోగులకు సరిపడా వసతులను కల్పించలేదు. నెల రోజులుగా ఇక్కడి శుద్ధినీటి కేంద్రం పాడై నిరుపయోగంగా మారింది. దీంతో రోగులు శుద్ధినీటి కోసం తంటాలు పడుతున్నారు. ఇతర నీటినే వాడుకుంటున్నారు. చక్రాల కుర్చీలు, స్ట్రెచర్లు నిరుపయోగంగానే ఉన్నాయి. రోగుల సంఖ్యకు అనుగుణంగా ఆసుపత్రిలో వసతులు లేకపోవడంతో వరండాల్లోనే వైద్యం పొందే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆసుపత్రి వెనుక భాగంలో మురుగు, బురద సమస్యా పట్టి పీడిస్తోంది.

పెరుగుతున్న రోగుల సంఖ్య.. : జిల్లా ఆసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతోంది. దానికనుగుణంగా వసతులు మెరుగుపడడం లేదు. ఫలితంగా పలు ఇబ్బందులు పడక తప్పడం లేదు. ఇంతకు ముందు పురపాలక సంఘం, రెవెన్యూ డివిజన్ కేంద్ర, శాసనసభ నియోజకవర్గ కేంద్రంగా కొనసాగిన ప్రాంతీయ ఆసుపత్రి.. వనపర్తి జిల్లా కేంద్రంగా మారడంతో జిల్లా ఆసుపత్రిగా రూపుదిద్దుకుంది. దీనికితోడు జిల్లా కలెక్టర్ జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని తీసుకున్న నిర్ణయం, నిర్వహిస్తున్న సమీక్ష సమావేశాలు, ఆకస్మిక తనిఖీలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించే మహిళలకు కేసీఆర్ కిట్లు ఇస్తుండడంతో ఇక్కడికి వివిధ చికిత్సల కోసం వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ గణనీయంగా పెరుగుతోంది. గతంలో కాలానుగుణ వ్యాధులు సందర్భంగా 400 దాకా బయటి రోగులు వస్తుండేవారు. ప్రస్తుతం ఈ సంఖ్య 800కు చేరింది. ఆసుపత్రిలో చేరి వైద్యం పొందే రోగుల సంఖ్య 150 దాకా ఉండేది. ప్రస్తుతం ఈ సంఖ్య రెట్టింపై 300కు చేరింది. ఆసుపత్రిలో 2017 ఏప్రిల్ నుంచి జులైదాకా కేవలం నాలుగు నెలల్లోనే సుమారు 1500 దాకా ప్రసవాలు జరిగాయి. ఇందుకు సంబంధించి కేసీఆర్ కిట్లు వర్తింపజేయడంలో వనపర్తి మూడో స్థానంలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

సమకూరని మౌలిక వసతులు.. : జిల్లా ఆసుపత్రిలో రోగులకు అవసరమయ్యే మౌలిక వసతులను కల్పించలేదు. వైద్యం పరంగా మెరుగైన సేవలందుతున్నా మౌలిక వసతుల కల్పనా జరగాల్సిన అవసరం ఉంది. నేటికీ ఈ ఆసుపత్రికి మత్తుమందిచ్చే శాశ్వత వైద్యులు కొరవడ్డారు. ఇతర వైద్యులు, సిబ్బంది కొందరు ఇన్‌ఛార్జి బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యాంటీన్‌కు ఏడాదిగా టెండర్లు పిలవడం లేదు. దీంతో దాన్ని అప్పుడప్పుడూ తెరుస్తున్నారు. ఫలితంగా రోగులకు ఇది ఉపయోగపడడం లేదు. ఆసుపత్రికి చెందిన అంబులెన్స్ నాలుగేళ్లుగా తాత్కాలిక మరమ్మతులతో నిరుపయోగంగా మారింది. దీనికి మరమ్మతులు చేయించకపోవడంతో నిరుపయోగంగా మారి శిథిలమవుతోంది. జిల్లా వైద్యాధికారి కార్యాలయానికి చెందిన డ్రైవరును కేటాయించినా పనిలేకుండా ఉంటున్నారు. ఆసుపత్రికి చెందిన ప్రాంగణంలో సీసీ రోడ్లు లేకపోవడంతో వర్షాలకు బురదమయంగా మారుతోంది. దీంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు.


మూసి ఉన్న క్యాంటిన్


నిరుపయోగంగా శుద్ధినీటి ప్లాంటు

ప్రైవేటు అంబులెన్సులకు అడ్డా.. : జిల్లా ఆసుపత్రిలో అంబులెన్సు పనిచేయకపోవడంతో ప్రైవేటు వారి ఇష్టారాజ్యంగా మారింది. రోగులను ఇతర ప్రాంతాలకు తరలించాలంటే అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఆసుపత్రి మైదానమంతా ప్రైవేటు అంబులెన్సులతో నిండిపోతోంది. ఆసుపత్రి మైదానం ప్రైవేటు అంబులెన్సులకు అడ్డాగా మారిందని రోగులు వాపోతున్నారు. ఇక్కడ పోలీసు ఔట్ పోస్ట్, ఆసుపత్రి పర్యవేక్షణ అధికారులున్నా వీటిపై పట్టింపులు కొరవడ్డాయి. కర్నూలు, మహబూబ్‌నగర్ ప్రాంతాల అత్యవసర రోగులను చేరవేసేందుకు సుమారు రూ.3వేల దాకా వసూలు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు.. : జిల్లా ఆసుపత్రి వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కారమయ్యేలా చూస్తాం. ఆసుపత్రిలో సమస్యలంటూ పెద్దగా లేవు. చిన్నపాటివి ఉన్నా రోగులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం. వాటిపై గతంలోనే గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించాం. మరోమారు ఆసుపత్రిలోని ఆయా సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు నివేదిస్తాం. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటాం.

– డా.ఎ.శ్రీనివాసులు, జిల్లా వైద్యాధికారి

వరి సాగు తిరోగమనం


బోరునీటి ఆధారంగా నాటిన వరిపైరు

(మొదటిపేజీ తరవాయి) పంటలను సాగు చేయలేదు. కేఎల్ఐ, భీమా, జూరాల కాలువలకు వరిపంటలకు అనుకూలంగా నీరు వదల్లేదు. కేఎల్ఐ కాలువలకు ఇప్పుడిప్పుడే సాగునీరు వచ్చే అవకాశాల్లేవు. భీమా, జూరాల ఆయకట్టు కాలువలకు నీరు వదిలినా రైతులు ఇంకా పూర్తిగా వరినాట్లు వేయలేదు. జూరాల కాలువలకు ఇటీవలే నీటిని వదిలారు. జూరాల ప్రాజెక్టుకు ఆశించిన స్థాయిలో నీరు వచ్చి చేరితే ఆయకట్టు పెరిగేదే. జూరాల నుంచి కోయిల్‌సాగర్, భీమా ఎత్తిపోతల పథకాలకూ నీటిని నిలిపివేశారు. జిల్లాలోని అన్ని ఎత్తిపోతల పథకాల ద్వారా, ప్రాజెక్టుల కాలువల ద్వారా సాగునీటిని వదిలితేనే వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి.

ఇప్పుడిప్పుడే వరినాట్లు వేస్తున్నారు.. : మొదట్లోనే వర్షాలు బాగా కురిసి ఉంటే వరిసాగు విస్తీర్ణం ఇప్పటికే పెరిగేది. జూరాల ప్రాజెక్టుకూ నీరు ఆలస్యంగా వచ్చి చేరింది. ఇటీవలే కాలువలకు నీరు వదిలారు. దీంతో జూరాల కాలువల కింద ఇప్పుడిప్పుడే వరినాట్లు వేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు వరినాట్లు వేసే అవకాశాలున్నాయి. రోజురోజుకూ వరి సాగు విస్తీర్ణం పెరిగుతోంది. మొత్తానికి జూరాల కాలువల కింద వరినాట్లు పూర్తిగా వేస్తే జిల్లాలో వరిసాగు విస్థీర్ణం 30వేల ఎకరాలకు చేరవచ్చు.

– నూతన్‌కుమార్, వ్యవసాయశాఖ జిల్లా టెక్నికల్ అధికారి

కొనేయ్.. పడేయ్

(మొదటిపేజీ తరవాయి) వాటిని మరమ్మతు చేయిస్తున్నారు. ఫలితంగా అవి తిరిగి మొరాయిస్తున్నాయి. దీనివల్ల వాహనాలు, రిక్షాలు నిరుపయోగంగా మారి ఆయా పురపాలికలలో ఇంటింటి చెత్త సేకరణ ప్రశ్నార్థకంగా మారింది. చెత్త సేకరణ రిక్షాలను టెండర్ ద్వారా కొనుగోలు చేస్తుండడంతో కొన్నిచోట్ల నాసిరకంగా సరఫరా అయి నిరుపయోగానికి కారణమవుతోంది.

12వ ఆర్థిక సంఘం నిధులు వృథా.. : ప్రధాన పురపాలికలకు గతంలో రూ.లక్షల్లో మంజూరైన 12వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన చెత్త రిక్షాలు ఏడాదిలోపే మరమ్మతుకు గురై మూలకు చేరుతున్నాయి.

- మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర పురపాలికలో 12వ ఆర్థిక సంఘం నిధులతో గతంలో కొనుగోలు చేసిన 54 చెత్త రిక్షాల్లో ప్రస్తుతం 34 వినియోగంలో ఉన్నాయి. మిగతా 20 మూలన చేరాయి. వీటి మరమ్మతు ప్రశ్నార్థకంగా మారింది. కొన్ని ఇరుకైన వీధులకు చెత్త రిక్షాలు వెళ్లకపోవడంతో వీధి రహదారులపైనే చెత్తాచెదారం పడేస్తున్నారు. 12వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన రిక్షాలు కొన్ని మూలన చేరడంతో మళ్లీ సాధారణ నిధుల నుంచి అదనంగా మరో పది రిక్షాలను కొనుగోలు చేసి చెత్త సేకరణకు వినియోగిస్తున్నా, ప్రస్తుతం వాటి నిర్వహణ సక్రమంగా లేదు.
- గద్వాలలో కొనుగోలు చేసిన 20 రిక్షాలలో ప్రస్తుతం నాలుగే వినియోగంలో ఉన్నాయి. 16 మూలన చేరాయి.
- నారాయణపేటలో 12వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా కొనుగోలు చేసిన 20 చెత్త రిక్షాలన్నీ మరమ్మతుకు గురై మూలన పడేశారు. ఎనిమిది నెలల క్రితం మూలన చేరిన చెత్త రిక్షాలన్నింటిని విక్రయించారు. సాధారణ నిధులతో కొనుగోలు చేసిన 12 రిక్షాలలో ప్రస్తుతం అయిదు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగతావి మరమ్మతుకు నోచుకోక కార్యాలయ ఆవరణలో మూలన చేరాయి.
- వనపర్తి పురపాలికలో మాత్రం 12వ ఆర్థిక సంఘం నిధులతో ట్రాక్టర్లనే కొనుగోలు చేశారు. ఇక్కడ చెత్త రిక్షాల వినియోగమే లేకపోవడంతో ట్రాక్టర్లు వెళ్లలేని ఇరుకు వీధుల్లో పారిశుద్ధ్య సిబ్బందే చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి ట్రాక్టర్లలో వేసి తరలిస్తుంటారు. ఇక్కడ పుర కార్యాలయానికి చెందిన ట్రాక్టర్లకు తోడు అదనంగా గుత్తేదారుల ట్రాక్టర్లను చెత్త సేకరణకు పురమాయించారు.

తడి, పొడి చెత్త సేకరణకు మంగళం... : చెత్త రిక్షాలను ప్రధానంగా తడి, పొడి చెత్త సేకరణ కోసం కొనుగోలు చేశారు. పురపాలికలలోని వీధుల్లో ఇంటింటికి వెళ్లి వేర్వేరుగా పోగు చేసిన తడి, పొడి చెత్తను రిక్షాలతో తీసుకువచ్చి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించేందుకు పారిశుద్ధ్య విభాగం చెత్త రిక్షాల వినియోగాన్ని తప్పనిసరి చేసింది. కాని ఉమ్మడి జిల్లాలో ఒక్క మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర పురపాలికలో మినహా ప్రధాన పురపాలికాలైన వనపర్తి, గద్వాల, నారాయణపేటలో ఇంటింటి చెత్త సేకరణ కొనసాగడం లేదు. తడి, పొడి చెత్తసేకరణ ఊసు అసలుకే లేదు. దీంతో ఆయా పురపాలికలలోని అంతర్గత వీధులన్నీ చెత్తాచెదారంతో కంపుకొడుతున్నాయి. పర్యావసానంగా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం వనపర్తి పురపాలికలో నిత్యం 32 మెట్రిక్ టన్నుల చెత్తాచెదారం పోగవుతుండగా, గద్వాలలో 25 మెట్రిక్ టన్నులు, నారాయణపేటలో 20 మెట్రిక్ టన్నులు పోగవుతోంది. ఆ మూడు పురపాలికల్లో డంపింగ్ యార్డుల ఏర్పాటు అసంపూర్తిగా మిగిలిపోవడం, చెత్త సేకరణకు సరిపడా వాహనాలు, రిక్షాలు లేకపోవడంతో సగం చెత్తాచెదారం అంతర్గత రహదారులపైనే పేరుకుపోతోంది. వాహనాల ద్వారా తరలిస్తున్న చెత్తను అసంపూర్తిగా మిగిలిన డంపింగ్ యార్డుల్లో వేయలేక పారిశుద్ధ్య కార్మికులు పట్టణ శివారుల్లో పారబోసి వస్తున్నారు.

జిల్లా కేంద్రానికి అదనంగా 50 రిక్షాలు వచ్చాయి : జిల్లా కేంద్ర పురపాలికకు ఇటీవలే మరో 50 చెత్త సేకరణ రిక్షాలు వచ్చాయి. గతంలో ఉన్న 54 రిక్షాల్లో ముప్పైకి పైగా రిక్షాలు వినియోగంలో ఉన్నాయి. ఇంటింటి చెత్త సేకరణ ఇక్కడ కొనసాగుతోంది. మిగతా పురపాలికల్లో ఇంటింటి చెత్త సేకరణ, తడి, పొడి చెత్త నిర్వహణ జరగడం లేదనే విషయం వాస్తవమే. చాలా చోట్ల చెత్త సేకరించే ట్రాక్టర్లు, చెత్త రిక్షాలు మరమ్మతుకు గురై నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రభుత్వం త్వరలో అన్ని పురపాలికలకు కొత్తగా చెత్త సేకరణకు ఆటోలను సరఫరా చేయనుంది.

– మొయినొద్దీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మహబూబ్‌నగర్ పురపాలిక

కొత్త జిల్లాలకు డీసీఈబీలు

(మొదటిపేజీ తరవాయి) కంటే ముందే ప్రశ్న పత్రాలు బయటికి వచ్చి విద్యార్థులను, విద్యాధికారులను ఆందోళనకు గురిచేసిన పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం వీటి ఏర్పాటు కారణంగా పారదర్శకంగా పరీక్షల నిర్వహణ సాగుతుంది. పరీక్షల ఫీజుల చెల్లింపులు, నిర్వహణ ఇబ్బందులు కూడా తప్పుతాయి. డీసీఈబీ ఆధ్వర్యంలో జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు నెల, త్రైమాసిక, అర్ధవార్షిక, వార్షిక పరీక్షల ప్రశ్నపత్రాల కోసం నిర్ణీత రుసుం చెల్లించేవారు. దీంతోపాటు విద్యార్థులకు సంబంధించిన బదిలీ ధ్రువ పత్రా(టీసీ)లను సైతం ఇచ్చేవారు. ఒక్కో సందర్భంలో పదో తరగతి విద్యార్థులకు అవసరమైన అధ్యయన సామగ్రిని సైతం బోర్డు ద్వారా అధికారులు పంపిణీ చేస్తారు. మొత్తంగా కొత్త జిల్లాల్లో పరీక్షలకు సంబంధించిన వ్యవహారాలన్నీ కూడా డీసీఈబీ ద్వారా నిర్వహణ ప్రస్తుతం మరింత సులభతరం కానుంది.

ఆర్థికంగా బలం..

జిల్లా విద్యాశాఖ కార్యాలయాలకు డీసీఈబీలు కీలకంగా ఉంటాయి. పరీక్షల ప్రశ్నపత్రాల సరఫరా కోసం విద్యార్థుల వద్ద ఫీజులు వసూలు చేసి పాఠశాలల యాజమాన్యాలు డీసీఈబీలకు చెల్లిస్తారు. అలా చెల్లించిన వాటితో ప్రశ్నపత్రాలను రూపొందించి ఆయా పాఠశాలలకు అధికారులు అందజేస్తారు. అయితే ప్రతి ఏడాది కూడా పెద్ద మొత్తంలోనే నిధులు మిగులుతాయి. ఈ నేపథ్యంలో వాటిని విద్యార్థులకు అవసరమైన సామగ్రి కొనుగోలుతో పాటు విద్యాపరంగా అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పాటైన విద్యాశాఖ కార్యాలయాల్లో వసతుల లేమి ఉంది. దీని ద్వారా కొంతమేరకైనా వసతులు కల్పించుకునేందుకు వీలు కలుగుతుంది. మొత్తంగా విద్యార్థులకు.. ఉపాధ్యాయులు.. అధికారులకు వీటి ఏర్పాటు కారణంగా ప్రయోజనం చేకూరుతుంది.

నిధులు పంచాల్సి ఉంది

మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో డీసీఈబీలో పెద్ద మొత్తంలో నిధులు మిగిలి ఉన్నాయి. అయితే కొత్తగా జిల్లాల్లో డీసీఈబీలు ఏర్పాటు చేస్తుండగా అక్కడ నిధులు లేవు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఉన్న సమయంలో డీసీఈబీలో రూ.27 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు నిధులు మిగులులో ఉన్నాయి. వాటిని ఆయా జిల్లాల్లో పాఠశాలల వారీగా నిధులు కేటాయించాల్సి ఉంది. త్వరలోనే ఆయా బోర్డుల అధ్యక్షులు, కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేసి దీనిపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ఉత్తర్వులు ఇచ్చారు.. : కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో డీసీఈబీలు ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర విద్యా పరిశోధన సాంకేతిక సంస్థ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటైన జిల్లాలు డీసీఈబీలు ఏర్పాటు చేయడంతోపాటు వాటిలో బోర్డులు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా జిల్లాల పరిధిలోనే ఫీజుల చెల్లింపులు, ప్రశ్నపత్రాల పంపిణీ ఇక ముందు జరగబోతుంది. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కొంత ఉపయోగకరంగా నిర్ణయం ఉంది. ప్రశ్నపత్రాల పంపిణీ సైతం కొంత పకడ్బందీగా సాగేందుకు అవకాశం ఉంది.

– సోమిరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

వనపర్తి

ప్రతిభావంతులకు సన్మానం

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని మర్రికుంట గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు గతంలో రెనాక్ పర్వతాన్ని అధిరోహించిన కవిత, ఆఫ్రికా ఖండంలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన సునీతను ఆదివారం నాగవరంలో స్వేరోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న సంస్థ వ్యవస్థాపకులు, గురుకుల విద్యాలయాల కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ శాలువా కప్పి సన్మానించారు.

23న నాగర్‌కర్నూలుకు తరలి రావాలి

వనపర్తి : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఈనెల 23న నాగర్‌కర్నూలుకు వస్తున్నారని మాదిగ విద్యార్థి సమాఖ్య జిల్లా ఇన్‌ఛార్జి కార్తీకమాదిగ తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై తాత్సారం చేస్తున్న, దాటవేత ధోరణిని అవలంబిస్తున్న భాజపా ప్రభుత్వంపై ఎలా పోరాటాలు చేయాలో దిశానిర్దేశం చేసేందుకు ఆయన నాగర్‌కర్నూలుకు వస్తున్నారన్నారు. జిల్లాలోని మాదిగలంతా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



గోపాల్‌పేటలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో ఆదివారం దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు వెంకటస్వామి, ఆనంద్ రాజు, మహేష్‌గౌడు, వెంకటేష్ పాల్గొన్నారు.

గోపాల్‌పేట : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బస్టాండులోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారు. రాజీవ్ ఆశయాలను నెరవేరుస్తామంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జగన్, బాలయ్య, గోపాల్, పుల్లయ్యయాదవ్, శివకుమార్, నాగశేషియాదవ్, శ్రీశైలంయాదవ్, అబ్దుల్లా, బక్కన్న, సాయిలు, వెంకటయ్య, రాములు పాల్గొన్నారు.

పెబ్బేరు : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం పెబ్బేరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సుభాష్ చౌరస్తాలో



పెబ్బేరులో కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కాంగ్రెస్ నాయకులు మాట్లడుతూ.. రాజీవ్‌గాంధీ హయాంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజశేఖర్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్‌గౌడు, విజయవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్ సాగర్, ఆంజనేయులు, సురేందర్‌గౌడు, ఈశ్వరయ్య, రాములు, సత్యనారాయణ, నర్సింహనాయుడు, నిజాం, ఎల్లస్వామి, బాలయ్య, మౌలాజీరావు, వెంకట్రాములు, దయాకర్ రెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

21వ రోజుకు ఎస్పీఎం ఉద్యోగుల సమ్మె



విద్యుత్తు కార్మికులు సమ్మె చేస్తున్న దృశ్యం

వనపర్తి గ్రామీణం : తెలంగాణ విద్యుత్తు నియంత్రికల మరమ్మతుల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె ఆదివారానికి 21వ రోజుకు చేరింది. దీక్షలో వెంకటేశ్, రమేశ్, జగదీశ్, మౌలాలి, గఫార్, జనార్దన్‌రెడ్డి, ఖదీర్, ఇమ్రాన్, ఖాజా, మహేష్, రాకేష్, మధు, బాలకృష్ణ, కృష్ణ, కిశోర్ కూర్చున్నారు. సంఘం నాయకులు మాట్లడుతూ.. ఎస్పీఎం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. యాజమాన్యం స్పందించి ఎస్పీఎం కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని వారు కోరారు.

ఘనంగా కోట మైసమ్మకు బోనాలు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : మండల కేంద్రం గోపాల్‌పేటలో ఆదివారం సాయంత్రం కోటమైసమ్మ దేవత బోనాల పండగను నిర్వహించారు. ఏటా శ్రావణమాసం ముగిసిన వెంటనే కోట మైసమ్మకు మొక్కులు తీర్చుకునేందుకు బోనాల పండగను నిర్వహిస్తారు. గ్రామ దేవతల కంటే ముందే కోటమైసమ్మ దేవతకు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్థులు తెలిపారు.

బాధితులకు చెక్కుల పంపిణీ



ఖిల్లా : వెంకటాంపల్లిలో ఎంపీటీసీకి చెక్కు అందిస్తున్న నిరంజన్‌రెడ్డి


వెంకటాంపల్లి(ఖిల్లాగణపురం), న్యూస్‌టుడే : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు బాధితులకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.నిరంజన్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం సాయంత్రం స్వయంగా పంపిణీ చేశారు. వెంకటాంపల్లిలో ఎంపీటీసీసభ్యుడు మదన్‌మోహన్ చిన్నకుమారుడు శ్రావణ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతనికి తెరాస సభ్యత్వం ఉండటంతో పార్టీనుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును గ్రామానికి చేరుకున్న ఆయన ఎంపీటీసీ మదన్‌మోహన్‌కు అందించారు. అంతకు ముందు మామిడిమాడ వెనికితండాకు చెందిన సబావత్ మంజులకు శస్త్రచికిత్స ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.18 వేల చెక్కును ఆమెకు మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ కృష్ణానాయక్, సర్పంచులు రామాంజనేయులు, సామ్యానాయక్, వనపర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాళ్ల కృష్ణయ్య, నాయకులు ఆంజనేయులుగౌడ్, విక్రమ్, నర్సింహారెడ్డి, సతీష్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నిరంజన్‌రెడ్డి సమక్షంలో తెరాసలో చేరిక...

వనపర్తి గ్రామీణం : వనపర్తి మండలం సవాయిగూడెం చెరువుముందరితండా, జమ్ములతండా, శ్రీనివాసపూర్‌తండా, పెబ్బేరు మండలం తాటిపాముల తండాలకు చెందిన గిరిజనులు హైదరాబాదులోని లాల్‌బజార్, తిరుమలగిరి ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. ఆదివారం హైదరాబాదులో వనపర్తి మండల పార్టీ మాణిక్యం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి సమక్షంలో ఆయా తండాలకు చెందిన కొందరు నాయకులు తెరాసలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ శంకర్‌నాయక్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్‌యార్డు అధ్యక్షుడు రవికుమార్, నాయకులు వెంకట్రావు, కురుమూర్తియాదవ్, నర్సింహగౌడు, జనార్దన్‌రెడ్డి, కురుమూర్తి, ఉస్మాన్ పాల్గొన్నారు.

అవార్డు పొందిన ఫొటోగ్రాఫర్‌కు సన్మానం

వనపర్తి : భారత ఛాయాచిత్ర సమాఖ్య అసోసియేట్ అవార్డు పొందిన వనపర్తికి చెందిన ఫొటోగ్రాఫర్ ఎస్వీ రమేశ్‌ను శాసనసభ్యుడు చిన్నారెడ్డి ఆదివారం సన్మానించారు.



రమేశ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిన్నారెడ్డి

శాలువా కప్పి అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ ఛాయాచిత్ర పోటీల్లో పాల్గొని సమాఖ్య గౌరవాన్ని పొంది వనపర్తి జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారన్నారు. ఇంకా మంచి చిత్రాలు తీసి మరింతగా ఎదిగి జిల్లా పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.కిరణ్‌కుమార్, రాగివేణు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బంగారు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : జడ్చర్లలో శనివారం నిర్వహించిన సీఎల్ఆర్ ఆల్‌స్టైల్ కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గోపాల్‌పేట మండలానికి చెందిన ఐదుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. బుద్దారానికి చెందిన నితీష్, సల్మాన్, ప్రవీణ్, చీర్కపల్లికి చెందిన బాలపీరు, ఓంకార్ ఈ పోటీల్లో బంగారు పతకాలను సాధించారు. బుద్దారానికి చెందిన పవన్, ప్రశాంత్ బ్రౌన్ బెల్టులు సాధించారని మాస్టర్ సురేందర్ తెలిపారు. బహుమతులు గెలుపొందిన విద్యార్థులను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి అభినందించారన్నారు. విద్యార్థులను ఆదివారం గోపాల్‌పేట సర్పంచి పద్మబాలరాజు, ఎంపీటీసీసభ్యురాలు సరళమ్మ అభినందించారు.

పగలూ వెలుగుతున్నాయ్..



చిన్నమందడిలో వెలుగుతున్న వీధిదీపాలు

పెద్దమందడి, న్యూస్‌టుడే : మండలంలోని పంచాయతీలో ఏర్పాటు చేసిన వీధి దీపాలు నిరంతరరాయంగా వెలుగుతూనే ఉన్నాయి. చిన్నమందడి, దొడగుంటపల్లి, అనుసంధాన తండాలో ఏర్పాటు చేసిన వీధిదీపాలకు నియంత్రికలను ఏర్పాటు చేయకపోవడంతో అవి నిరంతరాయంగా వెలుగుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామాల్లో 30 వీధిదీపాలకు పైనే వెలుగుతుండడంతో పంచాయతీకి అదనపు విద్యుత్తు ఛార్జీలు వస్తున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి ప్రతి వీధిదీపానికి నియంత్రికను అమర్చాలని కోరుతున్నారు.

దుర్గంధంతో అవస్థలు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం వద్ద మురుగు తొలగడం లేదు. బస్టాండు వద్ద నిర్మించిన మరుగుదొడ్ల నుంచి వచ్చే మురుగుతో దుర్వాసన వస్తోంది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు వెళ్లడానికి ప్రత్యేకంగా కాలువలను నిర్మించలేదు. గతంలో తాత్కాలికంగా నిర్మించినవి శిథిలమయ్యాయి. పలితంగా దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు, ప్రమాదకర వ్యాధి కారక క్రిములు ఉత్పన్నమవుతున్నాయి. పందులూ మురుగులో ఆవాసం ఉంటున్నాయి. గతంలోనూ పలుమార్లు పురపాలక సంఘం సిబ్బంది, ఆర్టీసీ నిర్వాహకులకు ప్రయాణికులు, పట్టణ వాసులు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. ప్రధాన రహదారినానుకుని ఉన్న ప్రయాణ ప్రాంగణం ముఖద్వారం వద్ద ఉన్న మురుగు ఇటు పట్టణ ప్రజ



=బస్టాండు ముఖద్వారం వద్ద ఇలా..

లకూ అటు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకొని మురుగు తొలగేలా చూడాల్సిన అవసరం ఉంది.

ప్రవీణ్‌కుమార్‌కు ఘన స్వాగతం

గోపాల్‌పేట(తాడిపర్తి), న్యూస్‌టుడే : మండలంలోని తాడిపర్తిలో రాష్ట్ర గురుకులాల సమన్వయకర్త ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఘన స్వాగతం లభించింది. బుడగజంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సిరిగిరి మన్యం పుష్పగుచ్ఛం అందించి ఆయనకు స్వాగతం పలికారు. తాడిపర్తి, దాని పరిధిలోని నర్సింగాయపల్లిలోనూ ప్రవీణ్‌కుమార్ అంబేడ్కర్ విజ్ఞాన మందిరాలను ప్రారంభించారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా నర్సింగాయపల్లిలో బుడగజంగాల సామూహిక భవనంలో అంబేడ్కర్ విజ్ఞాన భవనాన్ని ప్రారంభించారని మన్యం తెలిపారు.

విద్యార్థులు విజ్ఞానవంతులు కావాలి

ఖిల్లాగణపురం : విద్యార్థి దశలోనే సమాజంపై కనీస అవగాహన, సామాజిక బాధ్యతతో సేవాభావాల్ని పెంపొందించుకొని విజ్ఞానవంతులుగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్‌ఎస్‌ఎస్ మండల ప్రముఖ్ భాస్కర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ఆశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. విద్యార్థుల కోసం త్వరలో సంచార గ్రంథాలయం ఏర్పాటు చేస్తామన్నారు.

వనపర్తి టౌన్						
పోలీస్ స్టేషన్ : 232333 (100)	ఫైర్ స్టేషన్: 101	అంబులెన్స్: 108	విద్యుత్ ఎంక్వైరీ: 232104	గ్యాస్ ఏజెన్సీ: 232235	ఎండీఓ కార్యాలయం: 232043	మహిళల వేధింపుల ఫిర్యాదు: 1091
ప్రభుత్వ ఆసుపత్రి: 232113	అవినీతి నిరోధక శాఖ: 9440446143		నీటి పంపిణీ: 232044	తహశీల్దార్ కార్యాలయం: 232046	అవినీతి నిరోధక శాఖ: 9440446143	

వనపర్తి

నీటిని నిల్వ ఉంచుకోరాదు

మద్దిగట్ల(పెద్దమందడి) : సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఇళ్లల్లో నీటిని నిల్వ ఉంచుకోరాదని, ఎప్పటికప్పుడు శుభ్రమైన నీటినే వాడుకోవాలని మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారిణి రచన తెలిపారు. ఇళ్ల మధ్య పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పాటించాలని, ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతతోపాటు ఇంట్లోని నిల్వ నీటిని పారబోసి శుభ్రపరుచుకోవాలన్నారు.

మడుగులోనే అడుగులు

చినుకు పడితే మండల కేంద్రంలోని రోడ్లన్నీ బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సీసీ రోడ్లు క్రమపద్ధతిలో కాకుండా ఎత్తుపల్లాలుగా నిర్మిచడంతో వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారుతోంది. ఇష్టం వచ్చినట్లు సీసీ రోడ్లను తవ్వడంతో ఎక్కడ పడితే అక్కడ గోతులు ఏర్పడ్డాయి. గతంలో నిర్మించిన అనేక రోడ్లు దెబ్బతిని నీరు నిలుస్తోంది.

- న్యూస్‌టుడే, పెబ్బేరు

చిత్ర కదంబం


జూరాల క్యాంపు రోడ్డులో నిలిచిన నీరు


బస్టాండు ముందు భాగంలో..


విద్యానగర్‌కాలనీ రోడ్డులో..


మార్కెట్ పక్క రోడ్డు ఇలా..

సామూహిక భవనాలను సద్వినియోగం చేసుకోవాలి

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : రూ.లక్షలు పెట్టి నిర్మిస్తున్న సామూహిక భవనాలు వృథాగా ఉంచకుండా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చిన్నారెడ్డి కోరారు. ఆదివారం సాయంత్రం శ్రీరంగాపురం మండల కేంద్రంలో రూ.5 లక్షలతో నిర్మించే అంబేద్కర్ సామూహిక భవనానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో వివిధ రకాల భవనాలు నిర్మించామన్నారు. ఈ భవనాలను శుభకార్యాలు, సభలు, సమావేశాలకు ఉపయోగించుకోవాలని కోరారు. భూమిపూజ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కురుమూర్తి, సర్పంచి వెంకటస్వామి, విండో అధ్యక్షుడు ఆనంద్‌రాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, అంబేద్కర్ సంఘం సభ్యులు, నాయకులు రాములు, శేఖర్, మునీందర్, వెంకటేశ్, మహేశ్‌గౌడు, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు గోశాలలో మహాలక్ష్మీ యాగం

రాజనగరం(వనపర్తి గ్రామీణం), న్యూస్‌టుడే : మండలంలోని రాజనగరం శివారు విశ్వక్సేన గోశాలలో అమవాస్యను పురస్కరించుకొని సోమవారం మహాలక్ష్మీ యాగం నిర్వహించనున్నట్లు గోశాల నిర్వాహకుడు రామాచార్యులు తెలిపారు. యాగానికి భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

అచ్యుతాపురం(వనపర్తి గ్రామీణం) : మండలంలోని అచ్యుతాపురం పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో అమావాస్యను పురస్కరించుకొని అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

మండల కేంద్రంలో వీరభద్రస్వామికి...

ఖిల్లాగణపురం : మండల కేంద్రంలోని శ్రీఘనలింగేశ్వర వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణమాసం ఆఖరి సోమవారం, ఆమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అన్నదానకర్త కమ్మరి గోపి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు మహా అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

ఇంకుడుగుంతల బిల్లులు ఇప్పించండి

అమ్మపల్లి(పెద్దమందడి) : యుద్ధప్రాతిపదికన నిర్మించిన ఇంకుడుగుంతలకు అధికారులు ఏడాది గడుస్తున్నా బిల్లులు మంజూరు చేయలేదని అమ్మపల్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకుడుగుంతను నిర్మించిన వారం రోజుల్లో బిల్లులు చెల్లిస్తామన్న అధికారులు ఇప్పుడు పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. ఇంకుడుగుంతలకు సంబంధించిన ఫొటోలు, వివారాలను అప్పుడే అధికారులకు అందించామన్నారు. అధికారులు ఇప్పటికైనా బిల్లులను మంజూరు చేయించాలని కోరుతున్నారు.

కేవీపీఎస్ సదస్సును జయప్రదం చేయాలి

వనపర్తి : ఈనెల 27న హైదరాబాద్‌లో జరిగే కేవీపీఎస్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రాధాకృష్ణ కోరారు. ఆదివారం పట్టణంలోని గాంధీనగర్‌లో ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో జరుగుతున్న సామాజిక అంశాలు, దళితుల స్థితిగతులపై జాతీయ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు నారాయణ, రాజు, రాము, బాల్‌రాం, మధు, వెంకటేశ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

22, 24వ తేదీల్లో మండల స్థాయి క్రీడలు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 22 24వ తేదీల్లో పాఠశాల క్రీడా సమాఖ్య ఆదేశానుసారం విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు క్రీడల ఇన్‌ఛార్జి, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.సురేందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. 22న 17 ఏళ్ల విభాగం, 24న 14 ఏళ్ల విభాగం విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. మండల స్థాయి క్రీడాపోటీల్లో భాగంగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు, పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలన్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులు సంబంధిత పాఠశాలల బోనాఫైడ్, ఆధార్‌కార్డుల ప్రతులను తీసుకురావాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు 14 ఏళ్ల విభాగంలో 01.10.2004 లోపు, 17లోపు విభాగంలో 01.01.2001 తర్వాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. సోమవారం నాటికి ఇందులో పాల్గొనే జట్ల వివరాలను తెలపాలన్నారు. వివరాలకు 9440980282, 9000269629 చరవాణి నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణుడి నిమజ్జన వేడుక


వీరాయపల్లిలో శ్రీకృష్ణుడి నిమజ్జన వేడుకల్లో భజనలు చేస్తున్న గ్రామస్థులు

వీరాయపల్లి(పెద్దమందడి), న్యూస్‌టుడే : మండలంలోని వీరాయపల్లిలో ఆదివారం గ్రామస్థులు శ్రీకృష్ణ నిమజ్జన వేడుకను ఘనంగా నిర్వహించారు. గోకులాష్టమి రోజున గ్రామంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామస్థులు ఆదివారం నిమజ్జన ఉత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగింపు తీసారు. ఊరేగింపులో గ్రామంలోని చిన్న, పెద్ద తేడాలేకుండా పాల్గొని స్వామివారి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు చేసిన ప్రత్యేక భజన చూపరులను ఆకట్టుకుంది. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టి గ్రామంలోని ప్రజలందరికీ అన్నదానం చేశారు.

ప్రశాంతంగా సాక్షరభారత్ పరీక్షలు


శ్రీరంగాపురంలో పరీక్ష రాస్తున్న మహిళలు

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : సంపూర్ణ అక్షరాస్యతను సాధించేందుకు ప్రవేశపెట్టిన సాక్షరభారత్ కేంద్రాల్లో విద్యనభ్యశించిన వయోజనులకు ఆదివారం మండల కేద్రంతోపాటు మండలంలోని నాగరాల, తాటిపాముల, వెంకటాపురం, జానపేట, నాగసానిపల్లి, శేరుపల్లిలో దాదాపు 300 మంది వయోజనులు ఎన్ఐవోఎస్ పరీక్ష రాశారు. అభ్యాసకులు, రాయడం, చదవడం, బడి మధ్యలో మానేసిన వారు ఈ పరీక్ష రాశారు. పరీక్షకు మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శ్రీరంగాపురంలో గ్రామ సమన్వయ కర్త వెంకటయ్య ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. మండల సమన్వయ కర్త మేధ పరిశీలించారు.

గోపాల్‌పేట : గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో ఆదివారం సాక్షరభారత్ మిషన్ సార్వత్రిక పరీక్షలను నిర్వహించారు. గోపాల్‌పేటలో జరుగుతున్న పరీక్షలను జిల్లా పర్యవేక్షణాధికారి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. గోపాల్‌పేట మండలంలో 495 మందికిగాను 477 మంది పరీక్షలు రాశారని ఎంసీవో సత్యం తెలిపారు. రేవల్లి మండలంలో మొత్తం 440 మందికిగాను 424 మంది పరీక్షలు రాశారని ఆయన తెలిపారు. సార్వత్రిక పరీక్షల్లో మహిళలే అధిక శాతం పాల్గొన్నారు.


పెద్దమందడి : పరీక్ష రాస్తున్న సర్పంచి సాయమ్మ

పెద్దమందడి : మండలంలోని సాక్షరభారత్ కేంద్రాల్లో ఆదివారం వయోజనులకు పరీక్షలు నిర్వహించారు. మండలంలో ఏర్పాటు చేసిన 13 కేంద్రాల్లో 702 మంది వయోజనులు పరీక్షలు రాశారు. 502 మంది స్త్రీలు, 176 మంది పురుషులు రాసినట్లు మండల సమన్వకర్త శ్రీశైలం తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గం.ల వరకు కేంద్రాల్లో సమన్వయకర్తలు పరీక్షలు నిర్వహించిననట్లు ఆయన తెలిపారు.

ఖిల్లాగణపురం : సాక్షరభారత్ ఆధ్వర్యంలో వయోజనులకు ఈనెల 20న మండలంలోని అన్ని గ్రామాల్లో కొనసాగుతున్న కేంద్రాల్లో సార్వత్రిక పరీక్ష నిర్వహించనున్నట్లు సాక్షరభారత్ మండల సమన్వయకర్త నెహ్రూ తెలిపారు. వివిధ గ్రామాలను సందర్శించిన ఆయన అక్కడి కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలించారు. ఒక్కో కేంద్రంలో 20 మంది చొప్పున హాజరయ్యేలా చూడాలని గ్రామాల సమన్వయకర్తలకు సూచించారు. అనంతరం మండల పరిషత్తు కార్యాలయంలో గోడపత్రికను ఎంపీడీవో రెడ్డయ్యతో కలిసి విడుదల చేయడంతోపాటు పరీక్ష సామగ్రిని అందించారు. కార్యక్రమంలో మండల పరిషత్తు సూపరింటెండెండ్ భార్గవ్‌రామ్, వివిధ గ్రామాల సమన్వయకర్తలు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీస్

సమస్త ప్రజానీకమునకు తెలయజేయడం ఏమనగా నాక్లయింట్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్. వనపర్తి బ్రాంచి వారు G.Ramulu S/o G.Narasimha R/o Yaparla వారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారముకై తన సొంత "Brother" (అన్న) పేరుమీద ఉన్న Jagatha Chary పేరు మీద ఉన్న "Plot" ను తనఖా పెట్టుటకు అంగీకరించినారు. ఇట్టి అస్తి పై ఎరిరైనా అంక్షలు గాని, క్లెయిములు గాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల ఈ రోజు నుండి 7 రోజులలో మా ఆఫీస్‌లో గాని, మా క్లయింట్ ఆఫీస్‌లో గాని తెలియజేయగలరని మనవి.

SCHEDULE OF THE PROPERTY

The Plot No.58 in Sy.No. 194 Extent of 214 Sq.Yards situated at Srinivasapuram (Vil)., Wanaparthy Mandal and District. East : 30" Road, West : Plot No.67, North : Plot No.57, South : Plot No: 59.

B.SATYANARAYANA Advocate
Nallakunta, Gadwal.

పబ్లిక్ నోటీస్

సమస్త ప్రజానీకమునకు తెలియజేయడం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ సిటి యునియన్ ఫైనాన్స్, వనపర్తి బ్రాంచి వారు A.Ashok Kumar S/o A.Rajaiah R/o వనపర్తి వారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారముకై తన సొంత పేరు మీద ఉన్న తన సొంత Houseను తనఖా పెట్టుటకు అంగీకరించినారు. ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఆంక్షలు గాని, క్లెయిములు గాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల ఈ రోజు నుండి “7” రోజులలో మా ఆఫీస్‌లో గాని మా క్లయింట్ ఆఫీస్‌లో గాని తెలియజేయగలరని మనవి.

SCHEDULE OF THE PROPERTY

The Building of Shop and House No.15-33 Total extent of 100 Sq.yard's, Situated at Wanaparthy Town and District.
East: House of Dara Balaswamy Common wall
West: House of Bachu Badrinath Common wall
North: 3' Seri Kaluva
South: Shankar Guni Bazar Main Road

B.Satyanarayana Advocate
Nallakuta, Gadwal.

అధికారపక్షం రాజకీయాలను కలుషితం చేస్తోంది

ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి



మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : మును పెన్నడూలేని విధంగా రాష్ట్రంలో అధికారపక్షం నాయకులు రాజకీయాలను కలుషితం చేస్తున్నారని ఏఐసీసీ కార్యదర్శి, ఎమ్మెల్యే జి.చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సద్భావనయాత్ర, తెరాస శ్రేణులు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా బాలకృష్ణయ్య క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులను డబ్బుతో కొనుగోలు చేస్తూ రాజకీయ వ్యవస్థనే విషపూరితం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తప్పుడు పనులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేసే నాయకుల ఆగడాల ఆటలను ఇకపై సాగనివ్వమన్నారు. అధికార పార్టీ నాయకులు చేసే విషపూరిత రాజకీయాలను తిప్పికొట్టాలన్నారు. అధికారపక్షం నాయకులకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారన్నారు. తానున్నంత వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ భయపడొద్దన్నారు. న్యాయబద్ధంగా ఉంటూ 2019 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేద్దామని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. తెరాస ప్రభుత్వం ఏమీ చేయలేదనే భావన ప్రజల్లో ఏర్పడిందని, ఇంకెంతో కాలం ప్రజలను ప్రలోభ పెడుతూ మోసం చేయలేరన్నారు. ప్రభుత్వం ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందన్నారు. ఈ ప్రభుత్వాన్ని సాగనంపడమే సముచితమన్నారు. ఎన్నడూ అధికారమెరగని ఈ ప్రాంత నాయకులు కొందరు డబ్బులతో ప్రజాప్రతినిధుల కొనుగోలుకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ విరుద్ధమైన పనులు చేయడం భావ్యం కాదన్నారు. చేతనైతే అభివృద్ధిలో పోటీపడాలన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక.. : ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారని చిన్నారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై, అధికార పార్టీ ఏమీ చేయలేదని తెలిసి తెరాసకు చెందిన పలువురు యువనాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారన్నారు. పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు పట్టణంలో భారీ ఊరేగింపు తీశారు. పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ప్రారంభమైన ఊరేగింపు పట్టణంలోని పలు ప్రధాన వీధులగుండా సాగింది. అనంతరం బాలకృష్ణయ్య క్రీడామైదానంలో జరిగిన సభ వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో పార్టీకి చెందిన నాయకులు శంకర్‌ప్రసాద్, పి.ధనలక్ష్మి, శ్రీనివాస్‌గౌడు, కిరణకుమార్, తిరుపతయ్య, రాజేంద్రప్రసాద్, కృష్ణబాబు, బాబా, గిరిజ, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాంగ్రెస్ శ్రేణుల ఊరేగింపు

సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేయాలి

రంగాపురం(పెబ్బేరు), న్యూస్‌టుడే : గ్రామాల్లోని నిరక్షరాస్యులైన వయోజనులను సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు సాక్షరభారత్ గ్రామ సమన్వయకర్తలు కృషి చేయాలని సాక్షరభారత్ డిప్యూటీ డైరెక్టర్ వీరభద్రరావు కోరారు. ఆదివారం సాయంత్రం మండలంలోని చెల్లిమిల్లలో సాక్షరభారత్ కేంద్రాన్ని వీరభద్రరావు పరిశీలించి ఆదివారం జరిగిన ఎన్ఐవోఎస్ పరీక్షను ఎలా, ఎంత మంది రాశారని, మిగితా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో ఆదివారం 1.40 లక్షల మంది వయోజనులు పరీక్ష రాశారన్నారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించనప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. ముఖ్యంగా మహిళలంతా చదువు నేర్చుకొంటేనే పిల్లలను చదివించడానికి కృషి చేస్తారన్నారు. చదువులో నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. జన శిక్షణ సంస్థ డైరెక్టర్ సుబ్బారెడ్డి, డీఎల్‌వో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో న్యూమన్, సాక్షరభారత్ మండల సమన్వయకర్త మేధ, గ్రామ సమన్వయకర్తలు నరసింహ, సుమలత తదితరులు పాల్గొన్నారు.



సాక్షరభారత్ కేంద్రంలో పరీక్షను పరిశీలిస్తున్న డీడీ వీరభద్రరావు

ఉద్యమంలో కవులు, కళాకారుల పాత్ర అమోఘం

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కవులు, కళాకారులు, సాహిత్యం పాత్ర ఎంతో ఉందని ప్రముఖ కవి నందిని సిధారెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని కల్యాణ మండపంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కవి సమ్మేళనంలో పాల్గొని ముఖ్యోపన్యాసం చేశారు. తెలంగాణ ప్రాంత కవులు, కళాకారులు, సాహిత్యం రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసేలా చేసిందని వివరించారు. రాష్ట్రంలో కవులు, కళాకారులకు కొదవ లేదన్నారు. ఉమ్మడి జిల్లాలోనూ సురవరం ప్రతాపరెడ్డి, కపిలవాయి లింగమూర్తి, గడియాం రామకృష్ణ శర్మ లాంటి ఎందరో కవులు సాహిత్యాభివృద్ధికి కృషి చేశారని ఆయన అన్నారు. తెలుగుభాషకు సేవలందించిన వారంతా చరిత్రపుటల్లో నిలిచిపోవాలన్న లక్ష్యంతో తెలంగాణ జాగృతి సంస్థ ఆధ్వర్యంలో నెలరోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో కవి సమ్మేళనాలు నిర్వహించి సమీకరణ చేస్తున్నామన్నారు. ఆయా జిల్లాల్లోని కవులను గుర్తించడానికే కవి సమ్మేళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలను దేశవిదేశాల్లో ఇనుమడింపజేయడానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత భుజాన వేసుకున్నారన్నారు. తెలంగాణలో ప్రస్తుతం సాధారణ కవులూ కవిత్వాన్ని సమాజానికి స్వేచ్ఛగా వినిపించే రోజులు వచ్చాయన్నారు.



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రముఖ కవి నందిని సిధారెడ్డి

ఆకట్టుకున్న కవి సమ్మేళనం..

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన కవిసమ్మేళనం కార్యక్రమం ఆకట్టుకుంది. తెలంగాణ సంస్కృతి బాల్యం కళలు, సాహిత్యం, వృత్తులు తదితర అంశాలపై ఈ ప్రాంతానికి చెందిన పలువురు కవులు, గేయ, పద్య, వచన రూపంలో వినిపించి ఆకట్టుకున్నారు. సుమారు వందదాకా కవులు కవిత్వాన్ని వినిపించి ఆకట్టుకున్నారు. ఆద్యంతం కవి సమ్మేళనం ఆకట్టుకుంది. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీనాచారి, కార్యదర్శి కృష్ణ, జిల్లా అధ్యక్షుడు చీర్లసత్యంసాగర్, నాయకులు ఎల్లాస్వామి, అశోక్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్, సమీర్, భీమేశ్, నవీన్, కవులు నాయికంటి నరసింహ శర్మ, సుధాకరాచారి, నారాయణరెడ్డి, శివరాజలింగం, ఏదుల పాపయ్య, చందోజీరావు, బి.శ్రీనువాసులు, ఎం.బాలస్వామి, బైరోజు చంద్రశేఖర్, శ్యాంసుందర్, బాబుదేవిదాసు, మదన్‌మోహన్, సుజాత, పర్జానా, చెన్నపద్మ, యామిని తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ శక్తిగా టీ-మాస్

- వచ్చే ఎన్నికల్లో అధికారం మనదే
- జిల్లా సదస్సులో ప్రజా గాయకుడు గద్దర్



పాటలతో అలరిస్తున్న గద్దర్

పాలమూరు, న్యూస్‌టుడే : తెలంగాణ ప్రజా సామాజిక సంఘాల ఐక్య వేదిక (టీ-మాస్) రాబోయే రోజుల్లో రాజకీయ శక్తిగా అవతరిస్తుందని ప్రజా గాయకుడు గద్దర్ స్పష్టం చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో టీ-మాస్ జిల్లా ఫోరం సదస్సు నిర్వహించారు. ముందుగా పురపాలక సంఘం కార్యాలయ ఆవరణ నుంచి కార్యకర్తలు, నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సదస్సులో గద్దర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో అట్టడుగు వర్గాల ప్రజలమే ఎక్కువ శాతం ఉన్నామని, రాజ్యాధికారం మాత్రం అగ్రవర్ణాలు అనుభవిస్తున్నాయని అన్నారు. జనాభా ప్రాతిపదికన కూడా సీట్లను కేటాయించకుండా ప్రతి సారి ఎన్నికల్లో అగ్రవర్ణాల వారే ఇష్టం వచ్చినట్లు వ్యవరిస్తున్నారని విమర్శించారు. సమాజంలో బీసీలు 52 శాతం, ముస్లింలు 18, ఎస్సీలు 18, గిరిజనులు 6 శాతం చొప్పున ఉన్నారని.. మొత్తం 94 శాతం జనాభా మనదే ఉందన్నారు. అన్ని వర్గాలు ఏకమైతే వచ్చే ఎన్నికల్లో అధికారం మనదే అన్నారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోందని, దాన్ని తుదముట్టించడానికి అందరం ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. సామాజిక మార్పుతో పాటు ఆర్థిక మార్పు రావాలన్నారు. ముస్లింలలో 99 శాతం మంది తిండి కూడా దొరకని దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు జీవుల బతుకులు మారడానికి అంత ఏకమై ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. టీ-మాస్ అధికారంలోకి వస్తే విలేఖరులకు నెలకు రూ.30 వేల వేతనం ఇస్తామని ప్రకటించారు. సమాజాన్ని ప్రస్తుతం శాసించేది డబ్బు, మీడియా, మాఫియా, కోఫియా, తోఫియా అంటూ చమత్కరించారు.

మహిళలు చైతన్యం కావాలి..: ప్రధానంగా సమాజంలో మహిళలు చైతన్యవంతులు కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో టీ-మాస్‌ను బలోపేతం చేయడానికి గ్రామ, మండల, జిల్లా కార్యవర్గాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి టీ-మాస్ ఏర్పాటు ఉద్దేశాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మనుగడ కోసమే దీన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని వర్గాల నుంచి ముఖ్య నాయకుల్లో చురుకుగా పని చేసేవారికి బాధ్యతలు అప్పగిస్తామని అన్నారు.

కేసీఆర్ కుటుంబ పాలన..: రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన నడుస్తోందని ప్రొఫెసర్ కంచె ఐలయ్య ఆరోపించారు. ప్రజలంతా తీవ్ర విరక్తితో ఉన్నారని అన్నారు. సమాజంలోని అన్ని మతాలు, కులాలకు టీ-మాస్ అండగా ఉంటుందని, తాము అధికారంలోకి వస్తే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్యను ప్రవేశపెడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి.సాగర్, ప్రజా సంఘాల నాయకులు జలజం సత్యనారాయణ, వినోద్‌కుమార్, హాజమ్మ, ఎ.రాములు, కూర్మయ్య, మంత్రి నర్సింహ, రాందాస్ మాదిగ, కురుమూర్తి, చంద్రకాంత్, దీప్లానాయక్, గులాం గౌస్, లక్ష్మణ్, ఖమర్ అలి, రాములు యాదవ్, గాలి యాదయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అలరించిన గద్దర్ ఆటపాట : వేదికపై గద్దర్ ఆటపాటతో అలరించారు. పాలమూరు జిల్లా వలస కూలీల బతుకులు, అణగారిన వర్గాల జీవితాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. ముస్లింలను 'పాకిస్థాన్ పేరు చెప్పి కబరస్థాన్‌కు పొమ్మంటున్నారని' భాజపా పాలనపై విమర్శలు చేశారు. 2014లో తెరాసకు ఓటేసి ప్రజలు బాధ పడుతున్న వైనాన్ని వివరించారు.



మాట్లాడుతున్న కంచె ఐలయ్య, తమ్మినేని వీరభద్రం.. హాజరైన కార్యకర్తలు, నాయకులు

బకాయిలు చెల్లించకుంటే పీడీ కార్యాలయం దిగ్బంధం

పెబ్బేరు, న్యూస్‌టుడే : జిల్లాలో ఉపాధి కూలీలకు రెణ్నెల్లుగా చేసిన పనులకు డబ్బు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఉపాధికూలీల బకాయిలు చెల్లించాలని, లేదంటే పీడీ కార్యాలయాన్ని దిగ్బంధిస్తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజయులు హెచ్చరించారు. ఆదివారం పెబ్బేరుకు వచ్చిన ఉపాధి కూలీలతో సమావేశమై మాట్లాడారు. రెణ్నెల్లుగా కూలీలకు రూ.81 లక్షలు చెల్లించాల్సి ఉందని, ప్రభుత్వం మాతంత్ర నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి ఉపాధి కూలీలు బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు.



ప్రమాద ఘంటిక

- రోజురోజుకు తగ్గుతున్న భూగర్భ జలాలు
- వర్షాకాలంలోనూ నీటికి తప్పని తిప్పలు
- 18 మండలాల్లో 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు జలం
- లక్ష్యం చేరని ఇంకుడు గుంతల నిర్మాణం

ఉమ్మడి జిల్లాలో భూగర్భ జలాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వేసవిలో కంటే ఎక్కువగా జలాలు లోతుకు పడిపోతున్నాయి. వర్షాకాలం సగానికి పైగా గడిచి పోయినా ఇప్పటి వరకు భారీ వర్షాలు నమోదుకాలేదు. మూడేళ్లు కరవును చవి చూసిన రైతులు ఈ ఏడాది అయినా మంచి వర్షాలు కురుస్తాయని ఆశించి.. భంగపడ్డారు. చిన్నపాటి వర్షాలు ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నాయి. ఎక్కడా చెరువులు, కుంటల్లోకి చుక్కనీరు చేరులేదు. ఫలితంగా భూగర్భ జలాలు ఇంచుకూడా పెరగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వేసవిలో కంటే కూడా ప్రస్తుత వర్షాకాలంలో భూగర్భ జలమట్టాలు మరింత లోతుకు పోయాయి. ప్రధానంగా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు జిల్లాల్లో కనీస వర్షాలు లేక పలు మండలాల్లో నీటి మట్టాలు తగ్గుతూ కిందకు దిగిపోతున్నాయి. జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో నీటి మట్టాలు కొంచెం పరవాలేదనిపించేలా ఉన్నాయి.

- న్యూస్‌టుడే, పాలమూరు

నాగర్‌కర్నూలు జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైంది. గత నెల 31వ తేదీ నాటికి 221 మి.మీ. కురవాల్సి ఉండగా కేవలం 175.2 మి.మీ. మాత్రమే కురిసింది. మైనస్ 20.8 శాతం వర్షం తక్కువగా కురిసింది. దీంతో ఈ జిల్లాలోని 9 మండలాల్లో నీటి మట్టాలు 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు చేరాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 224.51 మి.మీ. వర్షపాతానికిగాను 234.03 మి.మీ. వర్షం నమోదు అయింది. నాలుగు శాతం వర్షం ఎక్కువగా కురిసిన వాటి ప్రభావం కనిపించడం లేదు.

18 మండలాల్లో దిగువకే..

ఉమ్మడి జిల్లాలో భూగర్భ జలమట్టాలు ప్రతి నెల దిగువకే పోతున్నాయి. దీంతో వ్యవసాయానికి గడ్డు కాలం ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే వర్షాల్లేక సగానికిపైగా భూములు సాగుకు నోచుకోలేదు. మూడేళ్ల నుంచి ఖరీఫ్‌ది ఇదే పరిస్థితి. అక్కడక్కడ వేసిన పంటలకు సాగునీటి కోసం పూర్తిగా బోర్ల ద్వారా నీటిని తోడేస్తుండటంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటుతున్నాయి.

ఇంకుడు గుంతల నిర్మాణాలు అంతంతే..

జిల్లాలో ఇంకుడు గుంతల నిర్మాణాలు ఇప్పటి వరకు 50 వేలు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 15 వేలు మాత్రమే నిర్మించారు. కురిసిన ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా వీటిని చేపడుతున్నా.. క్షేత్రస్థాయిలో అధికారులు లక్ష్యం మేర పనులు చేయడం లేదు. దీంతో అనుకున్నంత వేగంగా ఇంకుడు గుంతల నిర్మాణం పనులు సాగడం లేదు.

ప్రస్తుతం భూగర్భ జలమట్టాలు ఇలా ఉన్నాయి..

జిల్లా పేరు	జులై-2016	జులై-2017
మహబూబ్‌నగర్	17.46 మీ.	17.08 మీ.
నాగర్‌కర్నూలు	19.88 మీ.	16.35 మీ.
వనపర్తి	12.29 మీ.	9.60 మీ.
జోగులాంబ గద్వాల	11.37 మీ.	9.71 మీ.


నవాబుపేట వద్ద భూగర్భ జలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నీటిని దుబారా చేస్తే మనకే కష్టం..



నీటిని పొదుపుగా వాడుకోవాలి. ఎంత నీరు కావాలో అంతే వినియోగించుకుంటే మంచిది. దుబారా చేయరాదు. అలా చేస్తే భవిష్యత్తులో మనకే కష్టం. గతేడాదితో పోల్చుకుంటే తక్కువ వర్షాలే కురుస్తున్నాయి. భూగర్భ జలాలు పెరగడం లేదు. అప్రమత్తం కావాలి.

– రమాదేవి, డీడీ, భూగర్భ జలవనరుల శాఖ, మహబూబ్‌నగర్

సీపీఎస్ రద్దుకు సంఘటిత పోరాటం

ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్


గోడపత్రికలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

వీరన్నపేట (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే : కాంట్రిబ్యూటరీ పింఛను విధానం (సీపీఎస్) రద్దు కోసం సంఘటిత పోరాటాలు అవసరమని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ విరమణ తర్వాత పింఛను తీసుకోవడం ఉద్యోగి హక్కు అన్నారు. దీని రద్దు వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వం చేతిలో లేదని, కేంద్రం చేయాల్సి ఉందని చెప్పారు. అందరూ సంఘటితమై పోరాటాలు చేయడం ద్వారా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల ఆందోళనకు పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, ఆల్‌మేవా నాయకులు అయూబ్, టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, టీపీటీఎఫ్ నాయకులు మహమూద్, టీటీయూ నాయకులు నారాయణ, బీటీఏ చెన్నయ్య, ఎస్ఎల్‌టీఏ నాయకులు గౌరీశంకర్, బీసీటీఏ రమేష్, టీజీయూఎస్ నాయకులు బాలునాయక్ మాట్లాడుతూ.. సెప్టెంబరు 1వ తేదీన నిర్వహించే సీపీఎస్ ఉద్యోగుల సామూహిక సెలవుకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం కార్యక్రమ గోడపత్రికను విడుదల చేశారు. సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలస్వామి, రాజశేఖర్, అసోసియేట్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, గోవర్ధన్, నాయకులు పాండుగౌడ్, శివశంకర్, ప్రవీణ్‌కుమార్, లక్ష్మీనరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందివచ్చిన అవకాశాల సద్వినియోగం

గురుకుల విద్యాలయాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.. చిత్రంలో ఎమ్మెల్యే చిన్నారెడ్డి


సంప్రదాయ నృత్యంతో అలరిస్తున్న గురుకులం గిరిజన బాలికలు

నాగవరం(వనపర్తి గ్రామీణం), న్యూస్‌టుడే : ప్రభుత్వం కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అమలు చేస్తోందని, తద్వారా పేద విద్యార్థులు మెరుగైన విద్యకు నోచుకుంటున్నారని గురుకుల విద్యాలయాల కార్యదర్శి, స్వేరోస్ సంస్థ వ్యవస్థాపకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. వనపర్తి మండం నాగవరంలోని ఇందూ కల్యాణ మండపంలో స్వేరోస్ సంస్థ వనపర్తి శాఖ ఆధ్వర్యంలో 'జ్ఞాన సమాజ నిర్మాణం.. స్వేరోస్ బాధ్యతలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో చదివేందుకు 30వేల సీట్లకు 2.15 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇది సువర్ణ అధ్యాయమన్నారు. గోపాల్‌పేట, వనపర్తిలో గురుకుల పాఠశాలల్లో నీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంచినీటి సమస్యను తీర్చాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ.. అంటరానితనం, వెనకబాటు పోవాలంటే చదువు ముఖ్యమన్నారు. వనపర్తికి ఎస్టీ గురుకుల డిగ్రీ, ఎస్సీ గురుకుల పాఠశాల మంజూరు చేయాలని కోరారు. గురుకుల పాఠశాలల్లో నెలకొన్న నీటి సమస్యను తీర్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. స్వేరోస్ సంస్థ వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల నాయకులు, ఎస్టీ గురుకుల విద్యా సంస్థల ప్రధానాచార్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

గోపాల్‌పేట : మాతృభాష తెలుగే అయినా ప్రతి విద్యార్థీ ఆంగ్లంపై పట్టు సాధించాలని, అప్పుడే పోటీ పరీక్షల్లో నెగ్గుతారని రాష్ట్ర గురుకుల పాఠశాలల సమన్వయకర్త డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం రేవల్లి మండలం నాగపూరు, చెన్నారం, గోపాల్‌పేట మండలంలోని పొలికెపాడు, తాడిపర్తి, చెన్నూరు, నర్సింగాయపల్లిలో అంబేడ్కర్ విజ్ఞాన మందిరాలను ప్రారంభించారు. గ్రామాల్లో అంబేడ్కర్ విజ్ఞాన మందిరాలను ప్రారంభించడం గర్వంగా ఉందన్నారు. విజ్ఞాన మందిరాలకు తెలుగుతోపాటు ఆంగ్ల దినపత్రికలు, వారపత్రికలను తెప్పించాలని, వాటిని ఉదయం, సాయంత్రం విద్యార్థులు చదివేలా చూడాలన్నారు. గురుకుల విద్యార్థులను ఎవరెస్టు శిఖరాలను అధిరోహించేలా తయారు చేస్తున్నామన్నారు. నిరంతరం చదువుపైన, విజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకే విద్యార్థులు కృషి చేయాలని, వారికి స్వేరోస్ సభ్యులు సహాయసహకారాలను అందించాలని ప్రవీణ్‌కుమార్ సూచించారు. నాగపూరులోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరానికి సర్పంచి పాపులు పుస్తకాలను ఉచితంగా అందించారు. ఉపసర్పంచి నరహరి, గ్రామస్థులు సుల్తాన్, చెంద్రయ్య, శ్రీనివాసరెడ్డి, నారాయణ, స్వేరోస్ సభ్యులు స్వాములు, కిరణ్‌కుమార్, గోపాల్, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

గద్వాల డిజైనర్లకు ఫిదా


- చేనేత చీరకు ప్రత్యేక అందాన్ని తెస్తున్న కళాకారులు
- చుట్టుపక్కల మగ్గాలన్నింటికీ ఇక్కడి నుంచే సరఫరా
- సృజనాత్మక రంగంలో రాణిస్తున్న గద్వాల యువకులు

చీరపై నెమళ్లు నాట్యం చేస్తున్నాయా.. హంసలు, ఏనుగులు కదలాడుతున్నాయా.. రంగు రంగుల పువ్వులు విరబూశాయా.. మామిడి పిందెలు చీరకే కాచాయా.. అన్నట్లు కనిపించే గద్వాల పట్టు చీరలు మగువల మనసులు దోచేస్తాయి. అతివలను అంతగా ఈ చీరలు ఆకట్టుకోవటం వెనుక నేతన్నల నైపుణ్యం, కృషి ఎంతో ఉంది. ఆ చీర అంత అందంగా తయారు కావాలంటే దానికి తగినట్లుగా రంగు అద్దకం కుదరాలి. చీర రంగుకు తగ్గట్టుగా అందమైన డిజైన్ ఉండాలి. అప్పుడే చీర పూర్తి అందాన్ని సంతరించుకుంటుంది. ఇందులో కీలకమైన డిజైన్ తయారు చేయడం గొప్ప కల. ఇందులో ఎంతో సృజనాత్మకత ఉంటే తప్ప రాణించలేరు. గద్వాలకు చెందిన రాఘవేంద్ర, పురుషోత్తం, గోపాలకృష్ణ డిజైన్ల తయారీలో సత్తా చాటుతున్నారు. తమ సృజనాత్మకతతో అందరినీ ఫిదా చేస్తున్నారు.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో తయారయ్యే చేనేత చీరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. నేడు ఎన్నో ఆధునిక పోకడలతో పవర్‌లూమ్ చీరలు మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. కానీ చేనేత మగ్గంపై అందమైన డిజైన్లతో తయారయ్యే చీరలో నాణ్యత, మన్నిక ఉంటుందని అందరి నమ్మకం. అందుకే చేనేత చీరకు ప్రత్యేక ఆదరణ ఉంది. గద్వాల, రాజోలి, నారాయణపేట, అమరచింత, కొత్తకోట, అయిజ, ఎక్లాస్‌పూర్, మాచర్ల, తదితర ప్రాంతాల్లో మొత్తం 4,220కి పైగా మగ్గాలపై చేనేత చీర తయారు అవుతోంది. ఇదికాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కోడుమూరు, ఎమ్మిగనూరు, నందవరం ప్రాంతాలతో పాటుగా కర్ణాటక రాష్ట్రంలో కొన్నిచోట్ల గద్వాల చేనేత చీరల తయారీ జరుగుతోంది. వీరంతా కూడా తమ చీరల్లో నూతనత్వం కోసం వేసేందుకు గద్వాలలోని డిజైనర్లనే ఆశ్రయిస్తున్నారు. వారం, పది రోజులు ఆలస్యమైనా గద్వాల డిజైనర్ల సృజనాత్మకత తెలిసి ఒక్కడే డిజైన్లు చేయించుకుంటున్నారు. కార్మికులు, వ్యాపారుల ఊహకు తగ్గట్లుగా డిజైన్లను సిద్ధం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, గద్వాల(రాజోలి)


సొంతంగా తయారు చేసిన అధునాతన డిజైన్లు



డిజైన్ అట్టలను పంచింగ్ చేస్తున్న మహిళ

ఏ రకమైనా సిద్ధహస్తులే : గద్వాలలో చిన్న వయసులోనే ప్రముఖ డిజైనర్లుగా పేరు సంపాదించిన రాఘవేంద్ర, పురుషోత్తం, గోపాలకృష్ణలు ముగ్గురూ కంప్యూటర్ ద్వారా ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌తో తమ సృజనాత్మకను ఆవిష్కరిస్తున్నారు. కొన్నేళ్లుగా నూలు, సీకో, పట్టు ఇలా చీర ఏ రకమైనా వీరు డిజైన్లు చేయగలరు. చీర అందాన్ని ఇచ్చే బార్డర్ డిజైనింగ్, కొంగు, బూటాలు, బ్రోకెట్ డిజైన్లను ప్రధానంగా తయారు చేస్తున్నారు. టర్నింగ్, మీనా, ఎంబోజి, జాందానీ, పైటానీ, సాదా బార్డర్ ఇలా రకరకాల డిజైన్లలో వీరు సిద్ధ హస్తులు. నెమ్మళ్లు, హంసలు, ఏనుగులు, పువ్వులు, మామిడి పిందెలు, తీగలు, కొమ్మలు, మనుషుల చిత్రాలతో పాటుగా నేటి జీవన శైలిని అద్దంపట్టే చిత్రాలతో కూడిన డిజైన్లను రూపొందిస్తూ అబ్బురపరుస్తున్నారు.

పంచింగ్‌తో ఉపాధి : డిజైన్లను తయారు చేసి వాటిని ప్రత్యేకంగా తెప్పించిన కంప్యూటరైజ్డ్ పంచింగ్ యంత్రంలో అట్టలను కొడుతున్నారు. ఈ అట్టల ద్వారా మగ్గంపై డిజైన్ పడుతుంది. ఇలా ప్రతి రోజూ 800 నుంచి వెయ్యి అట్టలను తయారు చేస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు శ్రమిస్తే.. నెలకు రూ. 15వేల నుంచి రూ. 20వేల వరకు ఆదాయం సమకూరుతోందని డిజైనర్లు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి రాయితీపై రుణాలు, యంత్రాలను అందజేస్తే అద్భుతమైన డిజైన్లను తయారు చేయవచ్చని వారు పేర్కొంటున్నారు.


కంప్యూటర్లో డిజైన్ల తయారీలో పురుషోత్తం

ఎంతో సంతృప్తిని పొందుతున్నా..

ఊహకు రంగులు అద్దుతూ డిజైన్లు తయారు చేయటంలో ఎంతో సంతృప్తిని పొందుతున్నా. ఈ కళపై మక్కువతో ధర్మవరంలో నేర్చుకున్నా. 12 ఏళ్లుగా డిజైనింగ్ రంగంలో పనిచేస్తున్నా. కార్మికులకు నచ్చినట్లుగా కూడా డిజైన్లు చేస్తున్నా. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు డిజైన్ల కోసం వస్తుంటారు. నా చేతితో తయరైన డిజైన్ చీరలు నేడు అంతర్జాలంలో కనిపిస్తుండటం, ప్రముఖులు ధరిస్తుండటం ఆనందాన్నిస్తోంది. ప్రభుత్వం చేనేత రంగాన్ని ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలి.

- రాఘవేంద్ర



డిజైన్లు సిద్ధం చేస్తున్న రాఘవేందర్

కాగితంపై డిజైన్లు వేశాం..

ఎక్బోటే అనే కళాకారుడి వద్ద డిజైనింగ్ నేర్చుకున్నా. నేను 20 ఏళ్లుగా డిజైనింగ్ రంగంలో ఉన్నా. మొదట్లో కాగితంపై డిజైన్లు వేసేవాళ్లం. కొన్నేళ్లు కంప్యూటర్ డిజైనింగ్ నేర్చుకున్నాం. కొంత పని సులువు అయ్యింది. ప్రతి రోజూ వెయ్యి అట్టలను పంచింగ్ చేయగలుగుతున్నాం. డిజైనింగ్ రంగంపై యువకులకు ఆసక్తిగా ఉన్నా ఉపాధి ఉండదేమోనని ముందుకు రావడం లేదు. ప్రభుత్వం రాయితీలపై రుణాలు అందిస్తే చేనేత చీరకు మరిన్ని అందమైన డిజైన్లు తయారు చేయగలం.

- పురుషోత్తం

సమష్టి కృషితో.. లాభాలపాలు



మహిళలు వంటింటికే పరిమితమన్న నానుడి రోజుకురోజుకు పటాపంచలవుతోంది. నేటి తరం మహిళలు విద్యారంగంతోపాటు వ్యాపార, రాజకీయ, సామాజిక రంగాల్లో ప్రభావవంతంగా రాణిస్తూ సమాజంలో తమదైన ముద్ర వేసుకొంటున్నారు. ఈ క్రమంలో కొందరు మహిళలు కరవుకాలంలో పాల సేకరణపై దృష్టి సారించారు. పాల సేకరణనే వ్యాపారంగా మలచుకొని అటు రైతులకు రుణాలు, ఆర్థిక సాయం రూపంలో అండగా నిలవడంతోపాటు ఇటు నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారు. ఇలా.. పాల సేకరణతో లాభాలను సాధిస్తూ మిగిలిన మహిళలకూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

– న్యూస్‌టుడే, కల్వకుర్తి


తిమ్మరాశిపల్లిలో పాలను సేకరిస్తున్న మహిళలు

- ఎనిమిదేళ్లుగా ప్రగతి బాటలో మహిళా సమాఖ్య
- పాడి రైతులకు రూ. 38 లక్షల రుణాలు
- పశుగ్రాసం కోసం ఆర్థికసాయం
- తిమ్మరాశిపల్లి మహిళల ఆదర్శం

కల్వకుర్తి మండలంలోని తిమ్మరాశిపల్లి గ్రామ మహిళలు గత ఎనిమిదేళ్లుగా పాలసేకరణ కేంద్రాన్ని స్వయంగా నిర్వహిస్తూ లాభాల బాటలో పురోగమిస్తున్నారు. వర్షాలు లేక, సాగునీరు రాక రైతులు పంటల సాగుకు దూరమైన విషయం తెలిసిందే. దీంతో రైతులు పెట్టుబడి రూపంలో, దిగుబడులను కోల్పోయి ఆర్థికంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో గ్రామ మహిళలు మేమున్నామని రైతులకు అండగా నిలిచి పశువులకు గ్రాసం, ఆవుల, గేదెల కొనుగోలుకు రుణాలను అందిస్తూ వారికి మరింత చేరువయ్యారు. మహిళా సంఘం ప్రారంభించిన 2009లో సమాఖ్య సభ్యులు నిత్యం 150 లీటర్ల పాలను సేకరించేవారు. ప్రస్తుతం ప్రతిరోజూ సమష్టి కృషితో వెయ్యి లీటర్ల మేరకు పాలను సేకరిస్తూ లాభాలబాటలో పురోగమిస్తున్నారు. పాల సేకరణ ద్వారా రైతులకు లాభాలను సిరులు కురిపిస్తూ గ్రామానికి చెందిన పలువురికి ఉపాధి చూపుతున్నారు. గ్రామానికి చెందిన స్వరూప అనే మహిళ మొదట 2007లో మహిళా సంఘాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలోని మిగిలిన మహిళలతో మహిళా సమాఖ్యను ఏర్పాటుచేసి పాల కేంద్రాన్ని నెలకొల్పారు. అప్పటి నుంచి గ్రామ రైతుల నుంచి పాలను సేకరిస్తూ లాభాల బాటలో పురోగమిస్తున్నారు. రైతుల నుంచి సేకరిస్తున్న పాలను పాల శీతలీకరణ కేంద్రానికి విక్రయిస్తున్నారు. ఇలా విక్రయాల ద్వారా ప్రస్తుతం ప్రతి నెల రూ. 20 వేల నుంచి రూ. 25 వేల వరకు లాభాలు సాధిస్తున్నామని మహిళలు ఆనందంగా చెబుతున్నారు.

లాభాల్లోంచి పెట్టుబడులు : పాల సేకరణ కేంద్రం ద్వారా వచ్చిన లాభాల్లోంచి మహిళా సమాఖ్య సభ్యులు పెట్టుబడి రూపంలో కొంత భాగాన్ని వెచ్చిస్తుండటం గమనార్హం. పాల కేంద్రం నిర్వహణ ద్వారా ఇప్పటి వరకు వచ్చిన లాభాల్లోంచి ఖర్చులు, లాభాలను పంచుకోగా రూ. 8 లక్షల వరకు మిగిలాయి. వీటిని మహిళా సమాఖ్య సభ్యులు రైతులకు గేదెలు, ఆవులకు అవసరమయ్యే గ్రాసం కొనుగోలు చేసుకోవడానికి అందజేసి ఉదారతను చాటుకొన్నారు. మరికొంత డబ్బుతో పాల సేకరణ కేంద్రంలోని యంత్రాల కొనుగోలుకు వెచ్చించారు. కేంద్రానికి అవసరమయ్యే యంత్రాలను రూ. 2.50 లక్షలతో కొనుగోలు చేశారు. మరో రూ. 1.50 లక్షను కేంద్రం నూతన భవన నిర్మాణం కోసం బ్యాంకులో డిపాజిట్ చేయగా.. రూ. 50 వేలతో స్థలాన్ని కొనుగోలు చేశారు. గత కొన్నేళ్లుగా పంటలు సాగవ్వకపోవడంతో రైతులకు పశుగ్రాసం కొరత ఏర్పడిన విషయం తెలిసిందే. దీన్ని దృష్టిలో ఉంచుకొన్న మహిళా సమాఖ్య సభ్యులు రూ. 2.50 లక్షలతో పశుగ్రాసం కొనుగోలు చేశారు. మహిళా సమాఖ్య సభ్యులు ఐకేపీ ద్వారా ఇప్పటి వరకు గ్రామంలోని 38 మంది పాడి రైతులకు రుణాలను అందించారు. ఒక్కో రైతుకు రూ. 10 వేల నుంచి 40 వేల వరకు 76 గేదెల కొనుగోలుకు రూ. 34 లక్షల వరకు రుణాలను అందజేశారు. పాడి రైతులు బాగుంటేనే వారు పశువుల పెంపకంపై దృష్టి సారించగలుగుతారని, తద్వారా పాల ఉత్పత్తి పెరిగి కేంద్రానికి లాభాలు సమకూరుతాయని మహిళా సమాఖ్య సభ్యుల ఉద్దేశం.



కరవులో ఆదుకొన్నారు : వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో గత కొన్నేళ్లుగా పంటలను సాగు చేయడంలేదు. నేను గత 12 ఏళ్ల నుంచి పాడిపశువులనే నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నా. ఈ క్రమంలో కరవు కారణంగా పంటలు పండక పశువులకు గ్రాసం కరవవుతోంది. గ్రాసాన్ని కొనుగోలు చేసి పశువులను కాపాడుకోవాలనుకొనుకొంటే.. అప్పు పుట్టడంలేదు. ఈ నేపథ్యంలో మహిళా సమాఖ్య సభ్యులు ముందుకొచ్చి గ్రామంలోని పాడి పశువులకు అవసరమయ్యే గ్రాసం కోసం రూ. 2.50 లక్షల ఆర్థిక సాయం చేశారు. ఈ డబ్బుతో గ్రాసం కొనుగోలు చేసి పశువులను కాపాడుకొన్నాం. మహిళా సమాఖ్య సభ్యులు ఆదుకోకపోతే పశువులను అమ్ముకోవాల్సి వచ్చేది.

- గొడుకు కృష్ణయ్య, పాడి రైతు, తిమ్మరాశిపల్లి



అందరి సహకారంతో : గ్రామంలో తొమ్మిదేళ్ల క్రితం పాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. మహిళా సమాఖ్య ద్వారా ఏ వ్యాపారాన్ని ప్రారంభించాలని ఆలోచిస్తున్న తరుణంలో పాల సేకరణ కేంద్రాన్ని నెలకొల్పితే లాభాలు ఉంటాయని చాలా మంది చెప్పారు. అనంతరం.. మహిళా సమాఖ్య సభ్యులందరం నిర్ణయం తీసుకొని పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించాం. అప్పటి నుంచి అందరి సహకారంతో ఈ కేంద్రం ద్వారా లాభాలను సాధిస్తున్నాం. వచ్చిన లాభాల్లోంచి పాల కేంద్రానికి ఊతంగా నిలుస్తున్న పాడి రైతులకు రుణాలను అందజేస్తున్నాం. భవిష్యత్తులోనూ మేం సాధించే లాభాలతో పాడి రైతులకు అండగా నిలుస్తాం.

- పార్వతమ్మ, మహిళా సమాఖ్య సభ్యురాలు, తిమ్మరాశిపల్లి

అన్నదానంలో ఆదర్శం

- పేదల భుక్తి తీరుస్తున్న భక్తి
- ప్రతి గురువారం పోషకాహారం అందజేత
- మూడేళ్లుగా బాదేపల్లిలో సేవలు
- స్ఫూర్తిదాయకంగా రామచంద్రయ్య కుటుంబం

వారికి సాయి అంటే భక్తి.. అలాగే పేదల భుక్తి తీర్చటమంటే మరీ ఇష్టం. అందుకే పేదలకు మూడేళ్లుగా అన్నదాన రూపంలో పోషకాహారం అందిస్తున్నారు. స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న బాదేపల్లి నగర పంచాయతీ సర్దార్ వల్లభాయ్ పటేల్‌కాలనీకి చెందిన అమృతవల్లి, రామచంద్రయ్యలపై కథనం.

– న్యూస్‌టుడే, బాదేపల్లి


ఇంటి ఆవరణలో భోజనం చేస్తున్న కాలనీవాసులు


అన్నం వడ్డిస్తున్న రామచంద్రయ్య కుటుంబ సభ్యులు

అమృతవల్లి, రామచంద్రయ్య దంపతులు తమ ఇంటిపై శ్రీసాయి అపర్ణ ధ్యాన మందిరంలో సాయి బాబా విగ్రహాన్ని నెలకొల్పారు. ప్రతి గురువారం అభిషేకాలు, అర్చనలు, ఆరాధనలు, ధ్యాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కారం మెతుకులు తిని కడుపు నింపుకొనే పేదలకు వారానికి ఒకసారైనా పోషకాహారం అందించాలని నిర్ణయించారు. 2014 నుంచి ప్రతి గురువారం ఎంత మంది వచ్చినా అన్నం, కూరగాయలు, పండ్లు, మిఠాయిలు, పూరీ.. ఇలా పోషకాలతో కూడిన విందు భోజనంలాంటి అన్నదానం చేస్తున్నారు. వారి ఇద్దరు కూతుళ్లు హైదరాబాద్‌లో ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. ఇంటి వద్ద భార్యభర్త మాత్రమే ఉంటారు. ప్రతి గురువారం వంటలన్నీ వీరిద్దరే చేస్తారు. స్వయంగా వడ్డిస్తారు. వచ్చినవారిని ఆత్మీయంగా చూసుకుంటారు. అంతేకాదు. నీటి బిందెలు, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తారు.

గురువు స్ఫూర్తితో సేవ..

కడప జిలా ప్రొద్దుటూరుకు చెందిన ఆధ్యాత్మికవేత్త రామభక్త గురూజీ స్ఫూర్తితో ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. సంవత్సరానికి ఒక్కసారి మా ఇంటికి వచ్చిన పేద కుటుంబ సభ్యులందరికీ బట్టలు, దుప్పట్లు, నీటి బిందెలను పంచుతున్నాం.

- అమృతవల్లి, రామచంద్రయ్య

మూడేళ్లుగా భోజనం చేస్తున్నా..



ప్రతి గురువారం మాకు కడుపునిండా భోజనం పెడుతున్నారు. స్వయంగా వారే వండి మాకందరికి వడ్డిస్తారు. వారు ఇవే వంటలను తింటారు. మూడేళ్లుగా ఇక్కడ భోజనం చేస్తున్నా.

- శంకర్, బాదేపల్లి

అన్నదానం ఆదుకుంటోంది..



స్థానికంగా చిన్న చిన్న పనులు చేసుకుంటూ బతుకుతా. సరైన తిండి దొరకదు. అలాంటి నాకు ప్రతి గురువారం అన్నంతోపాటు, పండ్లు, మిఠాయిలను వడ్డిస్తారు. వీరి అన్నదానం నన్ను ఆదుకుంటోంది.

- మల్లేశ్, పాతబజార్

ఆత్మీయంగా చూస్తారు..



ఇంటికి వచ్చిన ప్రతి ఒక్కరినీ చాలా ప్రేమగా పలుకరిస్తారు. ఎంతమంది వచ్చినా విసుగు కనిపించదు. వారే స్వయంగా వడ్డిస్తున్నారు. చాలా మంచి కార్యక్రమం చేస్తున్నారు. మూడేళ్లుగా ఇక్కడ భోజనం చేస్తున్నా.

-హసీనా, సర్దార్ వల్లభాయ్‌పటేల్ నగర్

ఆధునిక బోధన.. భవితకు నిచ్చెన

- వట్టెం నవోదయలో విద్యాసుమాలు
- విద్యార్థులకు ల్యాప్‌టాప్ ద్వారా బోధన
- అంతర్జాలంతో లోతైన పరిజ్ఞానం
- ప్రైవేటు సంస్థ చేయూత

న్యూస్‌టుడే, బిజినేపల్లి


నవోదయ విద్యాలయంలో ల్యాప్‌టాప్ ద్వారా పాఠాలను బోధిస్తున్న అధ్యాపకురాలు, శ్రద్ధగా వింటున్న విద్యార్థులు

శాస్త్ర సాంకేతిక రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న ఈ రోజుల్లో విద్యార్థులకు ఆధునిక పద్ధతుల్లో బోధిస్తామని ప్రైవేటు విద్యా సంస్థలు ఊదరగొడుతున్నాయి. సాధారణంగా ప్రైవేటు విద్యాసంస్థలు ఒకటో, రెండో తరగతులను కంప్యూటర్ల ద్వారా బోధించి అంతా ఆధునిక బోధనే అంటూ విస్తృతంగా ప్రచారం చేసుకొంటాయి. ఈ నేపథ్యంలో బిజినేపల్లి మండలంలోని వట్టెం నవోదయ విద్యాలయంలో అధ్యాపకులు ప్రతి పాఠాన్నీ ల్యాప్‌టాప్ ద్వారా బోధిస్తున్నారు. అధ్యాపకుల ఆధునిక బోధనతో ఇక్కడి విద్యార్థులు అంతర్జాలంలో లోతైన పరిజ్ఞానం పొంది అపారమైన విజ్ఞానాన్ని సాధిస్తున్నారు. వీరు విజ్ఞానాన్ని పొందడం వెనక ఓ ప్రముఖ ప్రైవేటు సంస్థ సహకారం ఉంది.

ప్రైవేటు విద్యాసంస్థల్లో డిజిటల్ విద్యావిధానం అనే మాటలేకానీ.. ఒక్కరోజూ పూర్తిస్థాయిలో డిజిటల్ తరగతులు కొనసాగవు అన్న విమర్శలున్నాయి. హైదరాబాద్‌లాంటి పట్టణ ప్రాంతాల్లో తప్ప మరే ఇతర ప్రాంతాల్లో కంప్యూటర్, అంతర్జాలం ద్వారా విద్యను బోధించే పాఠశాలలు ఉండవు అని పలువురు పేర్కొంటుంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం ఈ విద్యావిధానం అమలులోకి వస్తుంది. ఇప్పటికే కస్తూర్బాలాంటి విద్యాలయాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లోని విద్యాలయాల్లో కంప్యూటర్ విద్య కాస్త అందుబాటులో ఉంది. వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో మాత్రం అధునాతన తరగతి గదిలో ల్యాప్‌టాప్ ద్వారా డిజిటల్ తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ విద్యాలయానికి సాంసంగ్ సంస్థ ఉచితంగా 40 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందించింది. ఒక్కో ల్యాప్‌టాప్ విలువ రూ. 60 వేల వరకు ఉంటుంది. ఈ ల్యాప్‌టాప్‌ల ద్వారా విద్యార్థులకు ప్రతిరోజూ డిజిటల్ తరగతులను బోధిస్తున్నారు. అదే సంస్థ ఒక్కో తరగతికి ఒక్కో టీవీని అందించింది. ఒకవైపు ల్యాప్‌టాప్ ద్వారా పాఠాలను బోధిస్తూనే మరో వైపు పాఠాలను టీవీ ద్వారా వినిపిస్తున్నారు.



విద్యాలయంలోని డిజిటల్ తరగతి గది ప్రవేశద్వారం

తరగతుల నిర్వహణ ఇలా.. : నవోదయ విద్యాలయంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు రోజుకు 4 గంటల పాటు ల్యాప్‌టాప్ ద్వారా తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆ విద్యార్థులకు సంబంధిత తరగతికి చెందిన పాఠాలనే కాకుండా భవిష్యత్తులో ఉన్నత విద్యకు అందించే సాంకేతిక పరిజ్ఞానాన్నీ అందిస్తున్నారు. విద్యాలయంలో గణితం, సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్రం తదితర పాఠ్యాంశాలను విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను ఎదురుగా ఉంచి బోధిస్తున్నారు. ప్రతి తరగతికి చెందిన పాఠ్యపుస్తకం ల్యాప్‌టాప్‌లో కనిపించేలా నిక్షిప్తం చేశారు. అధ్యాపకులు బోధించే పాఠాలు ల్యాప్‌టాప్ తెరపై కనిపిస్తాయి. తెరపై పాఠాలు, బొమ్మలు, పట్టికలు స్పష్టంగా కనిపిస్తుండటంతో ప్రతీ అంశం క్షుణ్ణంగా అర్థం చేసుకోగలుగుతున్నామని విద్యార్థులు ఆనందంగా చెబుతున్నారు. విద్యార్థులు అదనపు పరిజ్ఞానాన్ని పొందేలా ట్యాప్‌టాప్‌లకు అంతర్జాల సదుపాయాన్ని కల్పించారు. పాఠ్యాంశాలకు సంబంధించిన అదనపు సమాచారం అవసరమనుకొంటే ల్యాప్‌టాప్ సహాయంతో అంతర్జాలంలో వెతికి అదనపు విజ్ఞానాన్ని పొందుతున్నామని విద్యాలయానికి చెందిన విద్యార్థులు ఆనందంగా చెబుతున్నారు. కంప్యూటర్లతో పోల్చితే ల్యాప్‌టాప్‌ల ద్వారా విద్యార్థులకు బోధించడం సులువుగా ఉందని, వారు ప్రతి అంశాన్ని సులువుగా అర్థం చేసుకుంటున్నారని అధ్యాపకులు చెబుతున్నారు.



పాఠాలు సులువుగా అర్థమవుతున్నాయి : విద్యాలయంలో ల్యాప్‌టాప్‌ల ద్వారా పాఠాలను బోధించడం బాగుంది. వీటి ద్వారా బోధించడంతోపాటు అనుమానం ఉన్న వాటిని ల్యాప్‌టాప్‌లలో పరిశీలిస్తుండటంతో పాఠాలు సులువుగా అర్థమవుతున్నాయి. ఫలితంగా.. ప్రతి అంశంలో మాకు మార్కులు పెరిగుతాయన్న ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మొదట కంప్యూటర్ అంటేనే నేను భయపడేవాడిని. ప్రస్తుతం ల్యాప్‌టాప్ ద్వారా పాఠాలను నేర్చుకోవడం ఆనందంగా ఉంది. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదవగలనన్న ధీమా నాలో పెరిగింది.

- చందు, నవోదయ విద్యార్థి

విద్యార్థులు చురుగ్గా ఉంటున్నారు : విద్యాలయంలో గతంలో అందరు విద్యార్థుల మాదిరే పుస్తకాలను ముందు ఉంచి పాఠాలను బోధించే వాళ్లం. ప్రస్తుతం ల్యాప్‌టాప్‌లు అందుబాటులో రావడంతో వాటి ఆధారంగానే విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్నాం. గతంతో పోల్చితే ప్రస్తుతం ల్యాప్‌టాప్ ద్వారా పాఠాలను వింటున్న విద్యార్థులు చురుగ్గా ఉంటున్నారు. పాఠాలు చక్కగా అర్థమవుతుండటంతో ప్రశ్న వేసిన ప్రతిసారీ విద్యార్థులు సత్వరమే స్పందించి సమాధానం చెబుతున్నారు. మొదట ల్యాప్‌టాప్‌ల ద్వారా పాఠాలను నేర్చుకోవడానికి విద్యార్థులు తడబడ్డారు. తరవాత అలవాటు చేసుకొని బాగా చదువుతున్నారు. వీటి ఆధారంగా పాఠాలను వింటున్న మాకు బాగా అర్థమవుతున్నాయని విద్యార్థులు ఆనందంగా చెబుతున్నారు. ఈ విధానం ద్వారా బోధిస్తే విద్యార్థులకూ భవిష్యత్తులో మంచి ప్రయోజనం ఉంటుంది.

బి.కవిత, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు



విస్తృత పరిజ్ఞానం పొందుతున్నా : విద్యాలయంలో అందజేసిన ట్యాప్‌టాప్‌ల ద్వారా విద్యను అభ్యసించడం మొదట కాస్త ఇబ్బందిగా అనిపించింది. తర్వాత వీటి వినియోగంపై పట్టుపెరిగిత సులువుగా పాఠాలను అర్థం చేసుకోగలుగుతున్నాం. అధ్యాపకులు బోధించిన అంశాలను ల్యాప్‌టాప్‌ల ద్వారా నేర్చుకోవడమే కాకుండా అందులోనే మరింత లోతుగా, విస్తృతమైన పరిజ్ఞానాన్ని పొందుతున్నాం. ఇక్కడ అంతర్జాలం సౌకర్యం కల్పించడంతో అన్ని అంశాలను పరిశోధించి విద్యను అభ్యసిస్తున్నాం. ల్యాప్‌టాప్ ద్వారా విద్యను అభ్యసిస్తుండటంతో భవిష్యత్తులో ప్రయోజనం కలిగే అవకాశముంటుందన్న భరోసా కలుగుతుంది.

- సాయిమైత్రి, విద్యార్థిని, నవోదయ విద్యాలయం



హాయ్! బుజ్జీ!!

ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా నవ్వగలిగితే అదే మనం వారికిచ్చే అందమైన బహుమతి

– మదర్ థెరెసా

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Produce = ఉత్పత్తిచేయు
- మధుకరం = తుమ్మెద


సరదా పదాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

1. Summer వే ☐☐
2. Flute వే ☐☐
3. Speed వే ☐☐
4. Heat వే ☐☐
5. Pay వే ☐☐
6. God వే ☐☐
7. Function వే ☐☐
8. Dawn వే ☐☐

- డీ దయామతి, హన్మకొండ

దారేది?



చుట్టూ జంతువులు... మధ్యలో మనం!



హాయ్ నేస్తాలూ! బాగున్నారా? నేనీమధ్య ఓ జూ కాని జూకెళ్లొచ్చా. ఊపిరి బిగబట్టుకుని కాలం గడి పొచ్చా. తలుచుకుంటేనే ఈ పర్యటన ఎంతో వింతగా.. గమ్మత్తుగా.. అనిపిస్తోంది. ఆ భలే భలే విశేషాలన్నీ మీతో పంచుకోకుంటే ఎలా? అందుకే ఇలా వచ్చేశా.



చిన్నూ కబుర్లు



చుట్టూ పులులు తిరుగుతుంటే మధ్యలో కూర్చుని భోజనం చేశా. సింహం దగ్గరగా వస్తుంటే కాలు మీద కాలేసుకుని ఐస్‌క్రీంలు తింటూ ఆనందించేశా. జంతువులన్నీ భయంకరంగా అరుస్తుంటే రాత్రివేళ మెత్తని పక్కపై పడుకుని ఓ కునుకేసేశా. 'కోతల రాయుడు కోతలు కోస్తున్నాడు. అన్నీ అబద్ధాలే' అనుకుంటున్నారా? అదేం కాదు. ఇదంతా నిజంగా నిజమే.

* మామూలుగా మనం ఎప్పుడైనా జూకి వెళ్లామనుకోండి. జంతువులన్నీ బోనుల్లో ఉంటాయి. మనం బయట స్వేచ్ఛగా తిరుగుతూ వాటిని చూస్తుంటాం. అంతేకదూ!

* మరి నేనెళ్లిన చోటు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. యూకేలోని కెంట్ దగ్గరుందిది.

* ఓ అద్దాల ఇంట్లో తలుపులేసుకుని నేనుంటే ఆ బయట అంతా పులులు, బోలెడు అడవి జంతువులూ తిరుగుతున్నాయి. లోపల నుంచి దగ్గరగా వాటిని చూస్తూ నేను ఆనందించేసానన్నమాట.

ఒక్కసారైతే నేనున్న అద్దం దగ్గరకి పెద్ద పులి వచ్చేసింది. అప్పుడు చాలా భయమేసి పక్క గదిలో ఉన్న అమ్మ దగ్గరికి పరిగెట్టేశా.

* అసలు ఈ చోటు ఏంటంటే..? ఇదో సఫారీ. మొత్తం 600 ఎకరాల్లో చిక్కగా చెట్లుంటాయి. వాటిలో రకరకాల జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి.

* మామూలుగా సఫారీల్లో వీటిని చూసేందుకు మనల్ని జీపుల్లాంటివాటిపై ఎక్కించుకుని తిప్పి తీసుకొస్తారంతే. ఇక్కడ అదొక్కటే కాకుండా అద్దాలతో ఉన్న ఓ చక్కని ఇల్లుంది. దాంట్లో రెండు పడకగదులు, వంటిల్లు, హాలూ ఉన్నాయి. ఎవరైనా అద్దెకు తీసుకుని కొన్ని రోజులక్కడ బస చేయొచ్చు. నాలా వింత అనుభవాల్ని ఆస్వాదించొచ్చు. కావాలంటే మీరూ ఓసారి వెళ్లిరండి మరి. బైబై.

నవ్వుల జల్లులు!

టీచర్: రామూ! ఎన్ని సార్లు పిలుస్తున్నా పలకవేంటి?

రాము: మీరే కదా టీచర్ అనవసరమైన విషయాలు పట్టించుకోవద్దన్నారు!

టీచర్: 30 + 30 ఎంత అవుతుంది?

రఘు: ఆరు టీచర్...

టీచర్: కాస్త బుర్ర పెట్టి చెప్పు!

రఘు: నా జవాబు సరైనదే టీచర్. 0కి విలువ లేదని మీరే కదా చెప్పారు!

- బరాటం రామారావు, నిజామాబాద్

చిలిపి ప్రశ్న

నీళ్లు ఎందుకు తాగుతాం?

- జీ రమేష్, పెనుబర్తి

ఏది భిన్నం?



పరివర్తన

కథ

'నాన్నా! రేపు మా తరగతిలోని పిల్లలంతా పరీక్ష ఫీజు చెల్లించాలని హెడ్మాస్టారు చెప్పారు.' ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు రఘు.

అప్పుడే కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చిన కేశవులు కొడుకు మాటలు విని 'అలాగా! ఫీజు ఎంతేమిటి?' అని అడిగాడు.

రెండు వందలని మెల్లగా చెప్పాడు రఘు.

'అవునా! రెండు వందలా? ఈ సారి బాగా పెంచేశారే! సర్లే. రేపు బడికి వెళ్లేప్పుడు ఇస్తాలే' అంటూ పెరట్లోకి నడిచాడు కేశవులు.

మరుసటి రోజు ఉదయం రఘు బడికి వెళ్లేందుకు తయారవుతుండగా కేశవులు అతని వద్దకి వచ్చి 'ఇదిగోరా రెండు వందలు. జాగ్రత్త మరి. వెళ్లగానే టీచరుకి ఇవ్వు'. అంటూ జేబులో డబ్బులు పెట్టాడు. 'సరే నాన్నా!' అంటూ బయటకు నడిచాడు రఘు. రఘు కాస్తంత దూరం నడవగానే అతని స్నేహితుడు అమర్ ఎదురయ్యాడు.


'ఏరా మీ నాన్న ఫీజు డబ్బులిచ్చారా?' ఆత్రుతగా అడిగాడు అమర్.

'ఇచ్చార్రా. మరి మీ నాన్నా?' అమర్ కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు రఘు.

'నేను ఫీజు రెండు వందల యాభై రూపాయలని చెబితే మారు మాట్లాడకుండా ఇచ్చేశార్రా మానాన్న' గొప్పగా చెప్పాడు అమర్.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాళ్లు చెల్లించవలసిన ఫీజు వంద రూపాయలే. తమ తల్లిదండ్రుల నుంచి ఎక్కువ డబ్బు తీసుకుని, వాటితో సినిమాకి వెళ్లాలని పథకం వేసుకున్నారు రఘు, అమర్. ఇద్దరిదీ ఒకే తరగతి. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలసి తిరుగుతుంటారు. తల్లిదండ్రుల్ని నమ్మించి భలేగా డబ్బులు తీసుకున్నామని ఇద్దరూ మురిసిపోయారు. చెరో వంద వారి తరగతి ఉపాధ్యాయుడికి ఫీజు చెల్లించారు.

మరునాడు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి వెళుతున్నామని చెప్పి టౌనుకు బయలుదేరారు. సినిమా చూసి, ఆ తర్వాత మిఠాయి దుకాణానికి వెళ్లి తమకు ఇష్టమైన తినుబండారాలెన్నో కొనుక్కుని తిన్నారు. ఆనందంగా గడిపారు. చీకటి పడే వేళకు ఇంటికి చేరుకున్నారు. రఘు ఆట నుంచి ఇంటికి వస్తున్నట్లుగా నమ్మించేందుకు ఒక క్రికెట్ బ్యాటు చేతిలో పట్టుకుని



మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. అదే సమయంలో పక్క గదిలో తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు విని ఆగిపోయాడు. కిటికీలోంచి లోపలికి చూశాడు. మంచం మీద కేశవులు జ్వరంతో వణికిపోతూ ఉన్నాడు. అతని భార్య సపర్యలు చేస్తూ 'వచ్చిన కూలి డబ్బులన్నీ పిల్లాడి ఫీజు కోసం ఇచ్చేశావు. మందులు తెద్దామంటే ఇంట్లో రూపాయి కూడా లేదు' అంది. అందుకు కేశవులు 'సమయానికి ఫీజు కట్టకపోతే రఘును పరీక్షలకు అనుమతించరు. నాకు మామూలు జ్వరమేగా వచ్చింది. రేపటికి తగ్గిపోతుందిలే' అన్నాడు మూలుగుతూ.

'అలా అంటే ఎలా? నేను పక్కింటి వాళ్ల దగ్గరకెళ్లి ఓ యాభై రూపాయలు అడిగి మందులు కొని తెస్తాను' అంటూ లేవబోయిన ప్రమీల చేయి పట్టుకుని ఆపి 'నా మాట విను రేపు చూద్దాంలే. ఇప్పుడు అప్పు చేయడం ఎందుకు?' అన్నాడు కేశవులు.

అదంతా చూస్తున్న రఘుకు బాధగా అనిపించింది. తన విలాసాల కోసం ఖర్చు చేసిన ఆ వంద రూపాయలు ఎంత విలువైనవో తెలిసి వచ్చింది. అదీగాక రోజు వారీ కూలికి వెళ్లి డబ్బు సంపాదించే తన తండ్రి శ్రమ విలువను అర్థం చేసుకోలేకపోయానని బాధపడ్డాడు. తన ఫీజు కోసం ఉన్న డబ్బులన్నీ ఇచ్చిన తండ్రి మంచితనాన్ని తలుచుకోగానే దుఃఖం తన్నుకు వచ్చింది. గదిలోకి పరుగున వెళ్లి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన తప్పును క్షమించమని విలపించాడు. వాస్తవాన్ని చెప్పినందుకు రఘును తల్లిదండ్రులు కోపగించుకోలేదు. పైగా 'చూడు రఘూ! నువ్వే మా సర్వస్వం. నీ కోసం, నీ చదువు కోసం ఏమైనా చేస్తాం. నువ్వు మాలా కూలి బతుకు బతక కూడదన్నదే మా కోరిక. జరిగింది మరిచిపో. చేసిన తప్పు తెలుసుకున్నావు కదా. అదే చాలు. ఇక మీదట నీకేం కావాలన్నా సంకోచం లేకుండా మమ్మల్ని అడుగు. మేం తెచ్చిపెడతాం. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయకు' అంటూ అక్కున చేర్చుకున్నారు. ఆ ఘటన రఘులో గొప్ప మార్పు తెచ్చింది. ఎప్పుడూ మంచి ప్రవర్తనతో మెలుగుతూ, తన మిత్రుడిలోనూ అలాంటి పరివర్తన తీసుకొచ్చాడు.

- పెండెం జగదీశ్వర్

జవాబులు: **ఏది భిన్నం:** a **చిలిపిప్రశ్న:** తినలేం కాబట్టి! **సరదా పదాలు:** 1.వేసవి 2.వేణువు 3.వేగము 4.వేడిమి 5.వేతనం 6.వేలుపు 7.వేడుక 8. వేకువ

బీడీ కార్మిక కుటుంబాలు : 30,000

మొత్తం విద్యార్థులు : 10,000

గడువు : సెప్టెంబరు 30

కొరవడిన చైతన్యం

● అరకొరగా దరఖాస్తులు

● ముంచుకొస్తున్న ఉపకార వేతనాల గడువు



ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థి

ఉమ్మడి జిల్లాలో బీడీ కార్మిక విద్యార్థుల ఉపకార వేతనాలకు అరకొరగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. దరఖాస్తు చేసుకునే స్థాయి నుంచే పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ సారి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చర్యలు తీసుకుంది. కాని దీనిపై క్షేత్ర స్థాయిలో సరైన ప్రచారం లేకపోవడంతో అర్హులైన పలువురు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. మరో 40 రోజుల గడువు మాత్రమే ఉంది.

- న్యూస్‌టుడే, ధన్వాడ

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 30 వేల కుటుంబాలు బీడీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. కార్మికులకు సంబంధించిన పది వేల మంది విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకు అర్హులుగా ఉన్నారు. గతంలో ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులే విద్యార్థుల తరఫున దరఖాస్తులు భర్తీ చేసి కార్మిక సంఘాలకు చెందిన నాయకులకు అప్పగించేవారు. వారు హైదరాబాద్‌లోని కార్యాలయానికి వెళ్లి అప్పగించేవారు. మొదట్లో ఉపకార వేతనాలు చెక్కుల రూపంలో వచ్చేవి. వీటి వల్ల అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తేవి. దీంతో ఉపకార వేతనాల పంపిణీలో కేంద్ర ప్రభుత్వం ప్రక్షాళన చర్యలు చేపట్టింది.

మారిన విధానం..

మూడేళ్ల కిందట చెక్కుల విధానానికి స్వస్తి చెప్పింది. విద్యార్థికి విధిగా బ్యాంకు ఖాతా తెరిపించి ఉపకార వేతనాలను అందులో జమచేయడం ప్రారంభించింది. కింది నుంచి పారదర్శకత కోసం ఈ ఏడాది దరఖాస్తు చేసుకునే విధానంలోనూ మార్పులు చేసింది. ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే విధానాన్ని ప్రవేశ పెట్టింది. దీనికిగాను రూ. వందను రుసుంగా వసూళ్లు చేస్తున్నది. ఎస్సీ, ఎస్టీ కార్మికుల పిల్లలు ఉపకార వేతనాలకు అర్హులు కాదు. ఎందుకంటే వారికి ఆయా కార్పొరేషన్ల ద్వారా వివిధ రూపాల్లో ఆర్థిక సహాయం అందుతుంది. కేవలం ఓబీసీ తెగకు చెందిన కార్మికుల పిల్లలే దరఖాస్తులను చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో చేసుకోవడానికి కులం, ఆదాయ ధ్రువపత్రాలతో పాటు ఆధార్, రేషన్‌కార్డు అందజేయాలి. ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో, విద్యాభ్యాసానికి సంబంధించిన ధ్రువపత్రం, బీడీ కార్మికులకు సంబంధించిన గుర్తింపు కార్డు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులైతే ఫీజుకు సంబంధించిన రశీదు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు అయితే ఫీజు లేని ధ్రువపత్రం సమర్పించాలి. మీసేవ, కేంద్రం లేదా సమీపంలో ఇతర ఆన్‌లైన్ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. స్వయంగా దరఖాస్తు చేసుకోవాలని భావిస్తే స్కాలర్‌షిప్. గౌట్.ఇన్ చిరునామాలోకి వెళ్లి చేసుకోవాలి.

కల్పించని అవగాహన

మారిన విధానంపై కార్మిక శాఖ, సంఘాలు, బీడీ యజమాన్యాలు కార్మికులకు అవగాహన కల్పించాలి. కాని ఇంత వరకు ఎక్కడా అవగాహన కల్పించిన దాఖలాలు కనిపించడంలేదు. ధన్వాడలో సుమారుగా వేయి కుటుంబాలు బీడీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. వందల సంఖ్యలో ఉపకార వేతనాలకు అర్హులైన విద్యార్థులు ఉన్నారు. కాని ఇప్పటి వరకు స్థానిక మీసేవ కేంద్రం ద్వారా ఒకే ఒక దరఖాస్తు వెళ్లింది. ఉమ్మడి జిల్లాలోని మిగతా బీడీ కార్మిక గ్రామాలు, పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇకనైన అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

పంపిణీ ఇలా..

1 నుంచి ఆ పై చదువుకుంటున్న ఓబీసీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఒకటి నుంచి మూడో తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు రూ. 250 చొప్పున, నాలుగు నుంచి ఆరు వరకు విద్యాభ్యాసం చేసేవారికి రూ. 540 చొప్పున ఉపకార వేతనాలు అందజేస్తారు. ఏడు, ఎనిమిది తరగతుల విద్యార్థులకు రూ. 840 తొమ్మిది, పదో తరగతి బాలురకైతే రూ. 1440, బాలికలకైతే 1840 చొప్పున ఇస్తారు. ఇంటర్ విద్యార్థులకు రూ. 2,500 చొప్పున పంపిణీ చేస్తారు. ఈ ఏడాదికి సంబంధించి దరఖాస్తు చేసుకునే గడువు సెప్టెంబరు 30 వరకు ఉంది. దీనిని అర్హులు గుర్తించి దరఖాస్తులు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి..: ఆన్‌లైన్ విధానం ప్రవేశ పెట్టింది నిజమే. కాని ఈ అంశం కేంద్రం పరిధిలోనిది కావడంతో మాతో పూర్తి సమాచారం ఉండదు. అంతా హైదరాబాద్‌లోనే ఉంటుంది. ఈ విషయమై సంబంధిత పరిశ్రమలకు కూడా సమాచారం వచ్చి ఉంటుంది. వారు కార్మికులకు అవగాహన కల్పించాలి. మిగతా వర్గాలు కూడా తమ పరిధి మేరకు ప్రచారం చేయాలి.

- రాజ్‌కుమార్ సహాయ కార్మికశాఖ అధికారి, మహబూబ్‌నగర్

'గుత్తేదారుల లబ్ధికే ప్రాజెక్టుల పునరాకృతి'



మాట్లాడుతున్న కోటేశ్వర్‌రావు

మక్తల్, న్యూస్‌టుడే : గుత్తేదారుల లబ్ధి పొందేందుకు పర్సంటేజీల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల పునరాకృతి ప్రకటించిందని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు ఆరోపించారు. ఆదివారం మక్తల్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ అధ్యక్షతన నిర్వహించిన రైతుకూలీ సంఘం జిల్లా సాధారణ సమావేశం నిర్వహించారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని రెండుగా విభజించాలన్నారు. జూరాల వెనుక జలాలతో భీమాలో అంతర్భాగంగా పేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టాలన్నారు. డిండి వివాదం ముగించాలని నల్గొండకు శ్రీశైలం నక్కల గండి ద్వారా నీరు ఇవ్వాలన్నారు. విశ్రాంత బ్యాంక్ రీజినల్ మేనేజర్ సుభాష్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ నోట్ల రద్దుతో సామాన్యులకు ఇబ్బంది కలుగజేసి ధనవంతుల నుంచి నల్లధనం రాబట్టలేక పోయారని విమర్శించారు. తెరాస ప్రభుత్వం 3 ఎకరాల భూమి, రెండు పడక గదులు, కేజీ నుంచి పీజీ హామీలన్నీ నెరవేర్చలేదన్నారు. నాలుగు విడతలుగా రుణమాఫీ చేయడంతో నిజమైన రైతులకు ఉపయోగం కలగలేదన్నారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేజీ రాంచందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు పథకాలు అంటే గిట్టుబాటు ధరలు రావాలన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని ఈ మూడేళ్లలో రాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకున్న 3 వేల మంది రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి, రాము, సతీష్, భగవంతు, యాదగిరి, వెంకట్‌రెడ్డి, కొండారెడ్డి, రాజన్న, ఇప్ట నాయకులు కిరణ్, భాస్కర్, అరుణోదయ కళాకారుల బృందం పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

బిజినేపల్లి, న్యూస్‌టుడే : కుటుంబ కలహాలతో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బిజినేపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల, పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా రేపల్లె మండలం లంకవీడుదెబ్బ గ్రామానికి చెందిన నాయుడు లక్ష్మీదుర్గ (25) అనే మహిళ తన భర్త రవి, కుటుంబ సభ్యులతోపాటు వచ్చి బిజినేపల్లిలో జీవనం కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా లక్ష్మీదుర్గ.. ఉదయం బిజినేపల్లి మండల కేంద్రంలోని తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రాంతీయాసుపత్రికి పంచనామా నిమిత్తం తరలించారు. లక్ష్మి ఇంట్లో కుటుంబ సభ్యులతో గత కొంత కాలంగా విబేధాలు ఉన్నాయని, దీంతో తరచూ గొడవలు జరిగేవని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై ఎస్సై ప్రదీప్‌కుమార్ వివరణ కోరగా.. బాధిత కుటుంబ సభ్యులు ఇంతవరకు ఫిర్యాదు ఇవ్వలేదని అన్నారు. లక్ష్మికి భర్త రవి, ఇద్దరు పిల్లలు అత్తమామలు ఉన్నారు.

జడ్చర్ల సమీపంలో చిరుతపులి సంచారం

బాదేపల్లి, న్యూస్‌టుడే : జడ్చర్ల సమీపంలో రెండు చిరుత పులులు సంచరించిన ఆనవాళ్లు కనిపించడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. జడ్చర్ల కొత్త బస్టాండుకు 2 కి.మీ. దూరంలోని శంకరాయపల్లి తండా సమీపంలో కొంగళి జంగయ్య అనే రైతుకు 25 ఎకరాల్లో మామిడి తోట ఉంది. శనివారం రాత్రి, ఆదివారం ఉదయం మామిడి తోటలో రెండు చిరుత పులులు తిరిగినట్లు వాటి కాలి గుర్తులు కన్పించాయి. ఒకటి తల్లి, మరొకటి దాని పిల్ల కావచ్చుని భావిస్తున్నారు. నెల కింద కూడా చిరుత ఇక్కడ సంచరించిందని రైతు తెలిపారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించామని, ఇప్పటికీ వారి నుంచి స్పందన లేదని జంగయ్య ఆవేదన వ్యక్తంచేశారు.



చిరుత పులి అడుగు ముద్ర

పరీక్ష రాయండి.. చదువుకు గుర్తింపు పొందండి

అమరచింత, న్యూస్‌టుడే : పరీక్ష రాయండి.. చదువుకు గుర్తింపు పొందండని వయోజన విద్యాశాఖ ఉమ్మడి జిల్లాల డైరెక్టర్ వీరభద్రరావు అన్నారు. ఆదివారం అమరచింత మండల కేంద్రం శ్రీకృష్ణనగర్ సాక్షర భారత్ కేంద్రంలో ప్రాథమిక అక్షరాస్యత పరీక్షను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎంతో మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది వారి జీవితంలో కొత్త వెలుగును తెచ్చామన్నారు. నేషనల్ లిటరసీ మిషన్ అథారిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కూలింగ్ న్యూదిల్లీ వారితో నేడు దేశ వ్యాప్తంగా పరీక్ష జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో 1149 సాక్షర భారత్ కేంద్రాల ద్వారా లక్షా 10 వేల మంది పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు. వనపర్తి జిల్లాలో 10 వేల మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. పరీక్షలకు హాజరైన వారికి సర్టిఫికెట్ ఇస్తామని దీంతో చదువుకున్న వ్యక్తిగా గుర్తింపు లభిస్తుందన్నారు. మస్తీపూర్‌లోని సాక్షర భారత్ కేంద్రంను పరిశీలించారు. ఆయన వెంట రాష్ట్ర పరిశీలకులు జేఎస్ఎస్ సుబ్బారెడ్డి, సమన్వయకర్త ప్రవీణ్, మండల ప్రేరకలు మాధవి, తౌఫిక్ పాల్గొన్నారు.



పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న వీరభద్రరావు

పాముకాటుకు అన్నదమ్ముల బలి

పేదరికం అమ్మానాన్నలను బతుకుదెరువుకు వలస వెళ్లేలా చేసింది.. తల్లిదండ్రులకు దూరంగా ఒకరికొకరు తోడుగా నానమ్మ వద్ద ఉండి చదువుకుంటున్న చిన్నారులను పాముకాటు బలి తీసుకుంది.. కలిసిమెలిసి సాగిన అన్నాదమ్ములు మరణంలోనూ ఒకటిగానే వెళ్లడం గ్రామంలో ప్రతి ఒక్కరిని కలిచివేసింది..

- న్యూస్‌టుడే, కొత్తకోట గ్రామీణం

ఇంట్లో నేలపై నిద్రిస్తున్న అన్నదమ్ములను పాము రూపంలో మృత్యువు కబలించిన సంఘటన వనపర్తి జిల్లా మదనాపురం మండలం నరసింగపురంలో చోటు చేసుకుంది. ఎస్సై జబ్బార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ, ఆశన్న దంపతులు తమ ఇద్దరు కుమారులు హరికృష్ణ (10), మహేష్ (8)లను ఇంటి వద్ద ఉంచి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. నానమ్మ నాగమ్మ వద్ద ఉంటూ వారిద్దరు 4, 3వ తరగతి చదువుతున్నారు. శనివారం అర్ధరాత్రి హరికృష్ణ చేతికి ఏదో కరిచినట్లు అనిపించడంతో నిద్రలేచి పక్కనే ఉన్న చిన్నమ్మకు చెప్పాడు. వెంటనే చికిత్స కోసం ఆటోలో వనపర్తి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హరికృష్ణ మృతిచెందాడు. హరికృష్ణ మృతదేహాన్ని ఇంటికి తీసుకవచ్చేలోపే మహేష్ శరీరం, ముఖం పూర్తిగా ఉబ్బిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే మహేష్‌ను వనపర్తి జిల్లా ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆసుపత్రిలోకి తీసుకెళ్తుండగానే మహేష్ మృతిచెందాడు. గ్రామానికి చేరుకున్న ఈశ్వరమ్మ, ఆశన్నలు కుమారుల మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. తండ్రి ఆశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతిచెందిన హరికృష్ణ, మహేష్

చిన్నారుల కుటుంబానికి ఆర్థిక సాయం : పాముకాటుతో మృతిచెందిన హరికృష్ణ, మహేశ్ కుటుంబానికి జిల్లా కలెక్టర్ శ్వేతామహంతి తక్షణ సాయంగా రూ. అయిదు వేలు రెవెన్యూ అధికారులతో అందజేశారు. అన్నదమ్ములు ఇద్దరికీ మరో రూ. 1.50 లక్షలు కుటుంబ సభ్యులకు ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారని తహశీల్దార్ సింధూజ చెప్పారు.



మృతిచెందిన చేపలను పరిశీలిస్తున్న మత్స్యకారుల సంఘం జిల్లా నాయకులు

భీమా కాల్వకు నీరందక చేపలు మృత్యువాత

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : సంగంబండ రిజర్వాయర్ సమీపంలో భీమా ప్రధాన కాల్వలో రూ. 1.30 లక్షల చేప పిల్లలు మృతి చెందినట్లు మత్స్యకారులు తెలిపారు. కృష్ణానది నుంచి ప్రధాన కాల్వ ద్వారా రిజర్వాయర్‌కు నీటిని నింపుతుండటంతో రిజర్వాయర్‌లోని చేపలు కాల్వలోకి ప్రవేశించాయి. రెండు రోజుల కిందట కృష్ణానదిలో నీటి సామర్థ్యం తగ్గిపోవడంతో సంగంబండకు నీటి పంపింగ్ నిలిపివేశారు. దీంతో భీమా కాల్వలో ఉన్న దాదాపు రూ. 1.30 లక్షల చేప పిల్లలు మృతిచెందాయి. మృతి చెందిన చేపలను ఉమ్మడి జిల్లాల మత్సకారుల సంఘం డైరెక్టర్ కోళ్ల వెంకటేష్ ఆదివారం భీమా కాల్వ వద్దకు చేరుకొని పరిశీలించారు. ప్రభుత్వం మత్స్యకారుల కుటుంబాలకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కృష్ణానదిలో వరద ఉధృతి తగ్గడంతోనే భీమా కాల్వకు నీరు అందక చేపలు మృతిచెందాయన్నారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం నాయకులు చంద్రశేఖర్, తిరుపతినర్సిములు, అంజయ్యచారీ, కావలి శ్రీహరి, మామిళ్ల కిష్టప్ప, ఎంపీటీసీ రవిశంకర్‌రెడ్డి, గురకొండ శ్రీనివాసులు, వల్లంపల్లి శివకుమార్, పృథ్వీరాజ్, మూర్తి పాల్గొన్నారు.

TENTH English

ప్రతిభ

PREPOSITIONS

A Preposition is a word such as in, on, at or beside that is used before a noun or a noun phrase or a pronoun to show a link with another word or phrase.

It goes without saying that language is the dress of thought. As such, we express our feelings and thoughts through words. The words we use in a sentence need to be precise, accurate and forceful. So to say, prepositions are such forceful, nay powerful words which govern the entire sentence. Therefore, a thorough practice of using correct prepositions is needed for the learner.

Nithin is fond *of* eating..

★ Study the prepositions under lined in the following sentences:

1. Vaccination protects us from many diseases.
2. A man is known by the company the keeps.
3. Foundation of a house lies below the ground level.
4. Srinidhi has no appetite for sweets.

The words from, by, below and for are prepositions.

Kinds Of Prepositions

Prepositions have different functions: to indicate time, place, movement, direction, means, manner, purpose, source, concession, etc.

Examples: 1. The train arrived on time. (Time)
2. I met Sahithi at the theatre. (Place)
3. Shirisha went to the market for fruits. (Purpose)
4. Rishita drove along the main road in a hurry. (Direction)

A. Simple Prepositions: in ★ on ★ at ★ to ★ for ★ from ★ of ★ off out ★ by ★ till ★ with ★ through, etc.

Study the following sentences and observe the prepositions used in each sentence and note the function of the prepositions given in the brackets.

1. Vaishnavi waited for the doctor till he returned. (Time)
2. Naveen left Boath for Dubai. (Place)
3. Inspite of the hurdles, Kavya succeeded in her efforts. (Concession)

B. Compound Prepositions

about ★ above ★ across ★ along ★ amidst ★ among ★ around ★ before ★ behind ★ below ★ beneath ★ beside ★ between ★ beyond ★ inside ★ out side ★ within ★ with out

Examples: 1. A narrow path ran in between the two houses.
2. The moon moves around the Earth.
3. Inside the box was a diamond studded watch.
4. I cannot allow the work to continue beyond the end of December.

Exercise - 1

✪ *Fill in the blanks with suitable Simple Prepositions.*

1. Nithin is fond .... eating sweets.
2. English is quite different .... Telugu.
3. Malavika fell ... her bicycle and broke her leg.
4. Ashwini drove her car .... the side gate.
5. I'll return your book .... a week.

Exercise - 2

✪ *Fill in the blanks with suitable Compound prepositions.*

1. Apple and banana are .... the most popular fruits.
2. Moiz usually sits .... Saikumar in the class.
3. There is something special .... our Headmaster.
4. A new bridge is being built .... the river.
5. She looks nice .... make-up.

C. Compound Prepositional Phrases

Compound Prepositional Phrases consist of two or more words, such as due to, because of, together with, etc.

Examples:

1. The rowdy was arrested according to IPC 420.
2. I cannot see the film because a tall man is sitting infront of me.
3. Vijayendra Prasad goes to school along with Vamsi Krishna daily.
4. Ring the alarm bell in case of emergency.

✪ *Study the following compound Prepositional Phrases and note the meanings given to each of them*

Comp.Prep.Phrases	Meanings
along with	together with
on account of	because of
by means of	through the agency of
apart from	separate from
ahead of	earlier than something/ somebody
in front of	located before
in place of	as a substitute for
inspite of	disregarding the difficulty
in case of	in the event of
by way of	via
due to	on account of
for the sake of	for the good of
in addition to	added to
in accordance with	in agreement with

Examples: The thief entered the house by means of a broken window.

2. Shruthi attends special classes on Sundays in addition to regular practice.
3. We postponed our trip to Ramoji Film City due to bad weather.
4. Inspite of being rich, my neighbour is not happy.

Exercise - 3

✪ *Fill in each blank with the correct Compound Prepositional Phrases from those given under each sentence.*

1. .... his injury, Umesh will play in Sunday's match.
a) Due to b) For the sake of c) In spite of

2. He sent me some flowers .... an apology.
a) by way of b) in case of c) apart from

3. Is there parking space .... the hotel?
a) ahead of b) in front of c) along with

4. She lost her way when she went into the jungle .... firewood.
a) for the sake of b) in addition to c) in search of

Answers

Ex-1: 1) of 2) from 3) off 4) through 5) in
Ex-2: 1) among 2) beside 3) about 4) across 5) without
Ex-3: 1-c 2-a 3-b 4-c.



రచయిత
డి.నారాయణ,
విషయ నిపుణులు

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?

1. ఒక వాహనం తన ప్రయాణ దూరంలోని మూడు సమ దూరాలను వరుసగా 80, 60, 30 కి.మీ. / గంట వేగంతో ప్రయాణిస్తే దాని సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)
1) 60 2) 50 3) 48 4) 24

2. ఖగోళశాస్త్రంలో 'పార్‌సెక్' దేనికి ప్రమాణం?
1) దూరం 2) కాలం 3) వేగం 4) పౌనఃపున్యం

3. ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేని AC విద్యుత్‌కి సంబంధించిన అంశం?
1) వోల్టేజీ 2) కరెంట్ 3) పౌనఃపున్యం 4) పైవన్నీ

4. భూస్థావర (జియోస్టేషనరీ) ఉపగ్రహం భూమి కేంద్రం నుంచి సుమారు ఎంత ఎత్తులో ఉంటుంది?
1) 36000 కి.మీ. 2) 6,400 కి.మీ.
3) 21,000 కి.మీ. 4) 42,400 కి.మీ.

5. రేడియో రిసీవర్లలో ఉపయోగించే వలయం ఏది?
1) శుద్ధ నిరోధ వలయం 2) LC - ట్యాంక్ వలయం
3) శుద్ధ ప్రేరక వలయం
4) శుద్ధ కెపాసిటర్ వలయం

6. టెఫ్లాన్ పూత పూసిన లోహ పరికరాలను ఉపయోగించి అధిక వోల్టేజీ విద్యుత్ ప్రసారాలను నిలిపివేయకుండానే వాటిని తీసుకుని వెళ్లే తీగలను ముట్టుకుంటారు. ఎందు కంటే టెఫ్లాన్ ఒక...
1) విద్యుత్ బంధకం 2) అర్ధ వాహకం
3) విద్యుత్ వాహకం 4) అతివాహకం

7. గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?
1) పీడనం 2) ఆర్ద్రత
3) గాలి (పవన) వేగం 4) ఉష్ణోగ్రత

8. ప్రతిపాదన **(A):** పాలీవినైల్ క్లోరైడ్‌తో తయారైన రెయిన్ కోట్లను వర్షం నీరు తడపదు.
కారణం (R): పాలీవినైల్ క్లోరైడ్, నీటి మధ్య స్పర్శ కోణం 90° కంటే ఎక్కువ.
1) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ.
2) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ కాదు.
3) A, R రెండూ సరైనవి కావు.
4) A సరైంది. కానీ, R సరైంది కాదు.

9. శక్తి నిత్యత్వ నియమానికి ప్రతిరూపం -
1) లెంజ్ నియమం
2) ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం
3) కిర్కాఫ్ రెండో నియమం 4) పైవన్నీ

10. శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
1) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు ఘన పరిమాణం శూన్యం అవుతుంది.
2) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు పీడనం శూన్యం అవుతుంది.
3) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను పొందడం అసాధ్యం.
4) పైవన్నీ సరైనవే

11. కేంద్రక బలాలు....
1) ఆకర్షణ బలాలు 2) స్వల్ప అవధి బలాలు
3) అత్యంత బలమైన బలాలు 4) పైవన్నీ

12. రాకెట్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
1) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
2) శక్తి నిత్యత్వ నియమం
3) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం 4) పైవన్నీ

13. ఉష్ణశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చేది ఏది?
1) థర్మోకపుల్ 2) ఎలక్ట్రిక్ హీటర్
3) ఎలక్ట్రిక్ బల్బు 4) ఫొటో సెల్

14. స్వేచ్ఛగా కిందపడే వస్తువు...
1) మొత్తం యాంత్రిక శక్తి స్థిరం
2) స్థితిజ శక్తి క్రమంగా పెరుగుతుంది



రచయిత
డి. అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

3) గతిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
4) 1, 3

15. ఎత్తయిన ప్రదేశం (విమానం) నుంచి చూస్తే ఇంద్రధనస్సు ఏ ఆకారంలో కనిపిస్తుంది?
1) అర్ధ వృత్తం 2) వృత్తం
3) పరావలయం 4) ఏదీకాదు

16. 40°C వద్ద ఉన్న 500 మి.లీ. నీటిని అంతే పరిమాణంలో, 70°C వద్ద ఉన్న నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) 110° C 2) 55°C 3) 40°C 4) 65°C

17. ఒక వ్యక్తికి సరైన దృష్టి కోసం డాక్టర్ +2D కటకం వాడమని సలహా ఇచ్చారు. అది ఏ రకమైన కటకం? దాని నాభ్యాంతరం ఎంత?
1) కుంభాకార, 100 సెం.మీ.
2) పుటాకార, 10 సెం.మీ.
3) కుంభాకార, 50 సెం.మీ.
4) పుటాకార, 50 సెం.మీ.

18. కాంతి విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రసరిస్తే, దాని తరంగదైర్ఘ్యం (λ), పౌనఃపున్యం (υ) విలువలు ఏ విధంగా ఉంటాయి?
1) λ, υ రెండూ పెరుగుతాయి
2) λ పెరుగుతుంది, υ స్థిరం
3) λ తగ్గుతుంది, υ స్థిరం
4) λ, υ రెండూ తగ్గుతాయి

19. వస్తువు గతిజ శక్తి వేటిపై ఆధారపడుతుంది?
1) ద్రవ్యరాశి, ఎత్తు 2) వేగం, కాలం
3) ఎత్తు, త్వరణం 4) ద్రవ్యరాశి, వేగం

20. సమ వేగంతో వెళ్లే వస్తువు ....
1) చలన దిశ స్థిరం, వడి అస్థిరం
2) వడి స్థిరం, చలన దిశ అస్థిరం
3) వడి, చలన దిశ రెండూ అస్థిరం
4) వడి, చలన దిశ రెండూ స్థిరం

21. మానవుడి గుండె సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటుంది. అయితే దాని స్పందన పౌనఃపున్యం ఎంత? (హెర్ట్జ్‌లలో)
1) 1.25 2) 3.25 3) 4.25 4) 2.25

22. R నిరోధం ఉన్న n నిరోధాలను సమాంతరంగా కలిపితే, ఫలిత నిరోధం...
1) nR 2) $n^2 R$ 3) $\frac{R}{n^2}$ 4) $\frac{R}{n}$

23. వర్షాకాలంలో రోడ్లపై నూనె పొరలు రంగుల్లో కనిపించడానికి కారణం?
1) ధ్రువణం 2) వ్యతికరణం
3) పరిక్షేపణం 4) విక్షేపణం

24. పౌనఃపున్య మాడ్యులేషన్‌లో (FM) వాహక తరంగం పౌనఃపున్యం దేనికి అనుగుణంగా మారుతుంది?
1) సంకేత తరంగ తక్షణ పౌనఃపున్యం
2) సంకేత తరంగ తక్షణ దశ
3) సంకేత తరంగ తక్షణ కంపన పరిమితి
4) సంకేత తరంగ తక్షణ వేగం

25. నక్షత్రం నుంచి వెలువడే కాంతి క్రమంగా ఎరుపు రంగుకి మారితే, అది దేన్ని సూచిస్తుంది?
1) నక్షత్రం భూమి వైపు రావడాన్ని
2) నక్షత్రం విరామ స్థితిలో ఉండటాన్ని
3) నక్షత్రం భూమికి దూరంగా వెళ్లడాన్ని
4) నక్షత్రం ఉష్ణోగ్రత క్రమంగా తగ్గడాన్ని

జవాబులు

1-3	5-2	9-4	13-1	17-3	21-1	25-3
2-1	6-1	10-4	14-4	18-3	22-4	
3-3	7-1	11-4	15-2	19-4	23-2	
4-4	8-1	12-3	16-2	20-4	24-1	

కరెంట్ అఫైర్స్

ప్రతిభ



క్రీడలు టెస్ట్ సిరీస్ నెగ్గిన భారత్ — ఆగస్టు 14

శ్రీలంకలో శ్రీలంకతో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 3-0 తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లీ సేన ఘనత సాధించింది. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా శిఖర్ ధావన్ నిలిచాడు.

జీవించదగిన అత్యుత్తమ నగరం ఏది..?

జాతీయం

ఆగస్టు 13: కీలక బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బాధ్యతలు చేపట్టిన మూడు వారాల్లో ఆరు కీలక బిల్లులపై సంతకాలు చేశారు. ఆయన ఆమోదం లభించడంతో ఇకపై అవి చట్టాలుగా రూపుదాల్చనున్నాయి.

★ బ్రిటిష్ కాలంనాటి రెండు చట్టాల స్థానంలో రూపొందించిన ది అడ్మిరాలిటీ (పరిధి, మారిటైమ్ క్లెయిమ్‌ల చెల్లింపు) బిల్లు; బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు (సవరణ) బిల్లు; జమ్మూ-కశ్మీర్‌కు వర్తించే గణాంకాల సేకరణ (సవరణ) బిల్లు; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) బిల్లు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (సవరణ) బిల్లు; ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ బిల్లులపై రామ్‌నాథ్ సంతకాలు చేశారు.

ఆగస్టు 14: భారతీయ భాషల్లో గూగుల్ వాయిస్ సెర్చ్

టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ తన వాయిస్ సెర్చ్ ఫీచర్‌కు కొత్తగా 8 భారతీయ భాషలను జోడించింది. ఇప్పటి వరకు హిందీ, ఇంగ్లిష్ భాషల్లోనే గూగుల్ వాయిస్ సెర్చ్ సౌలభ్యం అందుబాటులో ఉంది. ఇప్పుడు తెలుగు, బెంగాలీ, మలయాళం, తమిళం, గుజరాతీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ భాషల్లోనూ దీన్ని అందించనున్నామని సంస్థ తెలిపింది.

★ గూగుల్ యాప్‌లో వాయిస్ సెట్టింగ్స్‌లో కావాల్సిన భాషను ఎంచుకోవాలని సూచించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 149 భాషలకు ఈ వెసులుబాటు ఉంది.

ఆగస్టు 15: 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

దేశవ్యాప్తంగా 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆధార్ నుంచి అంతరిక్షం దాకా అన్ని అంశాలను స్పృశించారు.

★ 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2022 నాటికి ప్రతి పేద వ్యక్తికి పక్కా ఇల్లు నిర్మించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు, నల్లధనంపై కొరడా సహా తన ప్రభుత్వం చేపట్టిన అనేక సంస్కరణలు, పథకాలను ప్రస్తావించారు. స్వాతంత్ర్య సాధన కోసం 'భారత్ చోడో' అని నినదించినట్లు ఇప్పుడు 'భారత్ జోడో' నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

★ సమష్టి సంకల్ప శక్తి ద్వారా 2022 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేసే దిశగా నవభారతాన్ని ఆవిష్కరించాలని మోదీ పేర్కొన్నారు.

★ ప్రధాని హోదాలో మోదీ చేసిన నాలుగు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ఇదే అత్యంత చిన్న ప్రసంగం (సుమారు 56 నిమిషాలు) కావడం విశేషం.

ఆగస్టు 16: రికార్డు స్థాయిలో ఆహారధాన్యాల ఉత్పత్తి

గత జూన్‌తో ముగిసిన 2016-17 పంట సంవత్సరంలో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 27.56 కోట్ల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంచనా వేసిన దానికంటే 20.30 లక్షల టన్నులు అధిక దిగుబడి వచ్చినట్లు పేర్కొంది.

★ 2015-16 (జులై - జూన్)లో 25.17 కోట్ల టన్నుల దిగుబడి వచ్చింది. 2013-14 లో వచ్చిన 26.50 కోట్ల టన్నుల దిగుబడే ఇంతవరకు రికార్డు.

★ వరి దిగుబడులు 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు, గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, తృణధాన్యాలు 3.85 కోట్ల టన్నుల నుంచి 4.41 కోట్ల టన్నులకు, పప్పుధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగాయి.

★ కంది, మినపప్పుల దిగుబడులు చాలా బాగుండటం గమనార్హం. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది.



ఆగస్టు 17: అమెరికా నుంచి అపాచీ హెలికాప్టర్లు

సైన్యం కోసం అమెరికా నుంచి ఆరు అధునాతన అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన దిల్లీలో సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రూ. 4,168 కోట్ల విలువైన ఈ ప్రతిపాదన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. దీనికి తోడు అధునాతన గ్రిగోరివిచ్ శ్రేణి స్టెల్త్ యుద్ధనౌకలకు రూ. 490 కోట్లతో రెండు జోర్యా గ్యాస్ టర్బైన్ ఇంజిన్ల కొనుగోలు చేయడానికి కూడా డీఏసీ ఆమోదం తెలిపింది

అంతర్జాతీయం

ఆగస్టు 12: కెన్యా అధ్యక్షుడిగా మళ్లీ ఉహురు కెన్యట్టా



ఆఫ్రికా దేశమైన కెన్యా అధ్యక్షుడిగా ఉహురు కెన్యట్టా రెండోసారి ఎన్నికయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో 54.27 శాతం ఓట్లు దక్కించుకున్న కెన్యట్టా విజయం సాధించినట్లు కెన్యా ఎన్నికల సంఘం ప్రకటించింది.

★ ప్రతిపక్ష నేత రైలా ఓడింగా 44.74 శాతం ఓట్లు పొందారు. అయితే ఎన్నికలు సక్రమంగా జరగలేదని, రిగ్గింగ్, ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందని ఓడింగా ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు నిర్వహించిన ఆందోళనలు హింసాత్మకంగా మారి, 11 మంది మరణించారు.

ఆగస్టు 14: కలరా బారిన యెమన్

యెమన్‌లో కలరా విజృంభిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. 2017 ఏప్రిల్ నుంచి 5 లక్షలకుపైగా ప్రజలు దీని బారినపడగా 1975 మంది మృతి చెందినట్లు పేర్కొంది.

వార్తల్లో ప్రదేశాలు

ఆగస్టు 14:

హైదరాబాద్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు

ప్రపంచ పారిశ్రామికవేత్తల (వ్యవస్థాపకుల) వార్షిక శిఖరాగ్ర సదస్సును 2017 నవంబరు 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరుకానున్నారు. అగ్ర రాజ్యమైన అమెరికా ఈ సదస్సును నిర్వహిస్తుండటం విశేషం.


ఆగస్టు 16: అత్యుత్తమ నగరంగా మెల్‌బోర్న్

ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ రూపొందించిన గ్లోబల్ లివబిలిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో జీవించదగిన అత్యుత్తమ నగరంగా ఆస్ట్రేలియా రాజధాని మెల్‌బోర్న్ ప్రథమస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో వియన్నా (ఆస్ట్రియా), వాంకోవర్ (కెనడా) ఉన్నాయి.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

ఆగస్టు 17:

స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు



తెలుగు రాష్ట్రాల్లోని 35 ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు ఎంపికయ్యాయి. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల నుంచి 172 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికకగా వీటిలో 35 పాఠశాలలు తెలుగు రాష్ట్రాలకు చెందినవి కావడం విశేషం (ఏపీ నుంచి 21, తెలంగాణ నుంచి 14 ప్రభుత్వ పాఠశాలలు).

★ స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్రం ఈ పురస్కారాలను అందిస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు ఉన్న సౌకర్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం వీటిని ప్రకటించింది.

★ తమిళనాడు నుంచి అత్యధికంగా 25 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికయ్యాయి. అత్యుత్తమ ఆరోగ్య-పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్న ఒక్కో పాఠశాలకు రూ. 50 వేల చొప్పున నగదు బహుమతి అందిస్తారు.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

ఆగస్టు 15: తిరుపతిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిరుపతిలోని తారకరామ మైదానంలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల కోసం రూ. 43 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల పింఛనును రూ. 7 వేల నుంచి రూ. 15 వేలకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. 2019 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించారు.

పురుషోత్త పట్నం ఎత్తిపోతల ప్రారంభం

✪ గోదావరి నదిని ఏలేరుతో అనుసంధానించే పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

ఆగస్టు 16: ఐయూఐహెచ్ శంకుస్థాపన

రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక ఇండో-యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఐయూఐహెచ్), అమరావతి మెడిసిటీ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుపై ఐయూఐహెచ్ రూ. 1600 కోట్లు వెచ్చించనుంది.

రాష్ట్రీయం - తెలంగాణ

ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తెలంగాణ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది కొత్తగా 84,876 ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు కేసీఆర్ చెప్పారు.

★ 1936 లో నిజాం కాలంలో భూసర్వే జరిగిందని, ఆ తర్వాత మళ్లీ తమ ప్రభుత్వమే సమగ్ర భూ సర్వేను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో సింహభాగాన్ని సంక్షేమానికే వెచ్చిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను పరిపూర్ణం చేసేందుకు నడుం బిగించినట్లు చెప్పారు.

★ 2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7 శాతం ఆదాయ వృద్ధి రేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు.

సిద్దిపేటకు ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రం

✪ అభివృద్ధి, సంస్కరణలతో దూసుకెళ్తున్న సిద్ధిపేట పురపాలిక మరో ఘనత సాధించింది. ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రానికి ఎంపికై, రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి పురపాలికగా నిలిచింది.

ఆగస్టు 16: తెలంగాణ పదాలతో నిఘంటువు

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణ ప్రజల భాష, యాస చిరకాలం ఉండేలా లక్ష పదాలతో నిఘంటువు తయారీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అరుదైన పదాలన్నింటినీ సేకరించి అక్షరబద్ధం చేయాలనేది ప్రణాళిక. పదాల అన్వేషణకు అమరేశం రాజేశ్వర్ శర్మ, కట్టా శేఖర్ రెడ్డి, రవ్వా శ్రీహరి, ఘంటా చక్రపాణి, డాక్టర్ నలిమెల భాస్కర్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు.

'ఓడీఎఫ్'గా హైదరాబాద్

✪ హైదరాబాద్ మహా నగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా (ఓడీఎఫ్) ప్రకటిస్తూ జీహెచ్ఎంసీ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

వార్తల్లో వ్యక్తులు

ఆగస్టు 11:

సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్ ప్రసూన్ జోషి



సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్‌గా కవి, పద్మశ్రీ ప్రసూన్ జోషి నియమితులయ్యారు. వచ్చే మూడేళ్ల కాలానికి ప్రసూన్ ఈ పదవిలో కొనసాగుతారు. పహ్లాజ్ నిహ్లాని స్థానంలో ప్రసూన్ నియమితులయ్యారు. సెన్సార్ బోర్డు సభ్యులుగా విద్యాబాలన్, గౌతమి, జీవిత తదితరులు నియమితులయ్యారు.

✪ నాటి తరం పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సౌహార్ద్ర రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి డబ్ల్యూహెచ్ఓ ఆయన్ను ఎంపిక చేసింది.

ఆగస్టు 14:

ఎంతోమంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించి, డాక్టర్ 'దీదీ'గా ప్రఖ్యాతిగాంచిన భక్తియాదవ్ (91) ఇండోర్‌లో మరణించారు. మధ్యప్రదేశ్ తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన భక్తియాదవ్ గైనకాలజిస్టుగా అందించిన సేవలకు కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది.

అవార్డులు

ఆగస్టు 14:

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

కేంద్ర ప్రభుత్వం 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల్లో ప్రతిభావంతమైన సేవలు అందించిన 990 మందికి అత్యున్నత పోలీసు పతకాలు ప్రకటించింది. వామపక్ష తీవ్రవాదులతో జరిగిన పోరులో ప్రాణాలర్పించిన చత్తీస్‌గఢ్ పోలీసు జవాను కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని ప్రకటించారు. కీర్తిచక్ర పురస్కారాన్ని అయిదుగురికి ప్రకటించారు. హవల్దార్ గిరిస్ గురుంగ్, మేజర్ డేవిడ్ మన్లుం, కమాండెంట్ ప్రమోద్ కుమార్ మరణానంతరం కీర్తిచక్రకు ఎంపికయ్యారు. మిగిలిన ఇద్దరిలో మేజర్ ప్రీతం సింగ్ కున్వార్, చేతన్ కుమార్ చీతా ఉన్నారు.




రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

వేడుక సమయం..

● వినాయక మండపాల ఏర్పాటులో జాగ్రత్తలు అవసరం
● నాణ్యమైన విద్యుత్తు తీగలతో ప్రమాదాలు దూరం

అప్రమత్తతే అభయం



వినాయక చవితి వేడుకలు మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్నాయి.. గణేష్ నామస్మరణతో వీధులు పులకించనున్నాయి. ఎంతో వైభవంగా సాగే వేడుకలు చివరి వరకు అలాగే సాగాలని అందరూ కోరుకొంటారు. మండపాల ఏర్పాటు సమయంలో.. నవరాత్రి ఉత్సవాల వేళ.. నినాయకుడిని నిమజ్జనానికి తరలించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను అధికారులు గుర్తు చేస్తున్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా విషాదం నెలకొనే అవకాశం ఉంటుందని, మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకొని వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. గతంలో మండలపాల ఏర్పాటు సమయంలో.. నిమజ్జనోత్సవాల్లో విద్యుదాఘాతాలతో పలువురు మృత్యువాత పడిన సంఘటనలు ఈ సందర్భంగా ఉదహరిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్తు తీగల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

- న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ (నేరవిభాగం)



మండే వస్తువులు పెట్టవద్దు.
.: మండపాలు ఏర్పాటు చేసే వారు అగ్నిప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మండే వస్తువులను ఎక్కువ మొత్తంలో మండపంలో ఉంచవద్దు. ప్రధానంగా మండపాల వద్ద ఇసుక, నీరు, అగ్నిని నియంత్రించే పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి. మండపాల నిర్వాహకులు ఆయా ప్రాంతాల్లోని అగ్నిమాపక కేంద్రాల నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలి. ప్రమాదం ఏదైనా జరిగితే సమాచారం అందించిన వెంటనే సిబ్బంది వచ్చి అవసరమైన సహాయక చర్యలు తీసుకుంటారు.

- శ్రీనివాస్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, మహబూబ్‌నగర్



చట్టం పరిధిలో నిర్వహించుకోవాలి...
: వినాయక చవితి వేడుకలు చట్టం పరిధిలో ప్రశాంతంగా నిర్వహించుకోవాలి. వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లో డీజేలను వినియోగించవద్దు. మండపాల వద్ద 24 గంటల పాటు వలంటీర్లు ఉండే విధంగా చూసుకోవాలి. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఏర్పాటు చేయవద్దు. నిబంధనలు పాటించి పోలీసులకు సహకారం అందించాలి.

- భాస్కర్, మహబూబ్‌నగర్ డీఎస్పీ

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

● మండపాల నిర్మాణం పటిష్ఠంగా చేయాలి. ఇటీవల వర్షాలు పడుతుండటంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రహదారి మధ్యలో, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించే విధంగా మండపాలను ఏర్పాటు చేయవద్దంటూ ఇప్పటికే పోలీసు అధికారులు సూచించారు.

● వినాయక మండపాల్లో ఎక్కువగా అలంకరణ కోసం వస్త్రం ఉపయోగిస్తారు. ఇవి కాకుండా జింక్, రేకులు వంటి వాటిని ఉపయోగించాలి. ఒకవేళ అగ్ని ప్రమాదం చోటుచేసుకొన్నా.. వీటిద్వారా మంటలు ఎక్కువగా వ్యాపించవు.

● విద్యుత్తు వైరింగ్‌పై దృష్టి పెట్టాలి. ఎక్కడా తేలిన తీగలు ఉండకూడదు. విద్యుత్తు బాక్సులపై అధిక లోడ్ వేయకూడదు.

● ప్రమాదవశాత్తు మంటలు అంటుకుంటే ఆ సమయంలో మంటలు వ్యాపించ కుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధానంగా మండే పదార్థాలు మండపంలో ఉంచకూడదు.

● ప్రధాన విద్యుత్తు తీగలకు పక్కన మండపాలు ఏర్పాటు చేయరాదు.

● విగ్రహం ఎదుట ఎలాంటి ప్రసాదం, ఇతర తినుబండారాలు పెట్టకూడదు. రాత్రివేళ వీటిని ఎలుకలు తినడానికి వచ్చి దీపం వంటివి కిందకు పడేస్తాయి. అగ్ని ప్రమాదం సంభవించే అవకాశం ఉంటుంది.

● వినాయక మండపాలు ఏర్పాటు చేసే వారు సమీప అగ్నిమాపక శాఖ కేంద్రం నంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలి. ప్రమాదం జరిగితే వెంటనే ఫోన్ చేసి సంఘటన స్థలానికి వచ్చేలా చూసుకోవాలి.



శెట్టికాంప్లెక్స్ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం

పాటించాల్సిన నిబంధనలు ఇవీ..

● వినాయక విగ్రహ ప్రతిష్ఠాపనకు అనుమతి తీసుకొని, సంబంధింత పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకోవాలి.

● మండపాల ఏర్పాటు వివాదాస్పద స్థలాల్లో, ప్రార్థనా మందిరాలకు వెళ్లే దారుల మధ్య చేయరాదు. రోడ్డు మధ్యలో నిర్మించి పాదచారులు, వాహనదారులకు ఆటంకం కలిగించరాదు.

● విద్యుత్తు కనెక్షన్ కోసం ఆ శాఖ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి.

● రాత్రి పది గంటల తర్వాత ఎలాంటి మైకు వినియోగించరాదు. మైకులను అన్యమతస్థుల ప్రార్థనా మందిరాలకు దగ్గరలోగాని, ప్రార్థనా మందిరాలవైపు గాని పెట్టకూడదు.

● మండపాల వద్ద ఖచ్చితంగా ఇద్దరు వలంటీర్లు 24 గంటల పాటు ఉండే విధంగా చూసుకోవాలి.

● మండపం పరిసరాల్లో అనైతిక కార్యకలాపాలు నిషిద్ధం. గతంలో మద్యంతాగడం వంటి ఘటనలు వెలుగు చూడటంతో పోలీసు శాఖ ఈ సారి గట్టిగా నిఘా పెట్టనుంది.

● భక్తిగీతాలు మాత్రమే వినిపించాలి. డీజే సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేసుకోవద్దు. సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే మండపాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఇప్పటికే పోలీసులు స్పష్టం చేశారు.

ఫైనల్స్‌కు చేరిన జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టు

మహబూబ్‌నగర్ (క్రీడలు), న్యూస్‌టుడే : వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో ప్రారంభమైన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో జిల్లా బాలుర జట్టు ఫైనల్స్‌కు చేరింది. ఆదివారం జరిగిన సెమీస్‌లో జిల్లా జట్టు నిజామాబాద్‌పై 9-1 స్కోరుతో నెగ్గి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. సోమవారం ఫైనల్‌లో జిల్లా జట్టు మెదక్ తలపడనుందని కోచ్ నాగరాజు తెలిపారు.

అన్నదాతలకు మేలైన సూచనలివ్వాలి

జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త డా.రామకృష్ణ

మహబూబ్‌నగర్(వ్యవసాయం), న్యూస్‌టుడే : అన్నదాతలకు ఎరువుల, పురుగు మందుల డీలర్లు మేలైన సూచనలు అందించాలని జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త డా.రామకృష్ణ సూచించారు. డీలర్లు వ్యవసాయ శాస్త్రవేత్తలుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం బండమీదిపల్లి దగ్గర ఉన్న రైతుశిక్షణ కేంద్రంలో ఎరువులు, పురుగు మందుల సీనియర్ డీలర్లకు నిర్వహించిన శిక్షణలో రామకృష్ణ మాట్లాడారు. స్వలాభం కోసం రైతులకు అనవసర మందులను అంటకట్టరాదని, కొంత సేవాభావం కూడా అవసరమని చెప్పారు. ప్రధానంగా పంటలకు వచ్చిన తెగుళ్ల విషయాలను తెలుసుకున్న తర్వాత డీలర్లు వ్యవసాయశాఖ అధికారుల సూచనలను తీసుకొని మందులను రైతులకు ఇవ్వాలని చెప్పారు. శిక్షణ కేంద్రం ఉప సంచాలకుడు హూక్యా నాయక్, రాష్ట్ర సమితి ఏడీఏ రాధిక, శిక్షణ కేంద్రం ఏడీఏ యశ్వంత్‌రావు, ఏవోలు కృపాకర్‌రెడ్డి, ప్రత్యూష తదితరులు డీలర్లకు పలు సూచనలు ఇచ్చారు. ఈ శిక్షణ 40 వారాలు ఉంటుందని, ఖచ్చితంగా పాత డీలర్లంతా ఈ శిక్షణ పొందాలని అన్నారు.

వైద్యవిద్యకు స్పష్టమైన లక్ష్యంతో చదవాలి



సదస్సులో మాట్లాడుతున్న అధ్యాపకులు

వీరన్నపేట (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే : వైద్యవిద్య అభ్యసించాలనుకున్న విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో చదవాలని నిపుణులు సూచించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సుదర్శన్ కన్వెన్షన్ హాల్‌లో రిషి అకాడమి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన వైద్యవిద్య శిక్షణ నిపుణులు శీనయ్య, రిషి అకాడమి సలహాదారు వెంకటయ్య మాట్లాడారు. జిల్లా కేంద్రంలోనే కార్పొరేట్ సంస్థలకు ధీటుగా అకాడమి ఆధ్వర్యంలో బోధన అందిస్తున్నట్లు చెప్పారు. అకాడమిని స్థాపించిన రెండు సంవత్సరాల్లోనే 28 మెడికల్ సీట్లు, ఎనిమిది బీడీఎస్ సీట్లు సాధించినట్లు చెప్పారు. ఎయిమ్స్‌లో సీట్లు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. నీట్‌లో మంచి ర్యాంకులు సాధించాలంటే విద్యార్థి కృషి, అధ్యాపకుల బోధనతో పాటు తల్లిదండ్రుల సహకారం కూడా అవసరమని అన్నారు. విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు ప్రయత్నించాలని, సామాజిక మాధ్యమలు, సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అకాడమి డైరెక్టర్ చంద్రకళ, ఇన్‌ఛార్జి వేణుగోపాల్, ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, అధ్యాపకులు కృష్ణ, గిరిబాబు, హుస్సేన్, పద్మనాభం, వాసు, శ్రీకాంత్, నరసింహారావు, శంకర్, దీపక్, మహేష్, కోటేశ్వర్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉపకరణాలకు 23, 24న నమోదు శిబిరాలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే : దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందించనున్నామని, దీనికోసం అవసరార్థుల నుంచి ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేకంగా నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు స్త్రీ, శిశు మహిళా సంక్షేమం, వృద్ధులు, దివ్యాంగుల శాఖ జిల్లా సంక్షేమాధికారి ఎం.గోవిందరాజులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడు చక్రాల సైకిళ్లు, చక్రాల కుర్చీలు, సంక కర్రలు, అంధుల చేతికర్రలు, వినికిడి యంత్రాలు, కృత్రిమ అవయవాలు తదితర ఉపకరణాల పంపిణీకి కాన్పూర్‌కు చెందిన ఆలింకో సంస్థ వారు వీటిని అందించనున్నారని చెప్పారు. ఈ నెల 23న నారాయణపేటలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో, 24న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మోడ్రన్ హైస్కూల్‌లో నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇది కేవలం మహబూబ్‌నగర్ జిల్లా వారికి మాత్రమేనని పేర్కొన్నారు. ఉపకరణాలు అవసరమైన దివ్యాంగులు వారి సదరం, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రేషన్ (ఆహారభద్రత)కార్డు నకలుతో పాటు 3 ఫొటోల చొప్పున తీసుకుని శిబిరంలో పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

దివ్యాంగుల దేహదారుఢ్య పోటీల్లో స్వర్ణం



పతకం అందుకుంటున్న అబ్దుల్ ఇమ్రాన్

మహబూబ్‌నగర్ (క్రీడలు), న్యూస్‌టుడే : హైదరాబాద్‌లో శనివారం రాత్రి నిర్వహించిన రాజీవ్ గాంధీ స్మారక రాష్ట్రస్థాయి దేహదారుఢ్య (బాడీబిల్డింగ్) పోటీల్లో జిల్లాకు స్వర్ణం వరించింది. దివ్యాంగుల ఓపెన్ విభాగంలో మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన అబ్దుల్ ఇమ్రాన్ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన ఇమ్రాన్‌ను అమేచ్యూర్ బాడీబిల్డింగ్ సంఘం ప్రతినిధులు అభినందించారు.

మొయినుద్దౌలా గోల్డ్‌కప్‌కు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) 80 ఏళ్లుగా నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక మొయినుద్దౌలా గోల్డ్‌కప్ టోర్నీకి జిల్లా నుంచి ఇద్దరు క్రికెటర్లకు చోటు దక్కింది. 8 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత హెచ్‌సీఏ తెలంగాణ కంబైన్డ్ జిల్లాల జట్టుకు అవకాశం కల్పించడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన షాకీర్‌ఖాన్ (మహబూబ్‌నగర్), మహ్మద్ ఖయూం (గద్వాల) కంబైన్డ్ జిల్లాల జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం. రాజశేఖర్ వెల్లడించారు. ఆదివారం ఎండీసీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇద్దరిని ఘనంగా సన్మానించారు. మొయినుద్దౌలా గోల్డ్‌కప్‌లో 5 వికెట్లు, శతకాలు నమోదు చేస్తే నేరుగా రంజీ జట్టుకు ఎంపికయ్యే అవకాశం ఉందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎండీసీఏ కోశాధికారి ఉదేశ్‌కుమార్‌యాదవ్, ఉపాధ్యక్షుడు టి.సురేశ్‌కుమార్, ప్రతినిధులు అబ్దుల్లా, కృష్ణమూర్తి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మొయినుద్దౌలా గోల్డ్‌కప్‌కు ఎంపికైన క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం

11నుంచి 7కు..

(మొదటిపేజీ తరువాయి) చేశారు. 1976 ఆగస్టు 19న కాకతీయ విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. అప్పటి కేంద్ర విద్య శాఖ మంత్రి నూరుల్‌హాసన్ ప్రారంభించారు. తెలుగు, ఆంగ్లం, గణితం, రసాయశాస్త్రంతో కేయూ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత వృక్ష, జంతు శాస్త్రలు, వాణిజ్య, ఎకనామిక్స్, ప్రభుత్వ పాలనాశాస్త్రం, భౌతికశాస్త్రం, ఫార్మాసీ కోర్సులను ప్రవేశపెట్టింది. కేయూ ప్రథమ ఉపకులపతిగా భౌతిశాస్త్రం సీనియర్ చార్యులు బాధ్యతలు చేపట్టారు. 1979 నుంచి తన పరిధిని విస్తరిస్తూ వచ్చిన కేయూ 1985 వరకు వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఉన్నత విద్యను అందించింది. ఎంఫిల్, పీహెచ్‌డీతో పాటుగా ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, న్యాయ, ఫార్మసీ, డిగ్రీ కళాశాలల్లో విద్యను అందిస్తూ వస్తోంది. 2008లో కరీంగనగర్‌లో శాతవాహన విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. 2010లో కేయూ పరిధిలో ఉన్న 136 డిగ్రీ, 30 పీజీ, 20 బీఈడీ, 9 ఎంబీఏ, 4 ఫార్మసీ, ఒక న్యాయ కళాశాలను 'శాతవాహన'లో కలిపారు. కేయూలో అప్పటి వరకు ఉన్న 703 కళాశాలల నుంచి 200 శాతవాహనకు వెళ్లాయి. ఇప్పుడు ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలు తెలంగాణ, శాతవాహన విశ్వవిద్యాలయాల పరిధిలోకి పోతే ఇక కేయూకు 383 కళాశాలలు మాత్రమే ఉంటాయి. కేయూ పరిధిలోని కళాశాలలకు అనుమతులు ఫీజులు వస్తాయి. నాలుగు జిల్లాల నుంచి 2010 వరకు ఏడాదికి సూమారుగా రూ.3 నుంచి 4 కోట్ల వరకు వచ్చేవి. వీటితో పాటుగా ప్రతి విద్యార్థిపై విశ్వవిద్యాలయం ఫీజును వసూలు చేస్తుంది. వీటిని కళాశాలలు వారే వసూలు చేసి కేయూకు చెల్లించేవారు. ఈ ఫీజులు గతంలో సూమారు రూ.15 కోట్లు వచ్చేవి. కరీంనగర్‌లో శాతవాహన ఏర్పాటు తర్వాత ఫీజుల ఆదాయం సూమారు రూ.11 కోట్లకు పడిపోయింది. వచ్చే విద్యాసంత్సరం నాటికి ఈ ఆదాయం మరింత తగ్గుతుంది. మరో వైపు దూరవిద్యా కేంద్రంలో ఉన్న అధ్యాయన కేంద్రాలు 170 నుంచి 80 వరకు తగ్గాయి. వీటి ద్వార వచ్చే ఆదాయం కూడా గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయి.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

మడికొండ, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన అర్బన్ జిల్లా మడికొండలో ఆదివారం వెలుగు చూసింది. పర్వతగిరి మండలం గట్టికల్‌కు చెందిన సోమేశ్వర్ కుమార్తె మేఘన(28)ను మడికొండకు చెందిన పత్తిపాక ప్రవీణ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక పాప ఉంది. ఆదివారం మేఘన స్నానాల గదిలో జారి పడడంతో తలకు దెబ్బ తగిలి చనిపోయినట్లు భర్త ప్రవీణ్ చెబుతున్నారు. కొంత కాలంగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని, అల్లుడే హత్య చేసి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు కట్టు కథ అల్లుతున్నాడని మృతురాలు తండ్రి ఆరోపించారు. విషయం తెలుసుకున్న మడికొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్, ఎస్సై మధుప్రసాద్ ఘటనాస్థలానికి సందర్శించి వివరాలు సేకరించారు.

అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు రాకేష్ ఎంపిక

కురవి, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం చింతపల్లి గ్రామానికి చెందిన జర్రిపోతుల రాకేష్ అనే యువకుడు అంతర్జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ నుంచి శ్రీలంక దేశం కొలంబోలో ఈ నెల 23 నుంచి సెప్టెంబరు 4 వరకు జరగనున్న వెల్లాసా ఛాంపియన్ లీగ్ టీ 20 క్రికెట్ పోటీల్లో ఆడనున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్ లోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈయనకు చిన్నప్పటి నుంచి క్రికెట్‌ను చాలా ఇష్టపడే వాడు. ఎలాగైన జాతీయ స్థాయిలో రాణించి పేరు తెచ్చుకోవాలన్న పట్టుదలతో ఉన్న ఇతనికి శ్రీలంకలో ఆడే అవకాశం వచ్చింది.

అంతర్జాలం.. ఆలస్యం

(మొదటిపేజీ తరువాయి)

అంతర్జాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో మ్యాన్‌వల్ పద్ధతి అయితే నెలరోజుల్లో అనుమతులు వచ్చేవి. తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖ ప్రవేశపెట్టిన డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(డీపీఎంఎస్) ద్వారా నాలుగైదు నెలలైనా భవన నిర్మాణాలకు అనుమతులు రావడం లేదు. ప్రైవేటు లైసెన్సుడ్ సర్వేయర్ల చుట్టూ తిరిగి ప్రజలు ఆలసిపోతున్నారు. అధికారికంగా అనుమతులు రావడం లేదు. ఫలితంగా అనాధికారిక నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో పురపాలికల ఆదాయానికి గండి పడుతోంది. ఆన్‌లైను బిల్డింగ్ విధానం టౌన్‌ప్లానింగ్ అధికారులకు కాసుల పంట పండిస్తోంది. అక్రమ నిర్మాణదారుల నుంచి పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారు. వరంగల్ మహా నగరపాలక సంస్థ, జనగామ, మహబూబాబాద్ మున్సిపాలిటీలు, నర్సంపేట, పరకాల, భూపాలపల్లి నగర పంచాయతీల్లో వసూళ్ల దందా కొనసాగుతోంది. అధికారులు, పాలకవర్గం పెద్దలు ఒక్కటయ్యారు. అనధికార కట్టడాలను ప్రోత్సహిస్తున్నారు. ఆన్‌లైను బిల్డింగ్ అప్లికేషన్ విధానంపై టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, ప్రైవేటు సర్వేయర్లకు అవగాహన లేదు. 2-3 సార్లు శిక్షణ ఇచ్చినప్పటికీ పూర్తిగా అవగాహన రాలేదు. ప్రజల్లో ఏమాత్రం ప్రచారం లేదు. ఈ కారణంగా కూడా చాలా మంది అక్రమ నిర్మాణాలు చేసుకుంటున్నారు.

గ్రేటర్ వరంగల్‌లో ఇలా..:

వరంగల్ మహా నగరంలో అక్రమ నిర్మాణాల పేరుతో వసూళ్ల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. కొందరు కార్పొరేటర్లు, టౌన్‌ప్లానింగ్ క్షేత్రస్థాయి అధికారులు ఒక్కటయ్యారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా అనధికారిక కట్టడాలను ప్రోత్సాహిస్తున్నారు. ఇలాంటి వాటిని కట్టడి చేయాల్సిన పట్టణ ప్రణాళిక విభాగం ఉన్నతాధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అనధికారిక కట్టడాలతో మహా నగరపాలక సంస్థకు బెటర్‌మెంటు ఛార్జీలు, ప్లానింగ్ ఫీజుల ఆదాయం గణనీయంగా పడిపోయింది. రెండేళ్ల క్రితం ఏటా రూ.2.50కోట్ల ఆదాయం వచ్చేది. ఈ ఏడాది రూ.కోటి దాటా లేదు. గోపాలపురం, కోమటిపల్లి, భీమారం, రంగశాయిపేట, సాయినగర్ కాలనీ, గణేశ్ కాలనీ, రాంగోపాలపురం, నాయుడు పంపు దగ్గర, కీర్తీనగర్ కాలనీల్లో బిల్డర్లు వ్యక్తిగత భవనాలు నిర్మించి అమ్మకాలు చేస్తున్నారు. వాస్తవంగా పరిశీలిస్తే ఇందులో 80 శాతం వాటికి అధికారికంగా అనుమతులు రావు. ఎల్ఆర్ఎస్ ఉంటేనే భవన నిర్మాణ అనుమతులు ఇస్తున్నారు. బిల్డర్లు మాత్రం రూ.2500 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించేసి దర్జాగా భవనాలు నిర్మాణం చేస్తున్నారు. ఒక్కో భవనం నుంచి లకరం వసూలు చేస్తున్నట్లుగా తెలిసింది. 42 విలీన గ్రామాల్లో అయితే పరిస్థితి మరి దారుణంగా ఉంది. అక్కడన్నీ అక్రమ నిర్మాణాలే. పెద్ద ఎత్తున వసూళ్లు జరుగుతున్నట్లుగా తెలిసింది. కొన్ని ఫిర్యాదులు కమిషనర్ వద్దకు వచ్చాయి.

నర్సంపేటలో..: నర్సంపేట నగర పంచాయతీలోని పటేల్‌నగర్‌లో ఓ స్థిరాస్తి వ్యాపారి రెండు ఇళ్లకు ఎల్ఆర్ఎస్ చెల్లించి ఎటువంటి అనుమతుల్లేకుండా ఏడు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నగరపంచాయతీ అధికారులకు కేవలం జీ ప్లస్ వన్ నిర్మాణాల వరకే అనుమతిచ్చే అధికారముంది. కానీ పట్టణంలో నిబంధనలకు నీళ్లు వదిలి ఎటువంటి అనుమతుల్లేకుండా జీ ప్లస్ టూ(రెండు అంతస్తుల)భవనాల నిర్మాణాలు చేపట్టారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు.

పరకాలలో: పరకాల నగర పంచాయతీలో అధికారికంగా మొత్తం 7,500 ఇళ్లు ఉన్నాయి. అనధికారికంగా, అక్రమంగా నిర్మించినవి మరో వందకుపైగా ఉన్నాయి. కొందరు కౌన్సిలర్లు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. పరకాలకు చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి ఇంటిని నిర్మించుకున్నారు. అందుకు అనుమతి తీసుకోగా ఏడాదిలోనే పై అంతస్తును నిర్మించగా దానికి అనుమతి లేదు. ఓ వార్డులో ఎలాంటి అనుమతులు లేకుండా రెండు మూడు అంతస్తుల భవనం నిర్మించారు. భూపాలపల్లి రోడ్డులో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఓ కౌన్సిలర్ ఎలాంటి అనుమతి లేకుండా ఇంటిని నిర్మించగా పై అంతస్తు కూడా వేసుకున్నారు. మరో ఇద్దరు కౌన్సిలర్లు కూడా అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టారు.

మహబూబాబాద్‌లో: ప్రాంతీయ ఆసుపత్రి సమీపంలో ఓ వ్యాపారి ప్రధాన వీధిలో ఉన్న చేతి పంపును పూడ్చి అక్రమంగా ఇంటి నిర్మాణం చేశారు. పత్తిపాక వెళ్లే రహదారికి ఇరువైపులా బహుళ అంతస్థుల భవనాలు నిర్మాణం అవుతున్నా పట్టించుకోవడం లేదు. కంకరబోడ్ ప్రాంతంలోని ఇందిరాగ్రౌండ్‌లో, ఇల్లందు వెళ్లే రోడ్‌లో కురవి గేట్ ఎదురుగా, చివరి గేట్ నుంచి సిగ్నల్ కాలనీ వెళ్లే రహదారిలో, మరిపెడ వెళ్లే ప్రధాన రహదారిలో, కలెక్టర్ కార్యాలయం వెళ్లే రహదారిలో, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్మిస్తున్న భవనాలకు అనుమతి లేదు.

భూపాలపల్లి: భూపాలపల్లి నగర పంచాయతీలో అదే జోరు కొనసాగుతుంది. ఇక్కడ కౌన్సిలర్ల అనుమతి ఉంటే చాలు భవనం కట్టుకోవచ్చు. లేకుంటే చిన్నపాటి గోడ కట్టడం కూడా సులువు కాదు. ప్రతి నెలా సుమారు 50పై నిర్మాణాలు ప్రారంభమవుతున్నాయి. మంజూరుగనర్‌లో పదుల సంఖ్యలో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఓ రైతు రెండు అంతస్థుల భవన నిర్మాణాన్ని చేపట్టారు. అనుమతి కోసం రెండు నెలల క్రితం దరఖాస్తు పెట్టుకున్నారు. లింక్ డాక్యుమెంట్లు లేవని అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆయన రూ.10 వేలు అధికారులకు, మరో రూ.5 వేలు ఓ ప్రజాప్రతినిధికి ముట్టజెప్పి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. రెడ్డికాలనీ, రాంనగర్‌కాలనీలో ఇదే పరిస్థితి నెలకొంది.

30 రోజుల్లో పరిష్కరించాలి

–విద్యాధర్‌రావు, డీటీసీపీ

భవన నిర్మాణ అనుమతులు పారదర్శకంగా ఉండేందుకు తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖ ఆన్‌లైను బిల్డింగ్ అప్లికేషన్ విధానం అమల్లోకి తెచ్చింది. ఏ మున్సిపాలిటైనా సరే 30 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు పూర్తి చేయాలి. సాంకేతిక సమస్యల పేరుతో నెలల తరబడి దరఖాస్తులు తొక్కి పెడుతున్నారు. ఏమైనా ఇబ్బందులుంటే నేరుగా మా దృష్టికి తేవాలి. గత జూలై 20 తేదీ నుంచి కొత్త సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చింది. మారుతున్న కాలానికనుగుణంగా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మారాలి. ఆధునిక సేవలు అంది పుచ్చుకోవాలి. అక్రమ నిర్మాణాలనే సహించేది లేదు.

ఇంకెప్పుడు?

(మొదటిపేజీ తరువాయి)

వివిధ శాఖలు పంపిన ప్రతిపాదనలు(రూ.కోట్లలో)	
రోడ్లు, భవనాలు	74.50
ఆర్‌డబ్ల్యూఎస్, శానిటేషన్	30
దేవాదాయ	2.60
పంచాయతీరాజ్	3.46
నీటిపారుదల	1.00
వైద్య ఆరోగ్యశాఖ	1.33
గిరిజన ఇంజినీరింగ్(ఐటీడీఏ)	8.30
విద్యుత్తు	4.08
ఆర్టీసీ	2.48
జిల్లా పంచాయతీ అధికారి	1.50
పోలీస్	15.00
రెవెన్యూ	2.00
ఎక్సైజ్	0.19
ప్రచార, పౌరసంబంధాలు	0.14
పశుసంవర్ధక	0.12
టూరిజం	0.02
మత్స్యశాఖ	0.10
అగ్నిమాపక	0.32
గిరిజన అభివృద్ధి	0.12
రవాణా	0.06

పిలిచి గుత్తేదారులకు మేలు చేసే విధానాలను ఇంకా వీరు మరవడం లేదు.

అనుమతులిచ్చారు.. : జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే సమ్మక్క- సారలమ్మ జాతర జాతీయ పండుగగా గుర్తింపు పొందింది. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవానికి వివిధ రాష్ట్రాల నుంచి కోటిమందికి పైగా భక్తులు వస్తారు. జాతర ప్రారంభం కావడానికి ఇంకా ఐదు నెలల గడువే ఉంది. గతేడాది డిసెంబర్ 28, ఈఏడు జనవరి 28 తేదీల్లో మేడారం జాతరపైనే అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ మురళి భూపాలపల్లిలో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. జాతరను విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన పనులపై చర్చించారు. 20 శాఖలకు సంబంధించి చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు తయారుచేశారు. కనీసం ఆరు నెలల ముందు నుంచి అభివృద్ధి పనులు చేపట్టాలనే ఉద్దేశంతో రూ.147.37 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించింది. జిల్లాకు చెందిన స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌తో మాట్లారు. మే నెలాఖరున ముఖ్యశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి సుమారు రూ.100 కోట్లు మంజూరు చేశారు.

టెండర్ ప్రక్రియ.. పనులు పూర్తి చేయడం సులువు కాదు: ఏదైనా అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తే నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ చేస్తుంది. మేడారం జాతర విషయానికొస్తే ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి.. కానీ ఇంకా జీవో జారీ కాలేదు. జీవో వచ్చాక అధికారులు టెండర్లు పిలిచి.. గుత్తేదారులతో పనుల ఒప్పందాలు చేసుకోవడం.. తదితర పనులకు చాలా సమయం పడుతుంది. కొన్ని పనులకైతే రెండు నెలల సమయం కూడా పట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు ఆర్‌అండ్‌బీ తరపున ఏదైనా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలంటే గుత్తేదారుకు కనీసం 6 నెలల వ్యవధి ఇస్తారు. కొంచెం పెద్ద పని అయితే ఏడాది, 18 నెలల గడువు కూడా ఉంటుంది. ముందుగా ఆన్‌లైన్‌లో టెండర్ పిలిస్తే 21 రోజుల గడువు ఉంటుంది. ఆ తర్వాత టెండర్లు విప్పి గుత్తేదారుల అర్హతను అధికారులు పరిశీలిస్తారు. టెండర్లు వేసిన గుత్తేదారులలో స్వచ్ఛందంగా తప్పుకోవడానికి మరో వారం రోజుల సమయం ఇస్తారు. అనంతరం టెండర్లను పరిశీలించి గుత్తేదారు నియామకం జరుగుతుంది. పనిని బట్టి 3, 6, 12, 18 నెలల వ్యవధి ఇస్తూ పని ఒప్పందం చేసుకుంటారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఐబీ, ఐటీడీఏలలోని ప్రతి ఇంజినీరింగ్ శాఖ పద్ధతి ఇలాగే ఉంటుంది. పనుల వారీగా మైల్‌స్టోన్స్ కూడా ఇస్తారు. మేడారం జాతర విషయానికొస్తే రోడ్లు, భవనాల శాఖే అత్యధికంగా రూ.75 కోట్లతో ప్రతిపాదనలు పంపించింది. ఈ శాఖ తరపున ఇప్పుడు పనులు ప్రారంభిస్తే 2018 జనవరి 31 జరిగే జాతర సమయానికి కూడా పూర్తిచేయడం కష్టమే. మరి అలాంటిది... ఇప్పటివరకు ఇంకా టెండర్ ప్రక్రియే పూర్తికాలేదు. పనులు మొదలుపెట్టేది ఎప్పుడో జిల్లా అధికారులకే తెలియాలి.

గతంలో ఇలా జరిగేది..: మేడారం జాతర అభివృద్ధి పనుల విషయంలో హడావుడి పనులు ఎక్కువగా జరిగేవి. జాతరకు మూడు, నాలుగు నెలల ముందు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసేది. అధికారులు వారం రోజుల్లో పూర్తయ్యే షార్ట్‌టెంటర్లు పిలిచి గుత్తేదారులతో ఒప్పందాలు చేసుకునేవారు. గుత్తేదారులు కూడా చాలా ఆలస్యంగా పనులు మొదలుపెట్టేవారు. పనులు చాలా నాసిరకంగా జరిగేవి. ఓవైపు భక్తులు జాతరకొస్తేంటే..మరోవైపు అభివృద్ధి పనులు జరిగేవి. జాతర ముగిసాక కొద్ది నెలలకు పనుల జాడ కన్పించేది కాదు. దశాబ్దాల పాటు సేవలందించేలా చేపట్టాల్సిన పనులు రెండేళ్ల జాతరకొచ్చేసమయానికి ఆనవాళ్లు కన్పించేవి కావు. ఇలా చేసిన పనినే మళ్లీ, మళ్లీ చేయడానికి అధికారులు ప్రతిపాదనలు పంపించి నిధులు మంజూరు చేయించుకోవడం పరిపాటిగా మారిపోయింది.

పరిపాలన అనుమతులకోసం పంపించాం

–ఆకునూరి మురళి, జయశంకర్ జిల్లా కలెక్టర్

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనులకు సంబంధించి పరిపాలన అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించాం. అనుమతులు రాగానే టెండర్లు పిలిచి గుత్తేదారులతో ఒప్పందాలు చేసుకుంటాం. గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

"కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందనే" అనే చందంగా తయారైంది కాకతీయ విశ్వవిద్యాలయంలోని పలు కోర్సుల పరిస్థితి. ఉన్నత విద్యారంగంలో ఉత్తమ ప్రమాణాలను పాటించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ మానవ నిర్వహణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సంస్థలు రూపొందించిన కఠిన నిబంధనలు పలు కోర్సులను కనుమరుగు చేస్తున్నాయి. డిస్టెంట్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్), జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) వారు అమలు చేస్తున్న నిబంధనలతో కేయూ అందిస్తున్న కోర్సుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. నిబంధనలు సంస్కరించే విధంగా ఉండాలి. కానీ కోర్సులకు ఎసరు తెచ్చేవిధంగా ఉంటే అసలుకే మోసం వస్తుందని కేయూ అధ్యాపకవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గుదిబండలా మారిన కఠిన నిబంధనలతో ఎన్ని కోర్సులు ఊడాయి? అధికారుల వైఖరేంటి? భవిష్యత్తులో ఈ కోర్సులను పునరుద్ధరిస్తారా? అనే అంశాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.



కఠిన నిబంధనలు...

కనుమరుగవుతున్న కోర్సులు

– న్యూస్‌టుడే, కేయూ క్యాంపస్

- భవిష్యత్తులో పునరుద్ధరణ సందేహమే?
- నష్టపోతున్న విద్యార్థులు

గ్రామీణ విశ్వవిద్యాలయంగా పేరొందిన కాకతీయకు నిబంధనలు కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. ప్రవేశాలు తగ్గి విద్యార్థులకు నష్టం కల్గించడంతోపాటు అటు విశ్వవిద్యాలయం, ఇటు దూరవిద్యకేంద్రం ఆదాయానికి గండికొడుతున్నాయి. విశ్వవిద్యాలయాల పరిపుష్టికి తగినన్ని నిధులు ఇవ్వడంపైన ప్రభుత్వం శ్రద్ధ కనబరచకపోవడంతో అవి అంతర్గత వనరులపైన దృష్టి కేంద్రీకరించాయి. ఇందుకోసం డిమాండ్ ఉన్న కోర్సుల నిర్వహణకు ప్రణాళికలు రచిస్తున్నాయి. అధికంగా ఆర్థిక వనరులను సమకూర్చే దూరవిద్య కేంద్రంలో కొత్త కోర్సుల రూపకల్పనకు నిర్వాహకులు కృషి చేస్తుండగా అన్ని అడ్డంకులే ఎదురవుతున్నాయి. వీటిని అధిగమించడానికి కృషి చేయాల్సిన కేయూ ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో పలు కోర్సుల్లో ప్రవేశాలు నిలిచిపోయాయి.

ఉపాధ్యాయ విద్య కోర్సుల్లో..

● కేయూ పరిధిలోని వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో మొత్తం 52 విద్యా కళాశాలలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం వరకు ఈ కళాశాలల్లో 100 చొప్పున బీఈడీ సీట్లు అందుబాటులో ఉండేవి. మొత్తంగా 5200 సీట్లు ఉండేవన్న మాట. బీఈడీ కోర్సును రెండేళ్ల కోర్సుగా మార్చిన తర్వాత ఈ సీట్లు తగ్గుతూ వస్తున్నాయి. గతేడాది నుంచి దాదాపు అన్ని కళాశాలల్లో కేవలం 50 సీట్ల చొప్పున మాత్రమే ఉన్నాయి. కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు లేవని, అధ్యాపకులు లేరని సీట్లు తగ్గించారు. కేయూ పరిధిలోని అన్ని జిల్లాల్లో 2 వేలకుపైగా సీట్లు తగ్గాయి. విద్యార్థులకు నష్టం కలుగుతుండటంతోపాటు ఆదాయం తగ్గింది.

● ఎంఈడీ పరిస్థితి దారుణంగా ఉంది. 2014-2015 వరకు కేయూ పరిధిలోని నాలుగు కళాశాలల్లో 200 సీట్లు అందుబాటులో ఉండేవి. జనగామలోని ఏకశిల, వరంగల్‌లో ఎల్‌బీ, ఖమ్మంలోని బ్రౌన్స్, కేయూ క్యాంపస్‌లోని విద్యాకళాశాలల్లో 50 చొప్పున ఎంఈడీ సీట్లు ఉండేవి. ఈ సీట్లను భర్తీ చేయడానికి కేయూ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తోంది. 200 సీట్ల కోసం 4 వేల మంది పోటీపడేవారు. గత విద్యాసంవత్సరం నుంచి మూడు కళాశాలల్లో ఎంఈడీ కోర్సు నిర్వహణకు కేయూ అధికారులు అనుమతి ఇవ్వడంలేదు. ఎన్‌సీఈటీ నిబంధనల ప్రకారం కళాశాలల్లో సౌకర్యాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, అధ్యాపకులు లేరని అనుమితివ్వలేదు. కేవలం కేయూ విద్యా కళాశాలలో మాత్రమే 50 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటి కోసం అధికంగా విద్యార్థులు పోటీపడుతున్నారు. ప్రతి కళాశాలలో ఎంఈడీ నిర్వహణకు ఇద్దరు ఆచార్యులు, ఇద్దరు సహాయ ఆచార్యులు, ఆరుగురు సహ ఆచార్యులు ఉండాలని ఎన్‌సీటీఈ నిబంధనలు చెబుతున్నాయి. వీటి ప్రకారం అధ్యాపకులు లేరని చెపుతూ అనుమతి ఇవ్వని అధికారులు అదే సూత్రాన్ని మినహాయించి కేయూకు ఎలా ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. కేయూలో ఎంఈడీ నిర్వహణకు 10 మంది అధ్యాపకులు అవసరముండగా ప్రస్తుతం ఒక ఆచార్యుడు, ఒక సహ ఆచార్యురాలు మాత్రమే ఉన్నారు. ఇక బీఈడీలో వంద సీట్లు ఉండగా ఇందులో అందరూ ఒప్పంద అధ్యాపకులే ఉన్నారు.

నిబంధనల అమలులో వివక్షత

నిబంధనలు అమలు చేయడంలో కేయూ అధికారులు వివక్షను ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశ్వవిద్యాలయం కాబట్టి ఎన్‌సీఈటీ నిబంధనలు అవసరంలేదని అధికారులంటున్నారు. కానీ కేయూ దూరవిద్య కేంద్రానికి వర్తిస్తాయనడం దారుణమని కొందరు చెబుతున్నారు. దూరవిద్య కేంద్రం నిర్వాహకులు కోర్సులకు అనుమతి తీసుకురావడంలో చేస్తున్న కృషి అభినందనీయమని విద్యార్థులు అంటున్నారు. వీరికితోడు కేయూ ఉన్నతాధికారులు నిబంధనల సడలింపు కోసం కేంద్ర సంస్థలతో మాట్లాడితే సత్ఫలితాలు ఉంటాయని వారంటున్నారు. సాయన్న బాధ్యతలు చేపట్టిన తరువాత కేయూలోని, దూరవిద్య కేంద్రంలోని డిమాండ్ ఉన్న కోర్సులు కనుమరుగుకావడం ఆయన పాలనపైన ప్రభావాన్ని చూపుతున్నాయని అధ్యాపకవర్గాలు అంటున్నాయి. ఆయన చొరవ చూపి కోర్సుల పునరుద్ధరణకు కృషి చేయాలని, లేదంటే ఆర్థిక వనరుల కొరత తీవ్రతరమవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

రెగ్యులర్ విద్యలో..

గతంలో బీఈడీ సీట్లు **5200**

ప్రస్తుతం **2 వేలు**

ఎంఈడీ సీట్ల సంఖ్య **200**

ప్రస్తుతం **50**

దూరవిద్యలో..

కోల్పోయిన బీఈడీ సీట్లు **500**

ఎంఈడీలో **250**

గతంలో అధ్యయన కేంద్రాల సంఖ్య **170**

ప్రస్తుతం **70**

ఐదేళ్ల కిందట డిగ్రీ ప్రవేశ పరీక్ష రాసే వారి సంఖ్య **30 వేలు**

గతేడాది **3 వేలు**

దూర విద్య కేంద్రంలో...



డెబ్ కఠిన నిబంధనలు, కేయూ అధికారుల ఉదాసీనత ఫలితంగా దూరవిద్య కేంద్రంలోని పలు కోర్సుల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. డెబ్ అనుమతి లేదని గత విద్యాసంవత్సరానికిగాను పలు పీజీ కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహించలేదు. ఎంఏ తెలుగు, గణితం, ఎంఎస్‌డబ్ల్యూ, గ్రంథాలయం, జర్నలిజంలాంటి డిమాండ్ ఉన్న కోర్సులకు అనుమతించలేదు. ఇప్పటికీ రెండేళ్ల కిందట వరకు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు అందిస్తున్న బీఈడీ, ఎంఈడీ కోర్సులకు కూడా అనుమతి లభించలేదు. ఫలితంగా బీఈడీలో 500, ఎంఈడీలో 250 సీట్లు కనుమరుగయ్యాయి. పదోన్నతుల కోసం బీఈడీ, ఎంఈడీ చేయాలనే ఉపాధ్యాయులకు నిరాశ మిగులుతుంది. ఇక ఈ కేంద్రం రెండేళ్ల వరకు దేశంలోని పలు ప్రాంతాల్లో అధ్యాయన కేంద్రాలను నిర్వహించేది. డిగ్రీ, పీజీ కోర్సులతోపాటు డిప్లొమా కోర్సులను అందించేది. గతంలో 170 కేంద్రాలుండగా ప్రస్తుతం 70కి చేరుకుంది. గతేడాది నుంచి కేవలం తెలంగాణ ప్రాంతంలో మాత్రమే అధ్యయన కేంద్రాలను అనుమతి ఇవ్వడంతో పరిస్థితి ఆందోళన కల్గిస్తుంది. డిగ్రీ ప్రవేశ అర్హత పరీక్షకు గతంలో 30 వేల మంది వరకు పరీక్షలు రాయగా గత విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షకు కేవలం 3 వేల మంది మాత్రమే హాజరయ్యారు. ఇవే పరిస్థితులు కొనసాగితే కేయూకు ఆర్థిక వనరులను సమకూర్చిపెట్టే దూరవిద్య కేంద్రం సంక్షోభంలో పడటం ఖాయమని అధ్యాపక, ఉద్యోగవర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న జగన్‌మోహన్

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే : పంటల సాగులో కీలకమైన విత్తనాలు, ఎరువుల సరఫరాలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్. ఎం. జగన్‌మోహన్ డీలర్లకు సూచించారు. ఆదివారం హన్మకొండలోని వ్యవసాయ శాఖ రైతు శిక్షణ కేంద్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని డీలర్లకు ఇస్తున్న డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ కోర్సు శిక్షణ కార్యక్రమంలో జగన్‌మోహన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విత్తనాలలో నాణ్యత లోపంతో ఏటా రైతులకు నష్టం జరుగుతున్న సంఘటనలు చూస్తున్నామన్నారు. డీలర్లకు అవగాహన లేకపోవడంతోనే మోసాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పంటల సాగులో సమస్యలు ఏర్పడితే వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సిఫారసుల మేరకు పురుగు మందులు, ఎరువులు, విత్తనాలను సరఫరా చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించే ప్రతి డీలరు తప్పకుండా డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ కోర్సు పూర్తి చేయాలనే నిబంధనను విధించినట్లు తెలిపారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారు మాత్రమే దుకాణాలను నిర్వహించేందుకు అర్హులన్నారు. ఈ కోర్సులో ప్రతి డీలరు చేరాలని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోనే శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలను వ్యవసాయశాఖ ద్వారా జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అయిదు జిల్లాల వ్యవసాయాధికారులు ఉషాదయాల్, అనూరాధ, శత్రునాయక్, వీరునాయక్, వరంగల్ ఏడీఏ కృష్ణారెడ్డి, ఆత్మప్రాజెక్టు డైరెక్టర్ శివప్రసాద్, శిక్షణ పొందుతున్న డీలర్లు పాల్గొన్నారు.

26 నుంచి కేయూ బీఫార్మసీ పరీక్షలు

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం వారు అందిస్తున్న బీఫార్మసీ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్. మహేందర్‌రెడ్డి, అదనపు అధికారి ఆచార్య వి. రామచంద్రంలు ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 26, 28, 30, వచ్చే నెల 1, 4, 6 తేదీల్లో పరీక్షలు ఉంటాయని వివరించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ సంబంధిత కళాశాలల నుంచి హాల్‌టికెట్లను పొందవచ్చునని అధికారులు స్పష్టం చేశారు.

ప్రశాంతంగా జూనియర్ సివిల్ జడ్జి ఎంపిక ప్రాథమిక పరీక్ష

సుబేదారి, న్యూస్‌టుడే: వరంగల్ అర్బన్ జిల్లా సుబేదారి ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జూనియర్ సివిల్ జడ్జి ఎంపిక కోసం ప్రాథమిక పరీక్ష నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్ రామచంద్రమూర్తి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్ష నిర్వహణకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ అమలు చేసి డీసీపీ వేణుగోపాల్‌రావు పర్యవేక్షించారు. పరీక్ష రాసేందుకు 567 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 106 మంది హాజరుకాలేదు. 461 మంది పరీక్ష రాశారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య



మాట్లాడుతున్న కృష్ణయ్య

బాలసముద్రం, న్యూస్‌టుడే : ఓబీసీ ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ర్యాగ కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్ఐసీ ఓబీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం వరంగల్ డివిజనల్ సర్వసభ్య సమావేశం బాలసముద్రంలోని ఎల్ఐసీ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల పరిధిలోని అసోసియేషన్ బాధ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జాతీయ నేత కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. రాజ్యాంగం సవరించి పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని గతంలో ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను, కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని కలిసి సమస్యలు వివరించామన్నారు. ఆ తర్వాత ఉద్యోగులు ఎంతమంది ఉన్నారనే గణాంకాలు బయటకు తీసి పార్లమెంట్‌లో చర్చకు తెస్తే సభ్యులు మద్దతు ఇవ్వలేదన్నారు. పదోన్నతుల్లో రిజర్వేషన్ నిలిచిపోయిందని తెలిపారు. ఇక్కడితో నిరాశ చెందకుండా హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని పోరాడాలన్నారు. రిజర్వేషన్ అమలులో ఉన్నప్పటికీ అందుకు తగ్గ ఉద్యోగాలను భర్తీ చేయడంలేదన్నారు. దేశంలో 14 లక్షల ఉద్యోగాలు పలు శాఖల్లో ఖాళీలు ఉన్నాయని చెప్పారు. విద్యతోనే బీసీలు అభివృద్ధి చెందుతారనే ఉద్దేశంతో అనేక పోరాటాలు చేసి సాధించుకున్నామని తెలిపారు. రిజర్వేషన్లు, పదోన్నతుల్లో ఎవరికి ఎలాంటి సమస్యలు తలెత్తినా తాను అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్ఎల్‌కే. ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షుడిగా కె. సురేందర్, ప్రధాన కార్యదర్శిగా సోమేశ్వరయ్య, కోశాధికారిగా లక్ష్మీపతి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్, బీసీ సంఘాల నేతలు అజయ్‌కుమార్, స్వామినాథన్, అశోక్, కోలా జనార్దన్‌గౌడ్, యాదగిరి, బొనగాని యాదగిరిగౌడ్, బుట్టి శ్యాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ తూర్పు

క్రీడా పోటీలు ప్రారంభం

మడికొండ, న్యూస్‌టుడే: క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం సాధ్యమని, యువత ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటలు ఆడే అవకాశాన్ని వదులుకోవద్దని మడికొండ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మధుప్రసాద్ అన్నారు. కాజీపేట మండలంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను మడికొండ ఎస్సై మధుప్రసాద్ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు.

బోనమెత్తిన మహిళా లోకం

శ్రావణమాసం ఆఖరి రోజున ఉత్సాహంగా వేడుకలు



బోనంతో వచ్చి మొక్కులు అప్పగిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

గిర్మాజీపేట, కరీమాబాద్, న్యూస్‌టుడే: శ్రావణ మాసం ఆఖరి రోజు ఆదివారం నగరంలోని వాడవాడలా పోచమ్మ బోనాలు పండగను నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో బోనాలను పోచమ్మ అమ్మవారికి సమర్పించారు. స్థానిక 17వ డివిజన్ గిర్మాజీపేటలో స్థానిక ముదిరాజ్‌లు ఉమ్మడిగా పోచమ్మకు బోనాలు చేశారు. శివసత్తుల పునకాలు, మేళతాళాల మధ్య బోనాలతో తరలివచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో భాజపా అర్బన్ జిల్లా నాయకుడు చింతాకుల సునీల్, ముదిరాజ్ పెద్దలు పాల్గొన్నారు. అలాగే 18వ డివిజన్ స్టేషన్‌రోడ్డులోని పోచమ్మ దేవాలయంలో స్థానిక కార్పొరేటర్ శామంతుల ఉషశ్రీ, శ్రీనివాస్ దంపతులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆఖరి రోజు కావడంతో పోచమ్మ దేవాలయం బోనాలతో కిక్కిరిసిపోయింది. కరీమాబాద్‌లోని కాశీకుంట, ఎస్‌ఆర్‌ఆర్‌తోట, సాకరాశికుంట కట్టపై గల పోచమ్మ దేవాలయంలో స్థానికులు బోనాలు చేశారు.

రామన్నపేట, న్యూస్‌టుడే: శ్రావణమాసంలో పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించేందుకు చివరి వారం కావడంతో వరంగల్ మహా నగరంలో పండుగ వాతవరణం నెలకొంది. వరంగల్ ప్రాంతం 24వ డివిజన్ రఘునాథ్‌కాలనీ, ఓఎస్‌నగర్, పోతననగర్ కాలనీలకు చెందిన మహిళలు పాపయ్యపేట పోచమ్మ దేవాలయానికి డప్పు చప్పుళ్లతో ర్యాలీగా వచ్చారు. కార్పొరేటర్ గుండు ఆశ్రిత మహిళలతో కలిసి పోచమ్మ తల్లికి పూజలు చేశారు. మోక్షారామం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామన్నపేట పోచమ్మ దేవాలయంలో ప్రత్యేకపూజలు జరిగాయి. కార్యక్రమంలో స్థానిక నాయకులు సదాంత్, రాజు, వీరన్న, శివ, వడిచర్ల ప్రసాద్, బిట్ల రవి పాల్గొన్నారు.



గిర్మాజీపేటలో బోనాలతో వస్తున్న ముదిరాజ్‌లు



బోనాలతో వస్తున్న మాజీ కార్పొరేటర్ కల్పన స్థానికులు

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఖిలావరంగల్‌లో పోచమ్మ బోనాల సందడి నెలకొంది. శ్రావణ మాసం చివరి ఆదివారం కావడంతో పడమరకోటలోని ప్రజలు సామూహికంగా బోనాలను చేశారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కొండా సురేఖ ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలతో పాటు బోనాన్ని ఎత్తుకొన్నారు. దూప, దీప, నైవేద్యాలతో అలంకరించిన బోనాలను డప్పు వాయిద్యాల నడుమ ప్రదర్శనగా తీసుకువెళ్లారు. శివసత్తుల పూనకాలు, నృత్యాల నడుమ తీసుకెళ్లిన బోనాలను స్థానిక పోచమ్మ దేవాలయంలో సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. వేడుకల్లో 8వ డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ సంగరబోయిన చందర్, పుప్పాల రాజేందర్ తెరాస కార్యకర్తలు పాల్గొన్నారు.



పడమరకోటలో బోనంతో ఎమ్మెల్యే సురేఖ



పాపయ్యపేటలో కార్పొరేటర్ ఆశ్రిత, మహిళల పూజలు

అంధకారంలో వాసవికాలనీ

కొత్తవాడ (వాసవికాలనీ), న్యూస్‌టుడే: నగరంలోని 28వ డివిజన్ వాసవికాలనీ అంధకారంలో చిక్కుకుంది. కాలనీలోని వీధి దీపాలు మూడు నెలలుగా వెలగడం లేదు. ఈ విషయమై స్థానికులు పలుమార్లు మహా నగర పాలకసంస్థ అధికారులకు ఫిర్యాదుచేసినా ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చాలా కాలంగా ఈ వీధిలో వీధి దీపాల సమస్య అపరిష్కృతంగా మాగిలింది. కాలనీలో సాయంత్రమైతే చిమ్మ చీకట్లు అలుముకుంటున్నాయి. నాలుగు నెలల క్రితం మరమ్మతులు చేసి కొత్త దీపాలు బిగించినా అవి నెల రోజులే వెలిగాయి. ఆ తర్వాత సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. అప్పటి నుంచి సమస్యను పరిష్కరించేవారే లేకుండాపోయారు. వీధి దీపాలు వెలగకపోవడంతో కాలనీలోకి ఎవరెవరు వస్తున్నారో తెలియకుండా పోయిందని, కొత్తవాళ్ల సంచారం ఎక్కువైందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సాయంత్రం అయిందంటే మహిళలు, విద్యార్థినులు భయంభయంగా వెళ్లాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలనీలో వీధి దీపాలు వెలిగేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సీకేఎం ఆసుపత్రిలో మహిళా గార్డులు



ఆసుపత్రిలో గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న మహిళా గార్డులు

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: వరంగల్‌లోని సీకేఎం ప్రసూతి ఆసుపత్రిలో కొత్తగా మహిళా సెక్యూరిటీ గార్డులు విధుల్లోకొచ్చారు. ఇప్పటివరకు మగవారు మాత్రమే ఉండేవారు. అయితే ప్రసూతి ఆసుపత్రి కావడంతో ఎక్కువగా గర్భిణులు వస్తుంటారని, వారిని లోపలకు, బయటకు పంపించేందుకు ఎప్పుడైనా వాగ్వాదం జరిగితే మహిళా గార్డులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇటీవల ఓ మహిళ మద్యం తాగివచ్చి ఆసుపత్రిలో గంటపాటు హడావుడి సృష్టించింది. అడ్డుకోబోయిన మహిళా కానిస్టేబుల్‌పై తిరగబడిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో కొత్తగా ముగ్గురు మహిళా సెక్యూరిటీ గార్డులను నియమించారు. వీరు విధుల్లో చేరి ఆసుపత్రి ప్రసూతి వార్డు ప్రవేశద్వారం వద్ద కాపలా ఉంటున్నారు. ప్రసూతి రోగుల వద్దకు వారి బంధువులను అనుమతి లేకుండా పంపించకుండా ఆస్పత్రిలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూస్తున్నారు.

కోటను సందర్శించిన జయశంకర్ భూపాలపల్లి జేసీ



అమయ్‌కుమార్‌కు చరిత్రను వివరిస్తున్న కేంద్ర పురావస్తు శాఖ సిబ్బంది

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఖిలా వరంగల్ కోట ప్రాంతాన్ని ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జాయింట్ కలెక్టర్ అమయ్‌కుమార్ కుటుంబ సభ్యులతో సందర్శించారు. మధ్య కోట కళాతోరణాల నడుమ శిల్పాలతో పాటు కుష్ మహల్, ఏకశిలగుట్ట, స్వయంభూ దేవాలయం, రాతికోట, మట్టికోటలను తిలకించారు. వీరికి కాకతీయుల చరిత్రను కేంద్ర పురావస్తు శాఖ కో ఆర్డినేటర్ శ్రీకాంత్, సిబ్బంది వివరించారు.

నేతాజీ ఆదర్శ పరపతి సంఘం కార్యవర్గం ఎన్నిక

కరీమాబాద్, న్యూస్‌టుడే: స్థానిక నేతాజీ ఆదర్శ పరపతి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం నిర్వహించిన వార్షిక సమావేశంలో ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మండ వెంకన్నగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడుగా సూరినేని రామారావు, అధ్యక్షుడిగా నాగపూరి వెంకటస్వామి, ఉపాధ్యక్షులుగా పాటి రవీందర్, నాగపూరి సంజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా మండ వెంకన్నగౌడ్, ఉప కార్యదర్శులుగా పొగాకు జ్ఞానయ్య, వంగరి కోటేశ్వర్, కోశాధికారిగా బైరి దయాసాగర్, ఉప కోశాధికారిగా అన్న రాజేశం, ఆర్గనైజర్లు గట్టు రమేశ్, కోండూరు శివప్రసాద్, ఆడిటర్‌గా కాజీపేట తిరుమలయ్యతో పాటు ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రాజీవ్‌గాంధీ జయంతి

కాశీబుగ్గ చౌరస్తా, న్యూస్‌టుడే: కాశీబుగ్గ చౌరస్తాలో ఆదివారం భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని అర్బన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజేశ్ ఆధ్వర్యంలో మార్కెట్ మాజీ ఛైర్మన్ మంద వినోద్‌కుమార్, అర్బన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు రాజనాల శ్రీహరి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అయూబ్, గోరంట్ల రాజు, ఖయ్యూం, కొత్తపల్లి శ్రీనివాస్, నిషాంత్‌గౌడ్, బొట్ల ప్రసాద్, గిన్నారపు రాజు, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

శివనగర్, గిర్మాజీపేట, న్యూస్‌టుడే: శివనగర్‌లోని డానోబోస్కో నవజీవన్ అనాథ ఆశ్రమంలో ఆదివారం కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మంద వినోద్‌కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొని అనాథ పిల్లల మధ్య కేకుకోశారు. అనంతరం చిన్నారులకు అన్నదానం చేశారు. వారితో కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆయూబ్, కొత్తూరు రాజు, బాల్యకుమార్, గణేశ్, భిక్షపతి, నిషాంత్‌గౌడ్, సుభాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వరంగల్ సీకేఎం ఆసుపత్రిలో రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పోశాల పద్మ ఆధ్వర్యంలో ప్రసూతి మహిళలకు పండ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మహిళా కాంగ్రెస్ నేతలు జ్యోతి, పార్వతమ్మ, మేకల అరుణ, లక్ష్మి, నర్మదరెడ్డి, స్వరూప, నాయకులు బెడిదె వీరన్న, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. కరీమాబాద్‌లో గూడూరు మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ రాజనాల శ్రీహరి ముఖ్యఅతిథిగా పాల్గొని కేకు కోశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు అక్తర్, సామల శ్రీధర్, సువర్ణ, శివమూర్తి, అమ్మీర్, రాందేవ్, ఆదాం. ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు వినోద్‌కుమార్, శ్రీహరి తదితరులు